



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 94 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 14 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 94 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 14 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur






| మున్సిపాలిటీలు : 116 | |
|---|---|
| కాంగ్రెస్ | 56 |
| బీఆర్ఎస్ | 10 |
| బీజేపీ | 01 |
| ఇతరులు | 01 |
| **కార్పొరేషన్లు : 07** | |
| కాంగ్రెస్ | 03 |
| బీఆర్ఎస్ | 00 |
| బీజేపీ | 00 |
| ఇతరులు | 00 |



మున్సిపల్ ఎన్నికల్లో

# కాంగ్రెస్ హవా

- రెండో స్థానంలో బీఆర్ఎస్
- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం
- 116 మున్సిపాలిటీలకు గాను 66 కైవసం చేసుకున్న అధికార పార్టీ
- 13 మున్సిపాలిటీలతో రెండో స్థానంలో బీఆర్ఎస్
- 37 చోట్ల హంగ్.. ఛైర్మన్ ఎన్నికల్లో స్వతంత్రులదే కీలకపాత్ర
- ప్రధాన కార్పొరేషన్లలోనూ కొనసాగిన కాంగ్రెస్ ఆధిపత్యం

వివరాలు 2లో..

## మా రెండేళ్ల పాలనకు ఈ ఫలితాలే నిదర్శనం: సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం
- ఇది తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని సీఎం రేవంత్ వ్యాఖ్య
- పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి దక్కిన తీర్పుగా అభివర్ణన
- ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నట్లు ప్రకటన
- ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన బలమైన తీర్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు



రణవీర్ సింగ్ ను చంపేస్తామంటూ

## బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

- డైరెక్టర్ రోహిత్ శెట్టికి కూడా వార్నింగ్
- వారి వద్ద పనిచేస్తున్న వారిని హత్య చేస్తామని హెచ్చరిక
- వాట్సాప్ లో ఆడియో మెసేజ్ పంపిన దుండగుడు

మిగతా2లో



## నల్గొండ అంటే కాంగ్రెస్ అని మరోసారి రుజువు చేశారు

- నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం
- నల్లగొండను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానన్న మంత్రి కోమటిరెడ్డి
- వారానికి రెండు రోజులు స్థానికంగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు ప్రకటన

మిగతా2లో



ఒక్క ఓటుతో వరించిన

## విజయం

- కల్వకుర్తి మున్సిపాలిటీ పదో వార్డు ఫలితాలు
- కాంగ్రెస్ అభ్యర్థికి 259, బీఆర్ఎస్ అభ్యర్థికి 258 ఓట్లు
- పరకాలలోనూ ఒక్క ఓటుతో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి

హైదరాబాద్ పెన్ పవర్:మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర ఫలితాలు వెలువడుతున్నాయి. ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతను మార్చేసింది. రెండు చోట్ల ఒక్క ఓటుతో

మిగతా2లో

ఒకే కాలనీలో 6 పార్కులను

## కాపాడిన హైడ్రా

- హైదరాబాద్‌లో పార్కుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం
- ఒకేరోజు రూ.34 కోట్ల విలువైన 3041 గజాల భూముల స్వాధీనం
- భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులు, గుడిమల్కాపూర్‌లో ఒక పార్కుకు విముక్తి



- హైడ్రా చర్యలతో స్థానికుల సంబరాలు, భారీ ర్యాలీలు
- ప్రజావాణి ఫిర్యాదులపై కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో వేగంగా స్పందన

మిగతా2లో




వచ్చేది వేసవి కాలం...

## నిప్పుతో జాగ్రత్త

- వేసవి దృష్ట్యా అగ్ని ప్రమాదాలపై హైడ్రా అవగాహన కార్యక్రమాలు
- కేవలం 30 సెకన్లలో మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని రంగనాథ్ వెల్లడి
- నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణం అని స్పష్టీకరణ

హైదరాబాద్ పెన్ పవర్:రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అగ్ని ప్రమాదాల పట్ల నగర ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. నిప్పుతో ఊహించని ప్రమాదం పొంచి ఉంటుందని, ప్రతిఒక్కరూ అగ్నిమాపక నిబంధనలను తప్పనిసరిగా


మిగతా2లో

## బీఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించింది.. కొత్తగూడెంలో వారికి ఓపెన్ ఆఫర్ ఇచ్చాం

- 30 శాతానికి పైగా స్థానాలు గెలుచుకున్నామన్న కేటీఆర్
- కొత్తగూడెంలో సీపీఐ పార్టీకి మద్దతిస్తామని ఓపెన్ ఆఫర్ ఇచ్చామన్న కేటీఆర్
- తెలంగాణలో మేమే ప్రత్యామ్నాయమని ప్రజలు స్పష్టం చేశారన్న కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మంచి ఫలితాలను సాధించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత ఏడాది చివరలో జరిగిన పంచాయతీ, ఇప్పుడు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు

మిగతా2లో



## హైదరాబాద్‌లో అక్రమ సరోగసీ రాకెట్... లేడీ డాక్టర్ ను అరెస్ట్ చేసిన ఈడీ

- అక్రమ సరోగసీ కేసులో డాక్టర్ నమ్రతను అరెస్ట్ చేసిన ఈడీ
- సంతానం లేని దంపతులకు శిశువులను అక్రమంగా అమ్మకాలు
- మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు
- ఫిబ్రవరి 26 వరకు నిందితురాలికి జ్యుడీషియల్ రిమాండ్
- గతంలోనూ పలు కేసుల్లో అరెస్టయిన డాక్టర్ నమ్రత

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన అక్రమ సరోగసీ రాకెట్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. ఈ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై డాక్టర్ అడుతూరు నమ్రత అలియాస్ పచ్చిపల్లి నమ్రతను శుక్రవారం అరెస్ట్ చేసింది. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరచగా, ఫిబ్రవరి 26 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో నమ్రత ఈ అక్రమ దందా నడిపినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. సంతానం లేని

మిగతా2లో




## మున్సిపల్ ఎన్నికల్లో బోణి కొట్టిన జనసేన

- మున్సిపల్ ఎన్నికల్లో 200కు పైగా స్థానాల్లో జనసేన పోటీ
- సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో జయకేతనం
- స్థానిక నాయకత్వం, కార్యకర్తల కృషితో జనసేన గెలుపు


మిగతా2లో



## ఇరాన్ దిశగా కదులుతున్న అమెరికా సేనలు...

- అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు
- యూఎస్ఎస్ జెరాల్డ్ ఫోర్డ్ నౌకను మధ్యప్రాచ్యానికి తరలింపు
- ఇప్పటికే అక్కడ ఉన్న అబ్రహం లింకన్ నౌకకు తోడుగా ఇది రెండో విమానవాహక నౌక
- అణు చర్చలు విఫలమైతే సైనిక చర్య తప్పదని ఇటీవలే ట్రంప్ హెచ్చరిక
- ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం
- అమెరికా చర్యతో పశ్చిమాసియాలో కొత్తగా ఆందోళనలు

మిగతా2లో



## తిరుమలలో అపచారాలకు నాటి పాలక మండలే కారణం



- రూ.10 కోట్లతో నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్
- పాలకమండళ్లు బాధ్యతగా ఉంటే ఆలయాల్లో అపచారాలు జరగవని వ్యాఖ్య
- గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో అనేక తప్పులు జరిగాయని విమర్శ
- ఆలయాల అభివృద్ధి, ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడి
- రూ.40 కోట్లతో 22 ప్రధాన ఆలయాలకు రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటన

మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# వైఎస్ బాటను రేవంత్ ఎంచుకుంటున్నట్లుందిగా?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భిన్న మార్గంలో వెళుతున్నారు. దీంతో రేవంత్ ఏ ఎన్నికైనా సులువుగా ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నేతలు, క్యాడర్ లో ఈ నమ్మకం కలిగింది. పార్లమెంటు ఎన్నికలతో పాటు కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించుకున్నారు. పంచాయతీ ఎన్నికలలోనూ అత్యధిక స్థానాలను సాధించగలిగారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని ఎన్నిక ఏదైనా హస్తందే విజయం అన్న సంకేతాలను కేవలం ప్రత్యర్థులకు మాత్రమే కాదు.. సొంత పార్టీలోని తన నాయకత్వాన్ని వ్యతిరేకించే వారికి కూడా రేవంత్ పంపించారు. ఒకరకంగా పార్టీ అగ్ర నాయకత్వానికి కూడా రేవంత్ రెడ్డి తోనే కాంగ్రెస్ విజయాలు నమోదు చేసుకుంటుందన్న భావన కలిగించారు. టీడీపీ నుంచి వచ్చి పీసీసీ చీఫ్ అవ్వడమే తొలివిజయం. ఆ తర్వాత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపులో తనదే కీలక పాత్ర అని చెప్పగలిగారు.

**ఎదురు లేని నేతగా**

రేవంత్ రెడ్డి కాంగ్రెస్ లో ఎదురులేని నాయకుడిగా ఎదుగుతున్నట్లు కనిపిస్తుంది. 2004లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పదేళ్ల పాటు అధికారానికి నోచుకోని కాంగ్రెస్ ను ఒంటిచేత్తో వైఎస్ రాజశేఖర్ రెడ్డి గెలిపించారు. అలాగే పార్టీ నాయకత్వంపైన కూడా వైఎస్ పట్టు సాధించగలిగారు. ఇప్పుడు రేవంత్ కూడా వైఎస్ తరహా మార్క్ లోనే పయనిస్తున్నట్లు అర్థమవుతుంది. ఢిల్లీ పర్యటనలో మీడియాతో నేనే రాజు.. నేనే మంత్రి అన్న వ్యాఖ్యను నిజం చేసి చూపించారు. ఏ ఎన్నికలైనా ముఖ్యమంత్రి హోదాలో జిల్లాలను, నియోజకవర్గాలలో సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రజలను కాంగ్రెస్ వైపు తిప్పుకునేలా చేయగలిగారు. సహజంగా కాంగ్రెస్ లో అసంతృప్తుల బెడద ఉంటుంది. అలాంటివి పెద్దగా లేకుండా చేసుకోవడంతో రేవంత్ సగం ఎన్నికలకు ముందే సక్సెస్ అయ్యారని చెప్పాలి. అక్కడక్కడకొంత రెబల్స్ ఉన్నప్పటికీ ఈ ఫలితాలతో వారు దారికి రాక తప్పదు.

**పార్టీలో ఉన్న అసంతృప్తిని...**

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి నాళ్లలో సీనియర్ నేతల నుంచి కొంత వ్యతిరేకత ఎదురైంది. అయితే, తన వ్యూహాలతో వారిని తన దారిలోకి తెచ్చుకోవడంలో ఆయన విజయం సాధించారు. కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలు రేవంత్ నాయకత్వంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఆయనను ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆయన అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వంటి సీనియర్లు కూడా రేవంత్‌ను సమర్థించడం మొదలుపెట్టారు. ఇప్పుడు పార్టీలో రేవంత్ నిర్ణయాలకు ఎదురుచెప్పే సాహసం ఎవరూ చేయడం లేదు. విమర్శించిన వారే ఇప్పుడు ఆయన నాయకత్వాన్ని బలపరుస్తుండటం రేవంత్ సాధించిన అతిపెద్ద రాజకీయ విజయంగా చెప్పాలి. ఇటు ప్రత్యర్థులను కట్టడి చేయడంలోనూ అటు సొంత పార్టీలో అసమ్మతులను మూలనకూర్చోబెట్టడంలోనూ రేవంత్ రెడ్డి విజయం సాధిస్తూ తన పట్టును చాటి చెప్పారు. అంతే కాదు కాంగ్రెస్ లో పదేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిని అని తనకు తాను ప్రకటించుకుని మరింత సంచలనంగా మారారు. మొత్తం మీద రేవంత్ రెడ్డికి వరస విజయాలు..ఆయన రాజకీయ బాటలో ముళ్లు లేకుండా క్లీన్ చేస్తున్నాయనే చెప్పాలి.

# ఇరాన్ దిశగా కదులుతున్న అమెరికా సేనలు...

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకుంటున్న వేళ, ట్రంప్ ప్రభుత్వం తమ సైనిక శక్తిని ప్రదర్శిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక అయిన యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను కరేబియన్ సముద్రం నుంచి మధ్యప్రాచ్యం వైపు తరలిస్తోంది. ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ చర్య తీసుకున్నట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.ఇరాన్‌తో అణు కార్యక్రమంపై చర్చలు విఫలమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు కొలిక్కి రాకపోతే దాడులకు దిగేందుకైనా సిద్ధమేనని అమెరికా సంకేతాలిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో ఇప్పటికే యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక సమూహం మోహరించి ఉంది. ఇప్పుడు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరనుండటంతో ఆ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు శక్తివంతమైన విమాన వాహక నౌకలు అందుబాటులో ఉంటాయి.న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం, కరేబియన్‌లో ఉన్న జెరాల్డ్ ఫోర్డ్ స్ట్రైక్ గ్రూప్... అట్లాంటిక్ మహాసముద్రం, మధ్యధరా సముద్రం మీదుగా పర్షియన్ గల్ఫ్ వైపు పయనిస్తోంది. ఈ నౌకతో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి అత్యాధునిక డిస్ట్రాయర్లు కూడా ఈ బృందంలో ఉన్నాయి. ఈ విమానవాహక నౌక మే నెల ఆరంభం వరకు మధ్యప్రాచ్యంలోనే ఉండే అవకాశం ఉందని, దీంతో దీని మోహరింపు కాలం 10 నెలలకు పొడిగించవచ్చని తెలుస్తోంది.గతంలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించేందుకు అమెరికా చేపట్టిన సైనిక చర్యలో జెరాల్డ్ ఫోర్డ్ నుంచే యుద్ధ విమానాలు పాల్గొన్నాయని నివేదికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకే అమెరికా ఈ చర్య తీసుకుందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ భారీ యుద్ధ నౌక తరలింపు పశ్చిమాసియాలో కొత్త ఆందోళనలకు దారితీస్తోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా..

తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. రాష్ట్రంలోని మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుని తన పట్టును నిరూపించుకుంది. శాసనసభ ఎన్నికల తర్వాత జరిగిన ఈ కీలక పోరులో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది.ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం, రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ ఏకంగా 66 చోట్ల విజయం సాధించింది. మొత్తం 2,582 వార్డులకు గాను 1,347 వార్డుల్లో హస్తం గుర్తు అభ్యర్థులు గెలుపొందారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 13 మున్సిపాలిటీలు, 717 వార్డులతో రెండో స్థానానికి పరిమితమైంది. ఇక బీజేపీ 261 వార్డుల్లో, ఇండిపెండెంట్ అభ్యర్థులు 256 వార్డుల్లో గెలిచారు.మరో 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ వాతావరణం నెలకొంది. ఈ ప్రాంతాల్లో ఛైర్మన్ల ఎన్నికలో స్వతంత్రులు, ఇతర చిన్న పార్టీల మద్దతు కీలకం కానుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా
ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గెలుచుకోవడం విశేషం.కార్పొరేషన్ల లోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లను కాంగ్రెస్ దక్కించుకుంది. ఇంకా పలు చోట్ల ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగా, పూర్తి స్థాయిలో ఫలితాలు వెలువడాల్సి ఉంది.

# మా రెండేళ్ల పాలనకు ఈ ఫలితాలే నిదర్శనం

- మొదటి పేజి తరువాయి

ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రజా ప్రభుత్వ పాలనకు, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి, ప్రపంచస్థాయి ప్రణాళికలతో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ తీర్పు ద్వారా ప్రజలు సంపూర్ణ ఆమోదం తెలిపారని ఆయన శుక్రవారం పేర్కొన్నారు.రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. వెలువడిన ఫలితాల ప్రకారం, 116 మున్సిపాలిటీలకు గాను 66 చోట్ల కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. అలాగే 7 కార్పొరేషన్లలో 3 చోట్ల స్పష్టమైన మెజారిటీ సాధించగా, మరో కార్పొరేషన్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని మరో 37 మున్సిపాలిటీలలో కూడా పీఠాలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.ఈ చారిత్రక విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల అవిశ్రాంత శ్రమకు దక్కిన ఫలితమే ఈ విజయం. పార్టీ పట్ల వారికి ఉన్న అపారమైన అభిమానానికి ఇది నిలువుటద్దం. పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.ఈ గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందని సీఎం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, పారదర్శక పాలనకు
తాము పునరంకితం అవుతున్నామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని, ప్రతి కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు ప్రజలు ఇచ్చిన సానుకూల తీర్పుగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

# హైదరాబాద్‌లో అక్రమ సరోగసీ రాకెట్... లేడీ డాక్టర్ ను అరెస్ట్ చేసిన ఈడీ

- మొదటి పేజి తరువాయి

దంపతుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, వారికి సరోగసీ ద్వారా బిడ్డను అందిస్తామని నమ్మించేవారు. అయితే, పేదరికంతో బిడ్డలను పెంచుకోలేని గర్భిణులను ఏజెంట్ల ద్వారా గుర్తించి, పుట్టిన వెంటనే శిశువులను కొనుగోలు చేసేవారని ఈడీ ఆరోపించింది. ఆడశిశువుకు రూ. 3.5 లక్షలు, మగశిశువుకు రూ. 4.5 లక్షలు చెల్లించి, వారిని సంతానం లేని దంపతులకు అమ్మేవారని దర్యాప్తులో వెల్లడైంది.

ఈ రాకెట్‌పై గతంలోనే హైదరాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి అభియోగాలపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఆ కేసుల్లో 2025 నవంబర్‌లో బెయిల్‌పై విడుదలైన ఆమె, మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ విచారణకు సహకరించకపోవడంతో తాజాగా పీఎంఎల్ఏ చట్టం కింద అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని ఆసుపత్రి లైసెన్సు రద్దు కాగా, విశాఖపట్నం కేంద్రంగా ఈ దందాను కొనసాగించినట్లు ఈడీ గుర్తించింది.

దంపతులనే అసలు తల్లిదండ్రులుగా చూపిస్తూ నకిలీ జనన ధృవపత్రాలు సృష్టించినట్లు కూడా ఈడీ తెలిపింది. ఈ రాకెట్‌లో ఏజెంట్లు, సబ్-ఏజెంట్ల నెట్‌వర్క్ కీలకంగా వ్యవహరించిందని, దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వివరించారు.

# బీఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించింది.. కొత్తగూడెంలో వారికి ఓపెన్ ఆఫర్ ఇచ్చాం

- మొదటి పేజి తరువాయి

రాబట్టామని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో 4 వేలకు పైగా స్థానాలు గెలుచుకున్నామని, ఇప్పుడు 2,500 మున్సిపల్ వార్డుల్లో 750 వరకు గెలుచుకుంటున్నామని అన్నారు. మొత్తంగా 30 శాతానికి పైగా సీట్లు గెలిచామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అధికార బలాన్ని ఉపయోగించి కొన్ని స్థానాలను దక్కించుకుందని ఆరోపించారు. గద్వాలలో ఒక వార్డులో నాలుగుసార్లు రీకౌంటింగ్ చేయించి కాంగ్రెస్ పార్టీ ఒక్క ఓటుతో గెలిచినట్లు ప్రకటించారని... గద్వాల, చౌటుప్పల్‌లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని గెలిచారని ఆరోపించారు. కొన్నిచోట్ల తమ కౌన్సిలర్లను ఎత్తుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడానికి కాంగ్రెస్ అనేక తంటాలు పడుతోందని అన్నారు.116 మున్సిపాలిటీల్లో తాము సొంతంగా 15 నుంచి 16 గెలుచుకున్నామని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఈ ఎన్నికల కోసం వీరోచిత పోరాటం చేశారని ప్రశంసించారు. ప్రజలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి ఓటేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ మోసంతో ఎక్కువ స్థానాలు గెలుచుకుంటోందని అన్నారు.

**సీపీఐ పార్టీకి ఓపెన్ ఆఫర్ ఇచ్చాం**

కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 స్థానాలకు గాను సీపీఐ 29 సీట్లు గెలుచుకుందని, తాము 8 నుంచి 10 చోట్ల గెలిచామని కేటీఆర్ అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు కొత్తగూడెంలో తాము బేషరతుగా సీపీఐకి మద్దతిస్తామని ఆయన ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సాంబశివరావుతో మాట్లాడినట్లు చెప్పారు. సింగరేణిలో రూ.6 వేల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని, దీనిని అడ్డుకునేందుకు మీతో కలిసి వస్తామని సీపీఐకి ఓపెన్ ఆఫర్ ఇచ్చామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ దోపిడీ చేస్తుంటే బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు.

**మేం మాత్రమే ప్రత్యామ్నాయం**

తెలంగాణలో బీఆర్ఎస్ మాత్రమే ప్రత్యామ్నాయమని ప్రజలు నిన్న పంచాయతీ, నేడు మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో స్పష్టం చేశారని కేటీఆర్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రమే సమస్యలపై పోరాడుతుందని ప్రజలు తేల్చి చెప్పారని అన్నారు. కలిసొచ్చే లౌకికవాద పార్టీలను కలుపుకుని ముందుకు సాగుతామని ఆయన అన్నారు. ఇదే ఉత్సాహంతో జీహెచ్ఎంసీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మంచి భవిష్యత్తు ఉందనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఓడిపోయిన వారు నిరాశపడవద్దని ఆయన సూచించారు. అధికార పార్టీ అంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో 80 నుంచి 90 సీట్లు గెలుచుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ 15, హంగ్ 30 మున్సిపాలిటీలు పోను కాంగ్రెస్ ఎన్ని గెలుచుకుందో ఆలోచించాలని అన్నారు.

# ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడిన హైడ్రా

హైదరాబాద్ నగరంలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కుల స్థలాల కబ్జాపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పచ్చని ప్రదేశాలను కాపాడేందుకు నడుం బిగించింది. శుక్రవారం ఒక్కరోజే రెండు వేర్వేరు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి సుమారు రూ. 34.12 కోట్ల విలువైన 3,041 గజాల పార్కు స్థలాలను కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. హైడ్రా తీసుకున్న ఈ చర్యలతో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.

**భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులకు విముక్తి**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ పరిధిలోని సుభాష్ నగర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి కాలనీలో హైడ్రా అధికారులు కీలక ఆపరేషన్ చేపట్టారు. 1968లో వేసిన ఈ లేఅవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు కాలక్రమేణా కబ్జాకు గురయ్యాయి. గతంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లను 20 ఏళ్ల క్రితం తొలగించడంతో, అప్పటి నుంచి పార్కుల స్థలాలు ఆక్రమణకు గురవుతూ వచ్చాయి. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, నివాసితులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఒకేసారి 6 పార్కులలోని ఆక్రమణలను తొలగించి, 2260 గజాల స్థలానికి 'హైడ్రా ఫెన్సింగ్' వేసి, అధికారిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు ఆనందంతో ర్యాలీలు తీసి, హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు.

**గుడిమల్కాపూర్‌లో పార్కుకు విముక్తి**

ఇదే తరహాలో, ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలోని ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. గతంలో లోతట్టు ప్రాంతంగా ఉన్న ఈ 1,152 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు దానిని ఆక్రమించుకుని ఇసుక వ్యాపారం, వాహనాల పార్కింగ్, కొబ్బరి బొండాల అమ్మకాలకు వినియోగిస్తున్నారు. 2018లో జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో, స్థానికులు హైడ్రాను సంప్రదించారు. ప్రజావాణి ఫిర్యాదు ఆధారంగా హైడ్రా అధికారులు కబ్జాదారులను ఖాళీ చేయించి, స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేశారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో హైడ్రా తన నిబద్ధతను చాటుకుంటోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# వచ్చేది వేసవి కాలం... నిప్పుతో జాగ్రత్త

- మొదటి పేజి తరువాయి

పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఓ అవగాహనా కార్యక్రమంలో ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, "కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే మంటలు వేగంగా వ్యాపించే అవకాశం ఉంది. నగరంలో గతంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాలను విశ్లేషిస్తే, నిబంధనలను ఉల్లంఘించడమే ప్రధాన కారణంగా స్పష్టమవుతోంది" అని తెలిపారు. వేసవిలో పొడి వాతావరణం కారణంగా ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ఆయన హెచ్చరించారు.ఈ నేపథ్యంలో హైడ్రా అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని కమిషనర్ వివరించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తేనే ప్రమాదాలను నివారించగలమని, తద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని అరికట్టవచ్చని ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.

# నల్గొండ అంటే కాంగ్రెస్ అని మరోసారి రుజువు చేశారు

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు అఖండ మెజారిటీని కట్టబెట్టిన నల్గొండ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా, నల్గొండ పట్టణాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనకు ఈ గెలుపు నిదర్శనమని అన్నారు.

నల్గొండలో మొత్తం 48 వార్డులకు గాను కాంగ్రెస్ కు 27, బీఆర్ఎస్ కు 9, బీజేపీకి 4, ఇతరులకు 8 స్థానాలు దక్కాయి.

ఈ విజయం ద్వారా "నల్గొండ అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటే నల్గొండ" అని ప్రజలు మరోసారి రుజువు చేశారని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. గెలుపొందిన కార్పొరేటర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో, ఓటమి పాలైన అభ్యర్థులు నిరుత్సాహపడకుండా, తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ఎజెండా అని స్పష్టం చేశారు.

నల్గొండ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇకపై వారానికి రెండు రోజులు తాను నల్గొండలోనే అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అంతేకాకుండా, ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. నల్గొండలో కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ప్రతి కార్యకర్తకు, ఓటు వేసిన ప్రజలకు ఆయన మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

# రణవీర్ సింగ్ ను చంపేస్తామంటూ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

బాలీవుడ్ లో ప్రముఖ నటుడు రణ్ వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్ వీర్ ను, అతడి వద్ద పనిచేస్తున్న వారినీ చంపేస్తానని దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇదే తరహా బెదిరింపులు చేశాడు. ఈ మేరకు వాట్సాప్ లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ మెసేజ్ తో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్లను అంగీకరించకపోతే వారితో పాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు.

**మెసేజ్ లో ఏముందంటే..**

"రణ్ వీర్ సింగ్.. నీ భవిష్యత్తులో ఏడు తరాలు గుర్తుండిపోయేలా నిన్ను హత్య చేస్తాం. నువ్వు మా బెదిరింపులను లెక్క చేయకపోగా మిగతా వారికీ ఉచిత సలహాలు ఇస్తున్నావు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నావు. నువ్వు కూడా ఓ కంప్లైంట్ చేసినట్టున్నావు.. పర్వాలేదు. ఇక నీకు మామూలుగా చెప్పం. నీ దగ్గర ఎవరెవరు పనిచేస్తున్నారు. వారు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళతారు.. వారి కుటుంబాలు ఎక్కడ ఉంటున్నాయనే వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి. వారితో మొదలు పెడతాం. ఒక్కొక్కరినీ టార్గెట్ చేసి చంపేస్తుంటే అప్పుడు నీకు తెలిసివస్తుంది. నీకు ఇంకా టైముంది. హత్యలు మొదలయ్యే లోపే మేలుకో" అంటూ దుండగుడు బెదిరించాడు. దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇది వర్తిస్తుందని హెచ్చరించాడు.

## ఒక్క ఓటుతో వరించిన విజయం

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ అభ్యర్థులను విజయం వరించింది. కల్వకుర్తి మున్సిపాలిటీలోని పదో వార్డులో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య విజయం దోబూచులాడింది.తొలుత కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ కు రెండు ఓట్ల మెజారిటీ రాగా బీఆర్ఎస్ అభ్యర్థి తాహిర్ రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు మరోసారి ఓట్లు లెక్కించగా.. ఎజాస్ కు 259 ఓట్లు, తాహిర్ కు 258 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎజాస్ గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

**పరకాలలో..**

పరకాల మున్సిపాలిటీలోని 17వ వార్డు ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్రకు 369 ఓట్లు పోలవగా.. బీఆర్ఎస్ అభ్యర్థి శనిగరపు రజినికి 368 ఓట్లు వచ్చాయి. దీంతో రజిని రీకౌంటింగ్ కు దరఖాస్తు చేసుకోగా రెండోసారి కౌంటింగ్ చేసినా ఫలితంలో మార్పులేదు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి బొచ్చు సుభద్ర గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బోణి కొట్టిన జనసేన

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ బోణి కొట్టింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డులో జనసేన అభ్యర్థి సమీప ప్రత్యర్థిపై విజయకేతనం ఎగురవేశారు. ఈ విజయం జనసేన శ్రేణుల్లో మంచి ఉత్సాహాన్ని నింపింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నేరుగా ప్రచారంలో పాల్గొనకపోయినా, స్థానిక నాయకత్వం, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చేసిన కృషి ఈ గెలుపుకు కీలకంగా నిలిచింది. ముఖ్యంగా యువత, మార్పు కోరుకునే ఓటర్లు జనసేన వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేనకు ఈ విజయం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నేరేడుచర్లలో జనసేన కార్యకర్తల్లో ఇప్పుడు కొత్త ఉత్తేజం కనిపిస్తోంది. మొత్తం 200కు పైగా స్థానాల్లో పోటీ చేసిన జనసేనకు ఈ మొదటి గెలుపు మంచి ఊపునిస్తోంది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# మంత్రి పదవివ్వకపోతే సీఎంనవుతా..

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**చౌటుప్పల్, పెన్ పవర్:** 'రాబోయే రోజుల్లో మీ ఆశీర్వాదంతో నాకు మంచి పదవి వస్తుంది.. మంత్రి పదవి రాకపోతే డైరెక్టుగా ముఖ్యమంత్రి అవుదాం' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పురపాలిక ఎన్నికల్లో 20 వార్డుల్లో 13 వార్డులను గెల్చుకున్న సందర్భంగా శుక్రవారం రాత్రి కాంగ్రెస్, సీపీఐ కార్యకర్తలు నిర్వహించిన విజయోత్సవంలో ఆయన ప్రసంగించారు. 'ఇచ్చిన మాటకు కట్టుబడి మంత్రి పదవి ఇవ్వండి. ఇంకా వేచి చూస్తా. నేను పదవి గురించి బాధపడడం లేదు. మంత్రిని చేయకపోతే నా లక్ష్యం సీఎం కావడమే. మళ్లీ మాట్లాడేది లేదు.' అని స్పష్టం చేశారు. 'మీరు మునుగోడును చూసుకోండి.. తెలంగాణను నేను చూసుకుంటా' అని ప్రజలను కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జి పబ్బు రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌పైనా కాషాయ జెండా ఎగురవేస్తాం

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్, భారాస, ఎంఐఎంలు కుమ్మక్కై ఎన్ని కుట్రలు చేసినా, ఓటుకు రూ.10 వేల వరకు ఇచ్చినా కరీంనగర్ ప్రజలు భాజపా అభ్యర్థులపై విశ్వాసం ఉంచారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో ఓట్ల లెక్కింపు అనంతరం మాజీ మేయర్ సునీల్‌రావు, ఇతర నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. "తమ పార్టీ అభ్యర్థులు గెలుస్తున్నారని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఇస్తామంటూ ప్రలోభాలకు గురిచేసింది. సీఎం రేవంత్‌రెడ్డి బడేభాయ్, చోటాభాయ్‌లను పిలిచి రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా ప్రజలు నమ్మలేదు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్‌నూ దాటుతున్నాం. ముగ్గురు స్వతంత్రులు, ఇతర పార్టీల్లో గెలిచిన వారు కూడా భాజపాలోకి రాబోతున్నారు. తెలంగాణలో మొదటిసారి కరీంనగర్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగురవేసి చరిత్ర సృష్టించబోతున్నాం. జీహెచ్ఎంసీని సీఎం రేవంత్‌రెడ్డి మూడు ముక్కలు చేశారు. ఒకటి ఎంఐఎం, రెండు కాంగ్రెస్ పార్టీ గెల్చుకుంటుందని కలలు కంటున్నారు. హైదరాబాద్‌పైనా కాషాయ జెండా ఎగురవేస్తాం' అని బండి సంజయ్ పేర్కొన్నారు.



# మా గెలుపుతో కల్వకుంట్ల కవితకు సంబంధం లేదు:

## వడ్డేపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు

- వడ్డేపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకున్న ఫార్వర్డ్ బ్లాక్
- ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోటీ చేసిన కవిత మద్దతుదారులు
- కవిత తమ తరపున ప్రచారం చేయలేదన్న శ్రీనివాస్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతు పలికిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. మొత్తం 10 వార్డులకు గాను 8 వార్డుల్లో సింహం గుర్తుపై గెలిచి సంచలనం సృష్టించారు. ఈ గెలుపు చర్చనీయాంశంగా మారుతున్న వేళ, కవిత విజయం గురించి చర్చ ప్రారంభమైన వేళ... ఆమెకు షాక్ తగిలింది. తమ విజయంతో కవితకు ఎలాంటి సంబంధం లేదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున గెలిచిన వడ్డేపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఓ న్యూస్ చానల్ తో వడ్డేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... తమ విజయంతో జాగృతికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బీఫారం తీసుకోవడానికి వెళ్లినప్పుడు కవిత తమకు జాగృతి కండువా కప్పారని... కానీ, ఆమె తమ తరపున ప్రచారానికి వచ్చిందే లేదని చెప్పారు. ప్రచారంలో తాము కవిత కండువా వేసుకున్నది కూడా లేదని, ఆ రోజు తర్వాత కవితతో తాము మాట్లాడింది కూడా లేదని తెలిపారు. ఈ గెలుపు తమ సొంతమని చెప్పారు. శ్రీనివాస్ వ్యాఖ్యలపై కవిత ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# మున్సిపల్ ఎన్నికల విజయం వేళ, ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి భేటీ

**మున్సిపల్ ఎన్నికల్లో విజయంపై ప్రియాంక గాంధీ అభినందన**

**సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు పట్టం కట్టారన్న ముఖ్యమంత్రి**

**ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనమన్న మల్లు భట్టివిక్రమార్క**



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన వేళ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీతో భేటీ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ భారీ విజయం సాధించడంపై వారి మధ్య చర్చ జరిగింది. అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దక్కించుకోవడంపై హర్షం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ... రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కారణంగానే ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని ఈ సందర్భంగా ప్రియాంక గాంధీతో రేవంత్ రెడ్డి అన్నారు.

కాంగ్రెస్ గెలుపుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పందించారు. రెండున్నరేళ్ల ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ సంక్షేమ, అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసం ఆదరణగా మారిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా శ్రమించారని ప్రశంసించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో మంత్రి వివేక్ కు భంగపాటు

- వివేక్ నియోజకవర్గంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ కైవసం
- సీపీఐతో పొత్తు పెట్టుకుని జయకేతనం ఎగురవేసిన బీఆర్ఎస్
- ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్ శ్రేణులు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లో తేలనుంది. 136 కౌంటింగ్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు దాదాపు పూర్తయింది. ప్రస్తుతం వెలుడిన ఫలితాలు, కొనసాగుతున్న ట్రెండ్స్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ భారీ ఆధిక్యతను కనబరుస్తోంది.

-4లో

# 6 మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీ... కరీంనగర్, నిజామాబాద్ గెలుస్తున్నాం

**ఈ ఎన్నికల్లో బీజేపీ బలపడిందన్న రామచందర్ రావు**

**హంగ్ వచ్చినా బీజేపీ ఎవరికీ మద్దతివ్వదని స్పష్టీకరణ**

**తెలంగాణలో కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా**



హైదరాబాద్ పెన్ పవర్:ఆరు మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిందని, రెండు కార్పొరేషన్లు గెలుచుకోబోతున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో బీజేపీ బలపడిందని అన్నారు. ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించామని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో 250 వార్డుల్లో గెలిచామని పేర్కొన్నారు.కరీంనగర్, నిజామాబాద్ మున్సిపాలిటీలను కైవసం చేసుకోబోతున్నామని వ్యాఖ్యానించారు. నారాయణపేట, ఆదిలాబాద్, రాయికల్ వంటి మున్సిపాలిటీల్లో బీజేపీ వారే ఛైర్మన్లు అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎక్స్ అఫిషియో, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ఛైర్మన్ పదవులు దక్కించుకుంటామని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తాము ఆశించిన మేర ఉన్నాయని, కొన్ని జిల్లాల్లో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదని అన్నారు.త్రిముఖ పోరులో బీజేపీకి కొంత నష్టం జరిగిందని రామచందర్ రావు అన్నారు.

-4లో



# కేసీఆర్‌ను కూడా ప్రజలు ఓడించారు

## రేవంత్ రెడ్డి 'నేనే రాజు' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

**నేనే రాజు నేనే మంత్రి అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన**

**అలా అనుకున్న వారు ఎందరో గాలికి కొట్టుకుపోయారన్న కేటీఆర్**

**తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను కూడా కామారెడ్డిలో ప్రజలు ఓడించారన్న కేటీఆర్**

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణకు 'నేనే రాజు నేనే మంత్రి' అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 'నేనే రాజు నేనే మంత్రి' అనుకునే పిచ్చి తుగ్లక్‌లు చాలామంది ఉంటారని, చరిత్రలో కూడా ఒక తుగ్లక్ ఉండేవాడని ఎద్దేవా చేశారు. అలా అనుకున్నవారు ఎందరో గాలికి కొట్టుకుపోయారని అన్నారు.ప్రజల చైతన్యాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని అన్నారు. ఈ దేశంలో ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ వంటి నాయకులు సైతం ఓడిపోయారని గుర్తు చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ వంటి నాయకుడిని కూడా కామారెడ్డిలో

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆరు మున్సిపాలిటీల్లో హస్తందే విజయం



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో 116 మున్సిపాలిటీల్లో అత్యధిక చోట్ల కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కొనసాగిస్తోంది. నల్లగొండ, ఖమ్మం, సంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలు అత్యధికంగా కైవసం చేసుకుంది. నల్లగొండ జిల్లాలోని హాలియా, నందికొండూరు, చిట్యాల, చండూరులను కైవసం చేసుకుంది. ఖమ్మం జిల్లాలో మధిర మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. సంగారెడ్డి జిల్లాలోని కోహిర్ మున్సిపాలిటీని కాంగ్రెస్ చేజిక్కించుకుంది.

**మున్సిపల్ వార్డుల్లో...**

బీఆర్ఎస్ రెండు మున్సిపాలీటలను దక్కించుకుంది. మొత్తం 2,281 మున్సిపాల్ వార్డుల్లో కాంగ్రెస్ 277 వార్డుల్లోనూ, బీఆర్ఎస్ 152 వార్డుల్లో విజయం సాధించింది. బీజేపీ నలభై వార్డుల్లో విజయం సాధించింది. నల్లగొండ, ఖమ్మం జిల్లాలతో పాటు మహబూబ్ నగర్ జిల్లాలోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఆధిక్యతతో కొనసాగుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కాంగ్రెస్ అత్యధిక మున్సిపాలిటీలను కైవసం చేసుకునే అవకాశముంది.

# ఉత్తమ్, కోమటిరెడ్డి ఇలాకాలో కాంగ్రెస్ స్వీప్





**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇలాకాలో కాంగ్రెస్ అత్యధిక మున్సిపాలీటీలను కైవసం చేసుకునే దిశగా వెళుతుంది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా మున్సిపాలీటీలను కాంగ్రెస్ చేజిక్కించుకుంది. గత శాసనసభ ఎన్నికల తరహాలోనే నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తొలుత మున్సిపల్ ఎన్నికల్లో తన ప్రచారాన్ని నల్లగొండ జిల్లా నుంచే ప్రారంభించారు. మిర్యాలగూడలో తొలి సభను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు.

అత్యధిక ఎమ్మెల్యేలు..

దీంతో నల్లగొండలో మంత్రులుగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు నామినేషన్లకు ముందు కొన్ని వార్డులు ఏకగ్రీవం జరిగేలా చూడగలిగారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధికృత కొనసాగిస్తుంది. నల్లగొండ జిల్లాలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లోని మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధికంగా గెలిచారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు అత్యధికంగా కాంగ్రెస్ కు చెందిన వారుండటంతో మున్సిపాలిటీల్లో కూడా వారి ప్రభావం పనిచేస్తుందనే చెప్పాలి. అత్యధికంగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ఉండటం కూడా కలసి వచ్చింది.

**మూడేళ్ల అధికారంలో...**

ఇక నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఫలితాలు మాత్రం కొంత ఆలస్యంగానే వస్తున్నాయి. ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్న బియ్యం సరఫరా, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో పాటు రెండు వందల యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు వంటి అంశాలతో కాంగ్రెస్ పక్షాన ప్రజలు నిలబడ్డారు. నల్లగొండ ప్రజలు మరో మూడేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది కాబట్టి ఇతర పార్టీలకు ఓటు వేసినంత మాత్రాన తమ పట్టణం అభివృద్ధి జరగదని భావించి హస్తం పార్టీవైపు మొగ్గు చూపినట్లు కనపడుతుంది.

# సూర్యుడు సెగలు కక్కుతున్నాడుగా.. మే లో మూమాలుగా ఉండదేమో?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఎండల తీవ్రత మొదలయింది. శివరాత్రి నాటికి మరింత ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక రానురాను ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకుంటాయని అంటున్నారు. ఇప్పటికే ఎండలు ముదరడంతో రెండు రాష్ట్రాల ప్రజలు ఉదయం ఎనిమిది గంటల నుంచే ఉక్కపోత వాతావరణం మొదలయింది. దీంతో ఇటు బయటకు వెళ్లలేక, మరొకవైపు ఇళ్లలో కుదురుగా ఉండలేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు వినియోగం కూడా రెండు రాష్ట్రాల్లో గణనీయంగా పెరిగింది. చలి తీవ్రతతో మొన్నటి వరకూ గజగజలాడిన ప్రజలు అది పూర్తిగా తగ్గిపోవడంతో చెమటలతో తడిసి ముద్దవుతున్నారు.

**గరిష్టంగా నమోదవుతూ...**

ఆంధ్రప్రదేశ్ లో భానుడి సెగలు ప్రారంభమయ్యాయి. ఎంతగా అంటే గరిష్టంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ వేసవి కాలం మొదలయిందని, ఉష్ణోగ్రతలు భారీగా పెరిగాయని అమరావతి వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ వేడిగాలుల తీవ్రత మొదలయింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో 36 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాయలసీమలో, కోస్తాంధ్రలోని పల్నాడు జిల్లా, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదవుతున్నాయని పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో 32 నుంచి 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

**ఏడు గంటల నుంచే...**

తెలంగాణలోనూ చలి కనుమరుగైంది. దాదాపు అన్ని జిల్లాల్లోనూ వేడి వాతావరణం ఎక్కువయింది. ఉక్కపోత మొదలు కావడంతోనే




విద్యుత్తు వినియోగం పెరిగింది. తెలంగాణలో ఉదయం వేళ కొంత చలిగాలులు వీస్తున్నప్పటికీ ఐదు గంటల వరకూ మాత్రమే. తర్వాత ఏడు గంటల నుంచి భానుడు సెగలు కక్కుతున్నాడు. ప్రధానంగా కొన్ని జిల్లాల్లో అయితే 35 వరకూ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రధానంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు పగటి వేళ బయటకు రావద్దని సూచిస్తున్నారు.

# మెదక్ జిల్లా తూప్రాన్‌ఎలో హైడ్రామా.. గొడవకు దారితీసిన బీఆర్‌శ్రీఎస్, కాంగ్రెస్ క్యాంపు రాజకీయం





**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపల్ ఎన్నికల ఫలితాల వెల్లడైన క్రమంలో.. శుక్రవారం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కొద్ది సేపు రాజకీయ హైడ్రామా చోటు చేసుకుంది. పట్టణంలో 16 వార్డులకు గాను బీఆర్‌యిఎస్ 9, కాంగ్రెస్ 4, బీజేపీ 3 స్థానాలు గెలుపొందాయి. 6వ వార్డు నుంచి గెలుపొందిన బీఆర్ఎఎస్ అభ్యర్థి కొక్కొండ సమతా కాశిరెడ్డిని క్యాంపునకు తీసుకెళ్లేందుకు బీఆర్‌యిఎస్ పార్టీ నాయకులు అతని ఇంటికి వచ్చారు. కాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా అక్కడికి వచ్చి వారిని అడ్డుకొని కాంగ్రెస్ అభ్యర్థులకు సపోర్టుగా సమతా కాశిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ క్యాంపునకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్‌శ్రీఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య గొడవకు దారి తీసింది. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలకు చెందిన నాయకులను చెదరగొట్టి గొడవ సద్దుమణిగేల చేశారు. చివరకు సమత కాశిరెడ్డి బీఆర్‌శ్రీఎస్ పార్టీ నాయకులతో వారి క్యాంప్‌శ్రీకి వెళ్లిపోయారు.

## 6 మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీ...
# కరీంనగర్, నిజామాబాద్ గెలుస్తున్నాం

-3 పేజి తరువాయి

అనేక చోట్ల హంగ్ వచ్చిందని తెలిపారు. ఇవి కాంగ్రెస్ పార్టీకి సానుకూల ఫలితాలు కావని అభిప్రాయపడ్డారు. బీజేపీని ఓడించడానికి పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు కలిసి పనిచేశాయని ఆరోపించారు. అందుకే బీఆర్ఎస్ అన్ని సీట్లు గెలుచుకోగలిగిందని అన్నారు. హంగ్ వచ్చినా బీజేపీ ఎవరికీ మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రజలు ఆ మూడు పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలంగా ఉందని రామచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని, తాము కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాము ఎవరికీ మద్దతు ఇచ్చేది లేదని, తమకు మద్దతు ఇస్తామంటే తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కేసీఆర్‌ను కూడా ప్రజలు ఓడించారు
## రేవంత్ రెడ్డి 'నేనే రాజు' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

-3 పేజి తరువాయి

దురదృష్టవశాత్తూ ప్రజలు ఓడించారని అన్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడో స్థానానికి వచ్చారని గుర్తు చేశారు. ఇలా నేనే రాజు నేనే మంత్రి అని రేవంత్ రెడ్డిలా విర్రవీగిన వాళ్లు వచ్చారు, పోయారని... కానీ దేశం, ప్రజల చైతన్యం అలాగే ఉందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో తాము పూర్తి స్పష్టతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. తన ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంత విశ్వాసం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పదిచోట్ల ఉప ఎన్నికలు వస్తే అప్పుడు ప్రజలు తేల్చుతారని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో మంత్రి వివేక్ కు భంగపాటు

-3 పేజి తరువాయి

మరోవైపు, మంచిర్యాల జిల్లా రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సొంత నియోజకవర్గం చెన్నూర్ పరిధిలోని క్యాతనపల్లి మున్సిపాలిటీని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు ముందస్తు పొత్తుతో ఎన్నికలకు వెళ్లడం ఇక్కడ ప్రధానంగా కలిసివచ్చింది. ఈ రెండు పార్టీల బలం కలిపి 14 సీట్లకు చేరడంతో మున్సిపల్ పీఠం దక్కించుకోవడం సులువైంది. మొత్తం 22 వార్డులు ఉన్న క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 10 వార్డులు, కాంగ్రెస్ 7 వార్డులు, సీపీఐ 4 వార్డులు, ఇండిపెండెంట్ ఒక వార్డులో విజయం సాధించారు.


కేడర్‌ను సమన్వయం చేయడంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విజయవంతమయ్యారు. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేయడంతో అక్కడ బీఆర్ఎస్ జెండా ఎగిరింది. మంత్రి వివేక్ ఇలాకా కావడంతో కాంగ్రెస్ పార్టీ ఈ మున్సిపాలిటీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అయితే, క్షేత్రస్థాయిలో సీపీఐతో పొత్తు కుదరకపోవడం, స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలను దెబ్బతీశాయి. ఈ ఓటమిని కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

# చౌటుప్పల్ బృందావన్ ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్లు.. భారీ ప్రాణ నష్టం ?



**చౌటుప్పల్: పెన్ పవర్:**యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామ పరిధిలోని బృందావన్ ఫార్మా కంపెనీలో భారీ పేలుడు సంభవించింది. షార్ట్ సర్క్యూట్‌శ్రీతో రెండు రియాక్టర్లు పేలి భారీ శబ్దాలతో మంటలు ఎగసిపడుతున్నాయి. కంపెనీలో పని చేసే కార్మికులకు భారీ ప్రాణ నష్టం వాటిల్లిందని సమాచారం. చౌటుప్పల్‌మండలం మల్కాపురం, కొయ్యలగూడెం, ఎల్లగిరి, ఎల్లంబావి, కొయ్యలగూడెం, ధర్మోజిగూడెం, చౌటుప్పల్, తంగడపల్లి, లింగారెడ్డిగూడెం, ఎస్.లింగోటం, మందోళ్లగూడెం, లింగోజిగూడెం, ఆరెగూడెం, అంకిరెడ్డిగూడెం, పంతంగి, కాట్రేవు, భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం, అంతమ్మగూడెం, జుబ్లక్‌పల్లి, నారాయణగిరి, బీబీనగర్ మండలం కొండమడుగు, బీబీనగర్, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో కంపెనీలున్నాయి. ఇందులో ప్రధానంగా ఇంటర్మీడియట్, బల్క్ డ్రగ్ కంపెనీలు ఉన్నాయి. గతేడాది జైకేసారం గ్రామంలోని ఎస్ఆర్ ఫార్మా కంపెనీలో కూడా అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే.

## వేములవాడ మున్సిపల్ చైర్మన్ పీఠంపై..
# వీడిన ఉత్కంఠ..
# ఫలించిన కాంగ్రెస్ వ్యూహం




**రాజన్న సిరిసిల్ల జిల్లా: పెన్ పవర్:**వేములవాడ మున్సిపల్‌నిలో హస్తం హవా కనిపించింది. 28 వార్డుల్లో.. కాంగ్రెస్ 13, బీఆర్ఎస్ 05, బీజేపీ 08, ఇండిపెండెంట్లు ఇద్దరు గెలిచారు. అయితే.. గెలిచిన ఆ ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు కాంగ్రెస్ గూటికి చేరారు. ఒక బీఆర్ఎస్ కౌన్సిలర్ కూడా కాంగ్రెస్‌శ్రీలో చేరడంతో మున్సిపల్ పీఠం చైర్మన్, వైస్ చైర్మన్ పదవి కాంగ్రెస్‌ఎకే దక్కాయి. ఇద్దరు ఇండిపెండెంట్‌ఎలు, బీఆర్ఎస్ కౌన్సిలర్ చేరికతో కాంగ్రెస్ బలం 16కి చేరింది. బీఆర్ఎస్ బలం 04కి పడిపోయింది. వేములవాడ మున్సిపాలిటీలో గత టర్మ్ చైర్మన్ సీటు మహిళకే దక్కింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కాంగ్రెస్‌ఎకు చెందిన 28మంది అభ్యర్థులు బుధవారం రాత్రి క్యాంప్‌శ్రీనకు బయలుదేరి వెళ్లిన సంగతి తెలిసిందే. మొదటి నుంచీ వేములవాడ బల్దియాపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వ్యూహ రచన చేశారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ వేములవాడలో అనుకున్నది సాధించింది. ఇదిలా ఉండగా.. మేయర్, చైర్‌పర్సన్‌ఎన్నికలకు మూడు రోజుల టైమ్ మాత్రం ఉండడంతో దాదాపు అందరూ గెలిచిన అభ్యర్థులను హైదరాబాద్‌శివార్లలో ఉన్న రిసార్ట్‌శ్రీలు, ఫామ్‌హౌజ్‌శ్రీలకు తరలించారు. మేయర్, చైర్‌పర్సన్ ఎన్నిక జరిగే 16న ఉదయం 10 గంటలకు డైరెక్టుగా మున్సిపాలిటీ దగ్గరకే వారిని తీసుకుచ్చేలా ప్లాన్ చేశారు.

# రెండు కార్పొరేషన్లలో కాషాయ జెండా ముందంజ

**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ రెండు కార్పొరేషన్లలో ఆధిక్యతతో కొనసాగుతుంది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బీజేపీ కైవసం చేసుకుంది. 60 డివిజన్లకు గాను 33 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచారు. బీజేపీ రెబల్ అభ్యర్థులు కూడా గెలవడంతో ఇక్కడ సునాయాసంగా బీజేపీ విజయం దక్కించుకున్నట్లయింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ కార్పొరేషన్ ను బీజేపీ కైవసం చేసుకుంది. కరీంనగర్ కార్పొరేషన్ చరిత్రలో తొలిసారి కాషాయ జెండా రెపరెపలాడనుంది.

**అత్యధిక స్థానాల్లో కమలం...**

బండి సంజయ్ ఈ కార్పొరేషన్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. బండి సంజయ్ కూడా కార్పొరేటర్ నుంచి ఎంపీ స్థాయికి ఎదిగిన విషయం తెలిసిందే. అందుకే బండి సంజయ్ అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకూ తానే దగ్గరుండి చూసుకున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై ప్రచారంలో విమర్శలు చేస్తూ తమను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చి కరీంనగర్ రూపు రేఖలను మారుస్తానని చెప్పారు. ప్రజలు కూడా బండి సంజయ్ కు మద్దతుగా నిలిచారు. దీంతో అత్యధిక స్థానాల్లో బీజేపీ కార్పొరేటర్లుగా గెలవడంతో ఇక్కడ కమలం పార్టీ అభ్యర్థి మేయర్ కానున్నారు.మరొకవైపు నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని నిజామాబాద్ కార్పొరేషన్ లో బీజేపీ ఆధిక్యతలో ఉంది. ఎక్కువ డివిజన్లలో కమలం పార్టీకి చెందిన అభ్యర్థులే గెలుస్తున్నారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడిగా ధర్మపురి అరవింద్ రెండుసార్లు గెలవడంతో పాటు అక్కడ బీజేపీ పట్టు బిగించే దిశగా అడుగులు వేస్తుంది. కానీ ఇంకా పూర్తి స్థాయి ఫలితాలు వెలువడలేదు. దీంతో చివరి నిమిషంలో నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్ పదవి ఎవరికి దక్కనుందన్నది తేలకుండా ఉంది. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంల మధ్య పోటీ ఉంది. బీఆర్ఎస్ నామమాత్రంగానే మారడంతో ఎవరు మేయర్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# భగవంతుని సేవలో భక్తులు... భక్తుల సేవలు రెడ్ క్రాస్ సభ్యులు.


**ఆత్మకూరు: పెన్ పవర్:** కొత్తపల్లి మండలం గ్రామీణ వైద్యుల సహకారంతో నంద్యాల రెడ్ క్రాస్ వారి సహకారంతో మహాశివరాత్రి శ్రీశైలం వెళ్లే పాదయాత్రలకు వివిధ రకాల రోగాలకు ఉచితంగా నాలుగు రోజులుగా మందుల పంపిణీ చేయడం జరిగింది ఇలాగే ప్రతి సంవత్సరం మహాశివరాత్రి మరియు ఉగాదికి కూడా మా జిల్లా నుంచి శ్రీశైలం కి వెళ్లే భక్తులకు రెడ్ క్రాస్ నాయకుల సహకారంతో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని రెడ్ క్రాస్ సభ్యులందరూ మరియు ఆర్ఎంపి పి ఎం పి సభ్యులు అందరూ తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల ప్రసిడెంట్ చింతలయ్య ఆత్మకూర్.

ఆత్మకూర్ రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రెడ్ క్రాస్ చైర్మన్ రాము, వైస్ చైర్మన్ మగ్బుల్ బాషా,తీఎజూ సెక్రెటరీ హిదియాతుల,సెక్రటరీ గోపాలకృష్ణ.జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసులు. ట్రెజరీ నాగేశ్వరరావు. మరియు చిరంజీవి,చిన్న శివయ్య, శ్రీకాంత్, రమణ,,లింగస్వామి, శీను, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, విక్రమ్, దౌలత్ సింహ, ఒంకర ఆచారి, ఖాయిమ్,శివ శంకర్ రెడ్డి, కిరణ్,మల్లికార్జున,నాగేష్, అలీబాషా, వరప్రసాద్,మూర్తుజవలి,అశోక్, జనార్దన్, ఫరూక్ బాషా,విజయ్, ఉస్మాన్ బాషా, సేవా సంకల్పంతో మెడిసిన్ ఇచ్చిన వారు. ఆత్మకూరు, కొత్తపల్లి, మండలం, తీఎజూ,జూఎజూ, ఆతీఎం, & మెడికల్స్ వారికీ ఆత్మకూరు సబ్ బ్రాంచ్ చైర్మన్ నేను. వెంకటేశ్వర్లు ప్రతి ఒక్కరికి పేరు.. పేరునా....నా మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియచేయడం జరిగింది.

# నారాయణపేట మునిసిపాలిటీలో ఎవరికి దక్కని మ్యాజిక్ ఫిగర్

**నారాయణ పేట్: పెన్ పవర్:** నారాయణ పేటమున్సిపాలిటీలో మ్యాజిక్ ఫిగర్ ఎవరికి రాలేదు. బీజేపీ 11, కాంగ్రెస్ 7, ఎంఐఎం 2, బీఆర్ఎస్ 2, స్వతంత్ర అభ్యర్థులు 2 గెలిచారు. దాంతో బీజేపీ మరో రెండు స్థానాలను గెలిచేందుకు కసరత్తు చేస్తుంది. ఎంపీ డీ కే అరుణ ఎక్స్ అఫిషియో ఒక ఓటు తో పాటు , మరో గెలిచిన అభ్యర్థిని తన వైపుకు తిప్పుకోనుంది.

# ఖమ్మం మరోసారి కాంగ్రెస్ కు కంచుకోటగా మారిందిగా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ హవా కొనసాగుతుంది. ఇక్కడ ముగ్గురు మంత్రులు ఉండటం కాంగ్రెస్ పార్టీకి కలసి వచ్చినట్లయింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్న ఖమ్మం జిల్లాలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం దిశగా దూసుకుపోతున్నారు. ముగ్గురు మంత్రులు ప్రతిష్టాత్మకంగా ఈ ఎన్నికలను తీసుకున్నారు. దీంతో అక్కడ అత్యధిక స్థానంలో హస్తం పార్టీ అభ్యర్థులు గెలుపును రుచి చూశార.


ముగ్గురు మంత్రులు...

2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ ఖమ్మం జిల్లా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. అదే పంథాను మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తున్నట్లే కనపడుతుంది. ముగ్గురు మంత్రులు మున్సిపల్ ఎన్నికలకు ముందే తమ ప్రాంతాల్లో పర్యటించి పార్టీ శ్రేణులతో పాటు ప్రజలను కూడా తమ వైపునకు తిప్పుకునేలా చూడగలిగారు. ఏపీ సరిహద్దు జిల్లా కావడంతో కొంత అక్కడి పార్టీల ప్రభావం కూడా ఈ ఫలితాలపై కనిపించిందన్న విశ్లేషణలు అందుతున్నాయి. దీంతో పాటు అక్కడ బీఆర్ఎస్ బలహీనంగా మారడం కూడా కాంగ్రెస్ పార్టీకి కలసి వచ్చిందనే చెప్పాలి.

ఏడు మున్సిపాలిటీల్లో...

ఖమ్మం జిల్లాల్లో ఏడు మున్సిపాలిటీలున్నాయి. ఇప్పటికే అశ్వారావుపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ సత్తా చాటినట్లయింది. అశ్వారావుపేట, మధిర, వైరా, ఏబులాపురం తో పాటు అన్ని మున్సిపాలిటీల్లోనూ విజయం సాధించింది. కల్లూరులోనూ మున్సిపాలిటీని ఏకపక్షంగా కాంగ్రెస్ విజయం సాధించింది. ఇల్లెందు మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ సొంతం చేసుకుంది. ఏడు మున్సిపాలిటీల్లో నాలుగింటిని ఇప్పటికే కాంగ్రెస్ కైవసం చేసుకోగా, రెండింటిలో కాంగ్రెస్ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. మొత్తం మీద ముగ్గురు మంత్రులు ఈ ఎన్నికల్లో తమ సత్తాను చాటినట్లయింది. బీఆర్ఎస్ నామమాత్రంగానే నిలిచింది.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో గెలుపెవరిదంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారులుగా మారిన చోట కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఎమ్మెల్యేలు పార్టీ మారినప్పటికీ ప్రజలు మాత్రం కాంగ్రెస్ వైపు నిలబడ్డారు. స్పీకర్ గడ్డం ప్రసాదరావు పార్టీ మారడానికి ఆధారాల్లేవని చెప్పినప్పటికీ బీఆర్ఎస్ మాత్రం పదే పదే వారు పార్టీ మారారని అంటుంది. పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఐదు చోట్ల మాత్రమే మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. ఈ ఐదింటిలో మూడు నియోజకవర్గాల్లో మాత్రం కాంగ్రెస్ విజయం సాధించింది. రెండు స్థానంలో మాత్రం హంగ్ ఏర్పడింది.

**స్టేషన్ ఘన్ పూర్ లో కాంగ్రెస్...**

కడియం శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మున్సిపాలిటీని గెలుచుకుంది. కడియం శ్రీహరి కుమార్తె కావ్య గత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అయితే కడియం శ్రీహరి విషయంలో ఇంకా స్పీకర్ తీర్పు వెలువరించలేదు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత తీర్పు వెలువరించే అవకాశముంది. అనధికారికంగా చూస్తే కడియం శ్రీహరి కాంగ్రెస్ కు మద్దతుదారుగానే ఉన్నారు. కానీ అక్కడ కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు.

బాన్సు వాడలోనూ పోచారం శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ మద్దతుదారుగా నిలిచారు. అక్కడ కూడా కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి కాలె యాదయ్య కూడా బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ వైపు వెళ్లారు. కానీ ఇక్కడ కూడా కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి మున్సిపాలిలిటీని సొంతం చేసుకున్నారు. కానీ గద్వాల్ నియోజకవర్గంలో బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి నేతృత్వంలో అక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గెలవలేదు.హంగ్ ఏర్పడింది. జగిత్యాలలోనూ సంజీవ్ కుమార్ కు, సీనియర్ నేత జీవన్ రెడ్డి వర్గాల మధ్య పోరు జరిగింది. దీంతో ఇక్కడ కూడా స్పష్టమైన మెజారిటీ రాలేదు. ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గంలో కాంగ్రెస్ మూడు చోట్ల విజయం సాధించినట్లయింది.

# సెంటిమెంట్ కార్డుతో కారు స్పీడందుకోనట్లుందిగా?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుకున్న స్థాయిలో రాణించలేదు. బావా బామర్దులు విస్తృతంగా చేసిన ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారని స్పష్టంగా అర్థమవుతుంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు కొంత వ్యతిరేకత కనిపిస్తుందని అంచనా వేశారు. ఫార్ములా ఈ రేసు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు, కాళేశ్వరం కేసులో విచారణ ఇలా అన్ని సందర్భాల్లో కేసీఆర్ తో పాటు కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ ముఖ్య నేతలను విచారించడంతో కొంత సానుభూతి వస్తుందని ఆశించారు. సానుభూతిపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నారు. అక్రమ కేసులు తమపై బనాయిస్తున్నా ఒక్క కేసులో నిజాలను వెలికి తీయలేకపోయారని, అరెస్ట్ చేయలేకపోయారని జనంలోకి కేటీఆర్, హరీశ్ రావులు వెళ్లారు.

**అవినీతి.. విచారణలు...**

మరొకవైపు బీఆర్ఎస్ క్యాడర్ కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ముందుకు రావడంతో కొంత నాయకత్వం క్షేత్ర స్థాయిలో పటిష్టం అవుతుందని ఆశించారు. అయితే బీఆర్ఎస్ నేతలు అంచనాలు మున్సిపల్ ఎన్నికల్లో విఫలమయ్యాయనే చెప్పాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతి అంటూ అనేక ఆరోపణలు చేశారు. ఎన్నికలకు ముందు నుంచే రోజుకొక అంశంపైన అవినీతి జరిగిందని బయటకు తీసుకు వచ్చారు. సింగరేణి బొగ్గు గనుల టెండర్ నుంచి అనేక విషయాల్లో ఆరోపణలు చేశారు. ఇక కృష్ణా నీటి విషయంలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలను కూడా చేశారు. కృష్ణా నది వాటాను ఈ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని తెలిపారు.

ఒక వైపు సంక్షేమ పథకాలు అమలు కాదంటూ విమర్శలు చేస్తూనే...




మరొకవైపు సాగు నీటి సెంటిమెంట్ ను కూడా బీఆర్ఎస్ అగ్ర నాయకత్వం అందుకుంది. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై స్వయంగా కేసీఆర్ మీడియా సమావేశం పెట్టి విమర్శలు చేశారు. అయినా ప్రజలు సెంటిమెంట్ కు ఈ ఎన్నికల్లో తలొగ్గలేదన్నది ఫలితాలను బట్టి అర్థమవుతుంది. మరొకవైపు క్యాడర్ లోనూ ఇంకా సందిగ్ధత నెలకొంది. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశం కూడా పదే పదే ప్రస్తావించినప్పటికీ ప్రజలు విశ్వసించలేదు.

అయితే పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో పోలిస్తే తాము గణనీయమైన విజయాన్ని సాధించామని గులాలాబీ పార్టీ నేతలు చెప్పుకుంటున్నప్పటికీ అనుకున్న స్థాయిలో ఫలితాలు రాలేదన్న వాస్తవాన్ని నాయకత్వం అంగీకరించి తీరాల్సిందే.

# అర్బన్ ఓటర్లు హస్తానికి జై కొట్టడానికి రీజన్ ఇదేనా?




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో విజయం దిశగా దూసుకుపోతుంది. ఈ ఎన్నికలు పార్టీ గుర్తులతో జరిగాయి. ఖచ్చితంగా కొంత పార్టీ గుర్తులు ప్రభావం చూపుతాయని బీఆర్ఎస్ ఆశలు పెట్టుకుంది. తమ పదేళ్ల పాలనకు, ఇప్పటి కాంగ్రెస్ పాలన రెండేళ్లకు పోలికను చూసి ప్రజలు ఓట్లేస్తారని అనుకున్నారు. అలాగే పట్టణ ఓటర్లు ఖచ్చితంగా డబ్బులు, హామీలకు లోను కాకుండా అభివృద్ధి, సంక్షేమం వైపు చూస్తారని కారు పార్టీ గట్టి విశ్వాసంతో ఈ ఎన్నికల్లో బరిలోకి దిగింది.

**బీఆర్ఎస్ విమర్శలను కూడా...**

కానీ ముఖ్యమంత్రి రెడ్డి నాయకత్వాన్ని బలపర్చే విధంగా ప్రజల తీర్పు చెప్పినట్లయింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులు కాలికి బలపం కట్టుకుని రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో లోపాలను ఎత్తి చూపేందుకే ఎక్కువ ప్రయత్నాలు చేశారు. రైతు భరోసా నిధులు రాలేదని, కల్యాణమస్తు పథకం అమలు కాలేదని, 420 హామీలు అమలుకు నోచుకోలేదని పదే పదే చెప్పారు. కేసీఆర్ పాలనలోనే అత్యధికంగా సంక్షేమం అందిందని చెప్పి ఓటర్ల మనసులను గెలుచుకునేందుకు ప్రయత్నించారు.

**సంక్షేమం..అభివృద్ధిని...**

అర్బన్ ఓటర్లు ఒక రకంగా హస్తం పార్టీ వైపు చూశారనే చెప్పాలి. అభివృద్ధి, సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కనిపించింది. ఫోర్త్ సిటీతో పాటు పెట్టుబడులు తేవడంలోనూ కొంత కాంగ్రెస్ ముందంజలో ఉందని భావించారు. ఓవరాల్ గా కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత లేదన్నది ఈ ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమయిందనే చెప్పాలి. ప్రభుత్వం తమకు అండగా ఉంటుందని, ముఖ్యంగా తమ సమస్యలను వినిపించుకునే వీలు ఈ పాలనలో దొరుకుతుందని భావించి ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. బీఆర్ఎస్ ప్రచారం పెద్దగా ప్రభావం చూపలేదన్నది స్పష్టమమయింది.

# ఎలుగబంటి బీభత్సం



**అదిలాబాద్, ఫిబ్రవరి 13, పెన్ పవర్:**
ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల సరిహద్దుల్లో ఎలుగుబంటి సృష్టించిన బీభత్సం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా దయాల్ ధన్నూర్ గ్రామ శివారులో పొలం పనుల్లో ఉన్న ఎనిమిది మందిపై ఒక ఎలుగుబంటి ఒక్కసారిగా విరుచుకుపడింది. ఈ భీకర దాడిలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. మిగిలిన ఆరుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన తెలంగాణ సరిహద్దుకు కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే జరగడంతో అటవీ శాఖ యంత్రాంగం తక్షణమే రంగంలోకి దిగిందిఎనిమిది మందిపై దాడి చేసి తీవ్ర ఆగ్రహంతో ఉన్న ఆ ఎలుగుబంటి, ఇప్పుడు తెలంగాణ భూభాగంలోకి ప్రవేశించినట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ సరిహద్దు గ్రామాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా బోథ్ మండలంలోని నిగిని, మర్లపెల్లి అటవీ ప్రాంతాల్లో ఎలుగుబంటి సంచరించే అవకాశం ఉన్నందున, ఆ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నిగిని గ్రామం నుండి మహారాష్ట్రలోని శివిని పట్టణానికి వెళ్లే రహదారిపై ప్రయాణాలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ఈ మార్గంలో ఎవరూ వెళ్లవద్దని సూచించారు. అలాగే, పశువుల కాపరులు తమ పశువులను మేపడానికి అడవిలోకి తీసుకెళ్లవద్దని, రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ఒంటరిగా అటవీ శివారు ప్రాంతాలకు వెళ్లవద్దని ఖరాకండిగా చెప్పారు. మనుషులపై దాడి చేసి రక్తరుచి మరిగిన ఎలుగుబంటి ఎదురుపడితే ప్రాణాపాయం పొంచి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.ప్రస్తుతం అటవీ శాఖ సిబ్బంది సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం పహారా కాస్తున్నారు. ఎలుగుబంటి కదలికలను కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సమీప గ్రామాల ప్రజలు రాత్రి సమయాల్లో ఇళ్ల నుండి బయటకు రావద్దని, ఏవైనా అసాధారణ శబ్దాలు లేదా కదలికలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం
అందించాలని కోరారు. మృగం పట్టుబడే వరకు ప్రజలు గుంపులుగా ఉండాలని, స్వీయ రక్షణ చర్యలు పాటించాలని డి.ఎఫ్.ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# కమ్యూనిస్టులకు కాంగ్రెస్ కు ఎక్కడ చెడింది,...



**ఖమ్మం ఫిబ్రవరి 13, పెన్ పవర్:**
తెలంగాణ పాలిటిక్స్‌లో ఊహించని ట్విస్టులు తెరమీదకు వస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐతో పొత్తు, తెలంగాణ జన సమితి మద్దతులతో..కాంగ్రెస్ లబ్ది పొందగలిగింది. అధికారంలోకి రావడంతో ఆ రెండు పార్టీల బంధాన్ని అలాగే కంటిన్యూ చేయాలని భావించింది కాంగ్రెస్ పార్టీ. ముందస్తుగా ఆ పార్టీలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం హామీలను అమలు చేయాలనుకుంది.సీపీఐకి ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటును కేటాయించింది. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరామ్ కూడా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ గా నామినేట్ చేసింది. ఇక నామినేటెడ్ పదవుల విషయంలో కూడా..పదవులు ఇచ్చి బంధాలను కంటిన్యూ చేసుకోవాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ బంధం నిన్న మొన్నటి వరకు అంతా బాగానే ఉన్నా..మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తూట్లు పడ్డాయి. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ ఎవరికి వారే పోటీ చేశారు.సీపీఐ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక నియోజకవర్గం కొత్తగూడెం. కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే మాత్రమే కాదు.. సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూడా. అలాంటి వ్యక్తి ప్రాతినిధ్యం వహిస్తున్న కొత్తగూడెంలోనే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్కు సీపీఐకి పొత్తు కుదరలేదు. దీంతో రాష్ట్రంలోని మిగతా చోట్ల కూడా కాంగ్రెస్తో పొత్తుకు బీటలు వారిందనే టాక్వినిపిస్తోంది.మున్సిపల్ ఎన్నికల సైరన్ మోగిన మొదట్లో.. రెండు పార్టీలు కలిసే పని చేయాలని భావించాయి. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా సీపీఐతో కలిసే పనిచేస్తాయంటూ పలుసార్లు స్టేట్మెంట్లు ఇచ్చారు. కానీ కొత్తగూడెం పొత్తు విషయంలో రెండు పార్టీలు పంతం పట్టాయి.కొత్తగూడెంలో తమ ఎమ్మెల్యే ఉండటంతో మున్సిపల్ టికెట్లలో తమకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ పట్టుబట్టింది. కానీ ఇక్కడ కాంగ్రెస్ ససేమిరా అంటూ మొండికేసింది. మెజారిటీ సీట్లు తమకే కావాలని కాంగ్రెస్ పట్టుపట్టింది. దీంతో ఆఖరి వరకు వేచి చూసిన సీపీఐ..ఒంటరి పోరుకు మొగ్గు చూపింది. దీంతో కొత్తగూడెం ఎఫెక్ట్..రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాలపై కూడా పడింది. చాలా మున్సిపాలిటీల్లో సీపీఐ, కాంగ్రెస్ ఎవరికి వారే పోటీ చేశారు. కొన్ని చోట్ల సీపీఐ నేతలు బీఆర్ఎస్ తోనూ జట్టు కట్టారు.కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ మధ్య గ్యాప్ రావడానికి ఓ కీలక మంత్రే కారణమని..రెండు పార్టీల్లో చర్చ జరుగుతోంది. కొత్తగూడెం విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొదటి నుంచి కూడా స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో కొత్తగూడెం నుంచే పోటీ చేయాలని ఆయన భావించారు. కానీ పొత్తు కుదరడంతో..కొత్తగూడెం సీటును సీపీఐకి ఇచ్చి..తాను పాలేరుకు షిఫ్ట్ కావాల్సి వచ్చింది. కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా కొత్తగూడెం నుంచే పోటీ చేయాలనే ఆలోచనలో పొంగులేటి ఉన్నారట.కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐని కాదని..ఒంటరి పోరాటానికి మొగ్గు చూపేలా స్కెచ్ వేశారట. ఇప్పుడు సీపీఐ రాష్ట్ర నాయకత్వం మంత్రి పొంగులేటి తీరుపై గుర్రుగా ఉందట. పొంగులేటి తీరు వల్లే రెండు పార్టీల మధ్య పొత్తుకు బీటలు వారాయని రగిలిపోతున్నారట. కాంగ్రెస్, సీపీఐ మధ్య భవిష్యత్‌తో అయినా పొత్తు ఉంటుందా.? ఇప్పుడు వచ్చిన గ్యాప్ కంటిన్యూ అవుతుందా అనేది ఎన్నికల ఫలితాలను బట్టే తేలే అవకాశం ఉంది.

# మేడారం కలెక్షన్లు 14 కోట్లే...



**వరంగల్, ఫిబ్రవరి 13, పెన్ పవర్:**
మేడారం హుండీల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయింది. వారం రోజుల పాటు మొత్తం 500 మంది సిబ్బంది 828 హుండీలను లెక్కించారు. అయితే ప్రభుత్వం అంచనా వేసిన ఆదాయం మాత్రం రాకపోవడం గమనార్హం. ఈసారి మేడారంలో దాదాపు 300 అదనపు హుండీలు ఏర్పాటు చేసి.. రూ.40 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు భావించగా.. అందులో సగం కూడా రాలేదని వెల్లడించారు. ఇక వచ్చిన ఆదాయంలో 33 శాతం మేడారం పూజారులకు అందించాల్సి ఉంటుంది.ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా భావించే.. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా పూర్తి అయిన సంగతి తెలిసిందే. దాదాపు రెండున్నర కోట్ల మంది భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా.. ఇతర రాష్ట్రాల నుంచి కూడా మేడారం చేరుకుని సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. బియ్యం పోసి, బంగారం (బెల్లం) సమర్పించి.. కోరికలు కోరుకున్నారు. ఈ నేపథ్యంలోనే మహా జాతర పూర్తి కావడంతో.. మేడారంలో ఏర్పాటు చేసిన హుండీలను అధికారులు లెక్కించారు. హనుమకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి అన్ని హుండీలను తరలించిన అధికారులు లెక్కింపు పూర్తి చేశారు. ఇక మేడారం హుండీల్లో వచ్చిన ఆదాయంలో 33 శాతం అక్కడ పూజలు అందించిన పూజారులకు ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి చేరనుంది.ఈనెల 5వ తేదీన ప్రారంభమైన మేడారం హుండీల లెక్కింపు ప్రక్రియ వారం రోజుల పాటు కొనసాగి బుధవారం ముగిసింది. రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో దేవాదాయ శాఖ సిబ్బంది, వాలంటీర్లు కలిసి మొత్తం 500 మంది ఈ హుండీల్లోని సొమ్మును లెక్కించారు. మొత్తం 828 హుండీలను లెక్కించిన అధికారులు.. రూ.13,25,83,269 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. హుండీల లెక్కింపును పటిష్ట బందోబస్తు, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో లెక్కించారు. మేడారం హుండీల్లో పలు దేశాలకు చెందిన కరెన్సీ, రద్దు చేసిన నోట్లు, బంగారం, వెండి, గిల్టు నగలు కూడా ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు.2 ఏళ్ల క్రితం 2024 మహా జాతరలో ఏర్పాటు చేసిన హుండీల్లో రూ.13,25,22,511 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడా దాదాపు అంతే మొత్తం రావడం విశేషం. 2024 జాతరలో మొత్తంగా 540 హుండీలను ఏర్పాటు చేయగా.. ఈసారి భారీగా పెంచారు. ఈసారి అదనంగా 288 హుండీలు జోడించిన అధికారులు ఏకంగా 828 హుండీలను మేడారంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ గతంలో వచ్చినంతే ఆదాయం ఇప్పుడు రావడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే మేడారం జాతరకు ఈసారి హుండీ ఆదాయం తగ్గినట్లు అధికారులు ప్రకటించారు. మరోవైపు.. ఈ హుండీ లెక్కింపులో భాగంగా వచ్చిన బియ్యాన్ని తూకం వేసి.. టెండర్ల ద్వారా విక్రయించనున్నారు.సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద 588 హుండీలు ఏర్పాటు చేయగా.. పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు సమీపంలో మరో 152 హుండీలను అధికారులు ఉంచారు. వడి బియ్యం కోసం.. తిరుగు వారం కోసం మరికొన్ని సహా మొత్తంగా 828 హుండీలను ఈసారి మేడారం జాతరలో ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లలో మేడారం హుండీ ఆదాయాన్ని పరిశీలిస్తే క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2018 మహా జాతరలో మేడారం హుండీ ఆదాయం రూ.8.14 కోట్లు రాగా.. 2020లో అది రూ.9.87 కోట్లకు పెరిగింది.ఆ తర్వాత 2022లో రూ.12.45 కోట్లు మేడారం హుండీ ఆదాయం రాగా.. 2024 జాతరలో రూ.13 కోట్ల మేర ఆదాయం లభించింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈసారి మేడారం జాతరను ప్రతిష్టాత్మకంగా చేపట్టి.. అక్కడ భారీగా సౌకర్యాలను ఏర్పాటు చేసింది. దీంతో భారీగా భక్తులు కూడా పోటెత్తారు. దీంతో హుండీ ఆదాయం కూడా గత జాతర కంటే 3 రెట్లు పెరుగుతుందని అధికార వర్గాలు అంచనా వేశాయి. హుండీలు కూడా అధికంగా ఏర్పాటు చేయడంతో సుమారు రూ.40 కోట్ల వరకు మేడారం హుండీల ద్వారా ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కానీ లెక్కింపు పూర్తి అయ్యేసరికి 2024 జాతర కంటే స్వల్పంగానే ఎక్కువ రావడం గమనార్హం. అయితే అధికారుల అంచనాల్లో సగం కూడా రాకపోవడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## గతి శక్తి మల్టీ-మోడల్ కార్గో టెర్మినల్

**వరంగల్, ఫిబ్రవరి 13, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో సరుకు రవాణా రంగం సరికొత్త పుంతలు తొక్కనుంది. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చర్యలతో రాష్ట్రంలోని మొట్టమొదటి 'గతి శక్తి మల్టీ–మోడల్ కార్గో టెర్మినల్' వరంగల్ జిల్లాలో ఏర్పాటు కానుంది. చారిత్రక నగరమైన వరంగల్ సమీపంలోని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ పరిధిలో ఈ మెగా ఫ్రైట్ టెర్మినల్ సేవలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు సరుకు రవాణా కోసం, కంటైనర్ల ఎగుమతి కోసం ఎక్కువగా హైదరాబాద్‌లోని సనత్‌నగర్ వంటి ప్రాంతాలపైనే ఆధారపడాల్సి వచ్చేది. కానీ ఈ కొత్త టెర్మినల్ రాకతో ఉత్తర తెలంగాణ జిల్లాల ముఖచిత్రం మారబోతోంది.వరంగల్, హన్మకొండ చుట్టుపక్కల జిల్లాల్లో గ్రానైట్ పరిశ్రమ, వ్యవసాయ ఉత్పత్తులు (ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి), టెక్స్‌టైల్స్ వ్యాపారం విస్తృతంగా ఉంది. ఈ ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు లేదా ఓడరేవులకు తరలించడానికి రోడ్డు మార్గంపై ఆధారపడటం వల్ల రవాణా భారం అధికమయ్యేది. ఇప్పుడు రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ అత్యాధునిక టెర్మినల్ద్వారా తక్కువ ఖర్చుతో, సురక్షితంగా సరుకులను రవాణా చేసే వెసులుబాటు కలుగుతుంది. ఈ టెర్మినల్‌లో భారీ కంటైనర్లను హ్యాండిల్ చేయడానికి, నిల్వ చేయడానికి, ట్రక్కుల నుండి రైల్వే వ్యాగన్లకు సరుకు మార్చడానికి అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు.ఇది కేవలం రవాణా కేంద్రంగానే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ టెర్మినల్ చుట్టూ లాజిస్టిక్స్ పార్కులు, గోదాములు వెలిసే అవకాశం ఉండటంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన 'గతి శక్తి' విధానంలో భాగంగా దీనిని అభివృద్ధి చేశారు. ఈ టెర్మినల్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే, వరంగల్ నగరం తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద వాణిజ్య, రవాణా కేంద్రంగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## జీవన్ రెడ్డి అంశం రెండుగా చీలిన కాంగ్రెస్

**నిజామాబాద్, ఫిబ్రవరి 13, పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ నిర్ణయాలను ధిక్కరించిన వారిపై సస్పెన్షన్ వేటు వేసేందుకు రంగం సిద్ధమయినట్లు తెలిసింది. కొందరిని పార్టీ నుంచి బహిష్కరించాలని కూడా నిర్ణయించారు. కాంగ్రెస్ అభ్యర్థులకు పోటీగా రెబల్స్ గా నిలిచిన వారిపై పార్టీ బహిష్కరణ వేటు వేయాలని డిసైడ్ అయింది. ఇప్పటికే అన్ని జిల్లాల నుంచి అందిన సమాచారం మేరకు కొందరిపై చర్యలకు సిద్ధమయింది. అయితే మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి విషయంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెలుస్తోంది. జీవన్ రెడ్డిని సస్పెండ్ చేయాలని రేవంత్ రెడ్డి అనుకూల వర్గం, అలా కుదరదంటూ మరొక వర్గం తమ వాదనలను వినిపిస్తున్నారని తెలిసింది.జోగులాంబ గద్వాల జిల్లా మాజీ జడ్పీచైర్మన్ సరితా తిరుపతయ్య యాదవ్ తో పాటు వివిధ మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో రెబెల్స్ గా నిలిచిన వారిపై బహిష్కరణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అయితే జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి సస్పెన్షన్ విషయంలో కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తలెత్తినట్లు తెలిసింది. జీవన్ రెడ్డిని ఇప్పటికే తీవ్రంగా అవమానించామని, పార్టీనే నమ్ముకుని ఉన్న జీవన్ రెడ్డిని పార్టీ మారి వచ్చిన ఒక ఎమ్మెల్యే కోసం బహిష్కరించాలనుకోవడం సరికాదని కొందరు వాదిస్తున్నారు. తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కొందరరు కాంగ్రెస్ నేతలు, మంత్రులు అలా చేస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని అంటున్నారు. జీవన్ రెడ్డిని పిలిచి మాట్లాడాల్సిందని అంటున్నారు.పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నారు కాబట్టి వేటు తప్పదు రేవంత్ వర్గం వాదిస్తుంది. జీవన్ రెడ్డి విషయంలో రెండుగా చీలిన కాంగ్రెస్ నేతలు ఈ పంచాయతీని హైకమాండ్ వద్దకు తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. జగిత్యాలలో దాదాపు 20, గద్వాలలో ఏడు స్థానాల్లో పోటీలో రెబెల్స్ నిలిచారు. ఆర్మూరు మున్సిపల్ బరిలో రెబల్స్ గా నలుగురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోటీలో ఉన్నారు. కరీంనగర్ నగర్ జిల్లా రాయికల్ మున్సిపాలిటీలోనూ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సంగారెడ్డి మరియు సదాశివపేట మున్సిపాలిటీలలో రెబెల్స్, అసంతృప్తుల తో పాటు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసినందుకు కొందరిపై యాక్షన్ కు సిద్ధమయినట్లు సమాచారం.

## మలక్ పేట లో ట్రాఫిక్ సేఫ్టీ అవగాహనా కార్యక్రమం




**హైదరాబాద్: పెన్ పవర్:** నేషనల్ రోడ్డు సేఫ్టీ ట్రాఫిక్ పోలీసుల అవగాహనా కార్యక్రమంలో భాగంగా నేషనల్ రోడ్డు సేఫ్టీ సందర్భంగా మలక్ పేట్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, అలాగే మనిషి విలువైన జీవితం గురించి ప్రత్యేకంగా చర్చించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ సిగ్నల్స్ను కచ్చితంగా పాటించాలి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదు. సీట్బెల్ట్ ధరించడం తప్పనిసరి. మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరం. ఓవర్ స్పీడ్, సెల్ ఫోన్ వినియోగం ప్రమాదాలకు దారి తీస్తాయని అన్నారు. ట్రాఫిక్ నియమాలు మన భద్రత కోసమే రూపొందించబడ్డాయి. ఒక చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి కారణమవుతుంది. కుటుంబ సభ్యులు మన కోసం ఎదురుచూస్తుంటారు కాబట్టి సురక్షితంగా ఇంటికి చేరుకోవడం మన బాధ్యత. డబ్బు, వస్తువులు తిరిగి సంపాదించవచ్చు. కానీ ఒకసారి కోల్పోయిన ప్రాణం తిరిగి రాదు. ప్రతి వాహనదారుడు తన ప్రాణాన్ని, ఇతరుల ప్రాణాలను గౌరవించాలి. ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు పాంప్లెట్లు పంపిణీ చేసి, రూల్స్ పాటించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో మలక్ పేట్, సైదాబాద్ ఏసీపీ, ఇన్సి పెక్టర్స్, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మజ్లీస్ పార్టీ సహాయం వల్లే కాంగ్రెస్ కు సీట్లు వచ్చాయి

**హైదరాబాద్: పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఆశించిందే. తక్కువ ఓట్ల తో కొన్ని చోట్ల ఓడిపోయాం. మజ్లీస్ పార్టీ సహాయం వల్లే కాంగ్రెస్ కు సీట్లు వచ్చాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అన్నారు. బీజేపీ ని ఓడించాలని కాంగ్రెస్ , ఎంఐఎం, బీఆర్ఎస్ కలిసి ప్లాన్ చేశారు. బీజేపీ గెలిచే చోట్ల ఓట్లను విడగొట్టారు. సీట్లు తగ్గినా ఓట్ షేర్ పెరిగింది. గతంలో 13 శాతం ఉంటే 26 శాతానికి ఓట్ షేర్ పెరిగింది. గతం కంటే మజ్లీస్ కు ఎక్కువ సీట్లు వచ్చాయని అన్నారు. బీజేపీ ప్రాతినిధ్యం లేని చోట్ల గెలిచాం.నల్గొండ లో ఎక్కువ సీట్లు గెలుస్తామని అనుకున్నాం. నల్గొండ ఎక్కువ సీట్లు రాకపోవడానికి కారణం అధికార పార్టీ దౌర్జన్యం. మున్సిపల్ కార్పొరేషన్ లో నిజామాబాద్ , కరీంనగర్ కైవసం చేసుకుంటామని అన్నారు. 320 పైగా మున్సిపాలిటీ, కార్పొరేషన్ స్థానాలను గెలు

# ఘోర రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి

**వరంగల్: పెన్ పవర్:** పరకాలలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మాందారిపేట గోవిందపూర్ గుట్టల వద్ద మలుపు వద్ద టిప్పర్ బోల్తాపడటంతో డ్రైవర్ దేవేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. టిప్పర్ కి ఎవరు అడ్డురాలేదని, డ్రైవర్ తప్పిదం వల్లే ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## మాజీద్ పూర్ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం ఒకరు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ జిల్లా జీనమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాజీద్ పూర్ చౌరస్తా వద్ద శుక్రవారం ఉదయం క్రేన్, టాటా ఏస్, బొలెరో వాహనాలు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారికి స్థానికులు, పోలీసులు సహాయంతో సమీప ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# మున్సిపల్ ఓట్ల లెక్కింపు ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం ప్రారంభం అయింది. రాష్ట్రంలో 7 కార్పొరేషన్లు,116 మున్సిపాలిటీ లలో ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 123 కేంద్రాల్లో ఓట్లు లెక్కిస్తున్నారు..మధ్యాహ్నం వరకు మున్సిపాలిటీల ఫలితాలు సాయంత్రం లోగ కార్పొరేషన్ల ఫలితాలు వెల్లడి కానున్నాయి. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించాక సాధారణ బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్ ప్రారంభం కానుంది.

# సృష్టి సరోగసి కేసులో డాక్టర్ నమ్రత అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** సృష్టి సరోగసి కేసులో డాక్టర్ నమ్రతతో పాటు ఆమె కొడుకును ఈడీ అధికారులు అరెస్ట్ చేసారు. గిరిజనుల వద్ద నుంచి బిడ్డలను కొనుగోలు చేసి సరోగసి ద్వారా పుట్టినట్లు నమ్మించి కోట్ల రూపాయలు మోసం చేసినట్లు ఆరోపణ. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్పై దాడుల్లో 30 కోట్ల అక్రమ ఆస్తులున్నట్లు గుర్తించారు. ఎనిమిది బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసారు. మనీ లాండరింగ్ యాంగిల్లో ఈడీ దర్యాప్తు చేస్తోంది. సరోగసీ ముసుగులో చైల్డ్ ట్రాఫికింగ్ కూడా చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# ఖానామెట్ లో హైడ్రా కూల్చివేతలు అడ్డుకున్న స్థానికులు

**హైదరాబాద్: పెన్ పవర్:** మాదాపూర్ ఖానామెట్ లోని సర్వేనెంబర్ 55 లో 2.5 రెండున్నర ఎకరాలలో ఉన్న అర్ధనారీశ్వర టెంపుల్ వెలుపలే వెలసిన షాపులను హైడ్రాధికారులు కూల్చివేశారు. ఈ కూల్చివేతలకు ఆలయ సభ్యులు, పూజారులు, స్థానికులు అడ్డుకున్నారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా స్టేటస్కో ఉండంగా దౌర్జన్యంగా కూల్చివేతలు చేపడుతున్నారని ఆరోపించారు. అధికారుల తో అడ్డుకునే క్రమంలో యుద్ధ వాతావరణం నెలకొంది.

# రాంచరణ్ పిల్లల పేర్లు ఇవే

**హైదరాబాద్, ఫిబ్రవరి 13, పెన్ పవర్:** మెగా పవర్ స్టార్ రాంచరణ్, ఉపాసన కొణిదెల దంపతులు ఇటీవల పండంటి కవలలకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. జనవరి 31న ఉపాసన మగ బిడ్డ, ఆడ బిడ్డలకు జన్మనివ్వడంతో మెగా ఫ్యామిలీలో ఆనందం వెల్లివెరిసింది. ఇక ఈ శుభవార్త విన్న తర్వాత అభిమానులు కూడా సంబరాలు చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని అపోలోహాస్పిటల్ వద్దకు వేలాది సంఖ్యలో వచ్చి రామ్ చరణ్– ఉపసాన దంపతులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన ఉపాసన తన కవల పిల్లలను ఇంటికి తీసుకొచ్చింది. అలాగే ఇప్పుడు సంప్రదాయంగా నామకరణ మహోత్సవం కూడా నిర్వహించినట్లు తెలుస్తోంది. పండితుల సూచలు, సలహాలతో కేవలం కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఈ వేడుకను నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రామ్ చరణ్– ఉపాసనల కవల పిల్లల పేర్లను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు.పిల్లల జాతకం, జన్మనక్షత్రాల ప్రకారం కూతురికి అన్వీరా దేవీ, కుమారుడికి శివరామ్ అని పేర్లు పెట్టినట్లు తెలుస్తుంది. అన్వీరా దేవి అంటే ధైర్యవంతురాలైన అమ్మవారు అని వస్తోంది. అలాగే చిరంజీవి అసలు పేరు లోని శివ, రామ్ చరణ్ పేరులోని రామ్ ను తీసుకుని కుమారుడికి శివ రామ్ అని నామకరణం చేశారు. ప్రస్తుతం మెగాభిమానులు ఈ పోస్టులను తెగ షేర్ చేస్తున్నారు.

# లక్సెట్టిపేట కౌంటింగ్ లో గందరగోళం అభ్యర్థుల అందోళన

**మంచిర్యాల: పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపాలిటీ ఎన్నికల కౌంటింగ్లో గందరగోళం ఏర్పడింది. మూడో వార్డుకు సంబంధించి రెండు బ్యాలెట్ బాక్స్ లకు కవర్ సీల్ లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ అభ్యర్థులు అక్రమాలకు పాల్పడ్డారంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కౌంటింగ్ నిలిపివేసి సీసీ ఫుటేజ్ ద్వారా క్లారిటీ ఇవ్వాలని అభ్యర్థులు డిమాండ్ చేసారు.

# ఏఐ వినియోగంపై కేంద్రం ఆంక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన కంటెంట్‌కు సంబంధించి కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను ప్రచురించేటప్పుడు సోషల్ మీడియా వేదికలు తప్పనిసరిగా లేబుల్ (వాటర్ మార్క్) వేయాలని ఆదేశించింది. ఏఐ కంటెంట్‌ను అందరూ సులువుగా గుర్తించేలా ఆ లేబుల్ ఉండాలని స్పష్టం చేసింది. ఒకసారి మార్క్ చేసి కంటెంట్, మెటా డేటాను తొలగించడం లేదా దానిని కనిపించకుండా చేయడానికి అవకాశం ఉండరాదదని తెలిపింది. చట్టవిరుద్ధమైన, అభ్యంతకరమైన, మోసపూరిత కంటెంట్‌ను నిరోధించేందుకు ఆటోమేటెడ్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సోషల్ మీడియా వేదికలకు సూచించింది. ఏఐ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తే జరిమానాలు, శిక్షల గురించి యూజర్లకు అవగాహన కల్పించాలని పేర్కొంది. ఇందుకోసం ప్రతి 3 నెలలకు ఒకసారి హెచ్చరికల సందేశాలు పంపించాలని తేల్చిచెప్పింది.తమ వేదికల్లో ఏఐ క్రియేషన్ లేదా డీప్‌ఫేక్ కంటెంట్‌ను తొలగించేందుకు కూడా సోషల్ మీడియ ప్లాట్‌మ్‌లకు గడువు విధించింది. ప్రభుత్వం లేదా న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేసినప్పుడు వాటిని మూడు గంటల్లోపే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఏఐ క్రియేటెడ్ కంటెంట్ వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. ఏది అసలు? ఏది ఏఐ? అనేది గుర్తుపట్టలేనంతంగా ఉంటోంది. అందుకే ఏఐ కంటెంట్‌ను గుర్తించేలా వాటర్ మార్క్ పెట్టాలని సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం ఆదేశించింది.ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గత నెలలో ఐటీ (ఇంటర్మీడియరీ మార్గదర్శకాలు,డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) చట్టం నియమాలు 2021 కు ప్రతిపాదించిన ముసాయిదా సవరణలు, ఆన్‌లైన్‌లో ఘా× ఆధారిత డీప్‌ఫేక్‌లు వ్యాప్తిపై పెరుగుతున్న ఆందోళనల మధ్య తాజా ఆదేశాలు వెలువడ్డాయి. క్రియేషన్ లేదా సవరించిన కంటెంట్‌ను పోస్ట్ చేసేటప్పుడు యూజర్లు దానిని వెల్లడించడం తప్పనిసరని ముసాయిదా నియమాలు చెబుతున్నాయి. అటువంటి ప్రకటనలను ధ్రువీకరించడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను సాంకేతికతను వినియోగించాలని సూచిస్తున్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఇప్పటికే వినియోగదారులకు నిర్దిష్ట కంటెంట్‌ను ఏఐను ఉపయోగించి రూపొందించిన లేదా సవరించిన దానిని లేబుల్ చేయడానికి అనుమతించే మార్గదర్శకాలను విడుదల చేసింది.

# రూపురేఖలు మారుతున్న స్మార్ట్ సిటీ

**కరీంనగర్, ఫిబ్రవరి 13, పెన్ పవర్:** తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కరీంనగర్ ఒకటి. స్మార్ట్ సిటీప్రాజెక్టుల కింద చేపట్టిన అభివృద్ధి పనులు నగర రూపురేఖలను మార్చేశాయి. మెరుగైన రహదారులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, ఇండోర్ స్టేడియం వంటి మౌలిక సదుపాయాలు పెరగడంతో, నగర శివారు ప్రాంతాలైన రేకుర్తి, తీగలగుట్టపల్లి , ఆల్గనూర్ వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీగా పుంజుకుంది. ఇక్కడ ప్రస్తుతం చదరపు అడుగు ధర సగటున రూ. 7,000 నుండి రూ. 8,000 వరకు పలుకుతోంది.ఈ వృద్ధికి ప్రధాన కారణం ప్రతిష్టాత్మకమైన మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్. మానేరు నది తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు తుది దశకు చేరుకున్నాయి. దీనికి అనుబంధంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జి ,ఐటీ టవర్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాయి. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న భూములకు డిమాండ్ పెరగడమే కాకుండా, కమర్షియల్ వెంచర్లకు, లగ్జరీ అపార్ట్‌మెంట్‌లకు ఇది కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.కరీంనగర్ ఇప్పుడు కేవలం నివాస ప్రాంతంగానే కాకుండా, విద్య , వైద్య హబ్‌గా కూడా

ఎదుగుతోంది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన మెడికల్ కాలేజీలు, మల్టీ–స్పెషాలిటీ ఆసుపత్రులు మరియు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్లాన్డ్ డెవలప్‌మెంట్ వల్ల పెట్టుబడిదారులు ఇక్కడ స్థిరాస్తులు కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా కొత్తగా ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ 2031 అమలులోకి వస్తే, నగరం చుట్టూ రింగ్ రోడ్డు కనెక్టివిటీ పెరిగి రియల్ ఎస్టేట్ విలువలు మరో 20 నుండి 30 శాతం పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గ్రేటర్ అప్పులు ఎవరు తీరుస్తారు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 13, పెన్ పవర్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ముఖచిత్రం మారిపోయింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్..మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గా విభజించింది ప్రభుత్వం. అయితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం..తర్వాత వార్డుల విభజన..కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఓ వైపు సికింద్రాబాద్ పేరే లేకుండా చేశారని లష్కర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జంట నగరాల్లో ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్న సికింద్రాబాద్ ప్రాంతాన్ని మల్కాజ్‌గిరిలో సగం..హైదరాబాద్ కార్పొరేషన్‌లో సగం కలిపేసి..సికింద్రాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు లేకుండా చేశారని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాము అధికారంలోకి వచ్చాక సికింద్రాబాద్‌ను జిల్లా చేస్తామంటూ ప్రకటించింది. ఇక జనగణన నోటిఫికేషన్ రిలీజ్ అయ్యాక..గ్రేటర్‌లో వార్డుల విభజన, కార్పొరేషన్ల ఏర్పాటు చేశారని ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.పైగా కొత్త కార్పొరేషన్ల ఏర్పాటులో..కోర్ హైదరాబాద్ రీజియన్‌లో ఎంఐఎం బలం పెరిగేలా కుట్రకు తెరలేపారని కమలనాథులు మండిపడుతున్నారు. రాజకీయ అభ్యంతరాలు ఇలా ఉండగా..ప్రభుత్వం మాత్రం అడ్మినిస్ట్రేషన్ పరంగా తన పని తాను చేసుకుపోతోంది. మూడు కార్పొరేషన్లకు కలిపి ఒకే స్పెషల్ ఆఫీసర్‌ను వేసింది సర్కార్. పైగా కొత్తగా సర్కార్ తీసుకొచ్చిన కొన్ని మార్పులు కార్పొరేషన్ల అధికారాలనే కాదు..ఆర్థిన వనరులను కూడా తగ్గించి పూర్తిగా ప్రభుత్వంపైనే డిపెండ్ అయ్యే పరిస్థితిని తీసుకొస్తుందన్న డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి. పరిధిలో ఉన్న శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఉప్పల్ జోన్ల నుంచి గతంలో బల్దియాకు భారీ ఆస్తి పన్ను, టౌన్ ప్లానింగ్ నిర్మాణ ఫీజులతో ఆదాయం వచ్చేది. ఇప్పుడా మూడు జోన్లను వేర్వేరు కార్పొరేషన్లలో కలిపేశారు. ఇక ప్రస్తుతం ఉన్న పరిధిలో సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్ జోన్ల పరిధిలో నిర్మాణానికి అవకాశం ఉండే భూములు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో విభజిత ప్రాంతం నుంచి వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉంటుందనేది అంచనాలు వ్యక్తం అవుతున్నాయి. ఇన్ కమ్ తగ్గి..మెయింటెనెన్స్ ఖర్చులు మాత్రం భారంగా మారే అవకాశం ఉందంటున్నారు పలువురు అధికారులుఇక మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి..నిర్మాణ అనుమతుల విషయంలో భారీ మార్పులు తీసుకొచ్చింది ప్రభుత్వం. 10 ఫ్లోర్ల వరకు మాత్రమే అనుమతులు అధికారం కార్పొరేషన్ అధికారులకు ఇచ్చింది. 10 ఫ్లోర్ల కంటే ఎక్కువ



ఉండే అన్ని నిర్మాణాలకు ద్వారా పర్మిషన్లు ఇవ్వాలని డిసైడ్ చేసింది ప్రభుత్వం. గ్రేటర్ చుట్టూ జరగబోయే పెద్ద పెద్ద నిర్మాణాలకు సంబంధించిన ఫీజులు..నిర్మాణ అనుమతుల ఫీజులు మొత్తంఖజానాకు చేరే అవకాశం ఉందంటున్నారు.ఇప్పటికే రిజిస్ట్రేషన్ల సందర్భం కార్పొరేషన్లకు రావాల్సిన నొటేషన్ ఫీజు మొత్తం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో జమ అవుతుంది. ఇలా మూడు కార్పొరేషన్లకు వచ్చే నిర్మాణ అనుమతుల ఫీజు భారీగా తగ్గిపోయే పరిస్థితులు కనబడుతున్నాయి. దాంతో ఆర్థిక వనరులు తగ్గనున్నాయి. నిర్మాణ అనుమతుల విషయంలో సూపర్ పవర్‌గా మారే అవకాశం కనిపిస్తుంది. ఇక హైడ్రాకు ఇప్పటికే ఫైర్ సేఫ్టీ, మాన్ సూన్ ఎమర్జెన్సీ టీముల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది సర్కార్.ఇలా కార్పొరేషన్ అధికారులు చేయాల్సిన పనులన్నీ హైడ్రాకు, వెళ్లిపోయాయన్న చర్చ ఉంది. ఇక మూడు కార్పొరేషన్లకు కలిపి జయష్ రంజన్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించడంతో..కార్పొరేషన్లు ఏం పని చేయాలన్నా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్ కానుంది. ఇలా ఒకవైపు స్పెషల్ ఆఫీసర్..ఇంకోవైపు.మరోవైపు హైడ్రా..మధ్యలో కార్పొరేషన్లు అన్నట్లు మారిపోనుంది పరిస్థితి2016 నుంచి 7వేల కోట్లకు పైగా అప్పులు చేసింది . ప్రస్తుతం 4860 కోట్ల రూపాయల అప్పులు ఉన్నాయి. వీటిని మూడు కార్పొరేషన్లకు ఎలా పంచుతారన్నది క్లారిటీ రాలేదు. ఒకవైపు ఆదాయం తగ్గిపోవడం, మరొక వైపు కార్పొరేషన్ పవర్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ, హైడ్రా పట్టు సాధిస్తుండడంతో..మూడు కార్పొరేషన్లు ఎలా ముందుకు వెళ్తాయనేది హాట్ టాపిక్ అయ్యింది. కేవలం నిర్వహణ పనులు మాత్రమే ఈ కార్పొరేషన్లు చేపట్టే అవకాశం ఉంది.ఇక కార్పొరేషన్ల ముందున్న అతి పెద్ద సమస్య ఉద్యోగుల కొరత. కోర్ నే సిబ్బంది, అధికారుల కొరత తీవ్రంగా ఉండేది. ఉన్నవారిలోనే మూడు కార్పొరేషన్లకు చాలామందిని బదిలీ చేశారు. దాంతో లో ఉన్న సిబ్బంది తగ్గిపోగా..మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లలో కూడా సరైన సిబ్బంది లేరు. ఇలా ముందు చూపులేకుండా..వ్యవస్థలను సెట్‌రైట్ చేయకుండా..ఆగ మేఘాలపై మూడు కార్పొరేషన్లు చేయడంతో వివాదాలు, సమస్యలు తలెత్తాయన్న టాక్ వినిపిస్తోంది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం అయినప్పటి నుంచి శివారు ప్రాంతాలతో పాటు లో కూడా పాలన పడకేసిన పరిస్థితి. వార్డులు, జోన్లు, సర్కిల్స్ అవిభజన అధికారుల కేటాయింపునకే టైమ్ సరిపోయింది. ఇప్పటికీ బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో క్లారిటీ రాక దరఖాస్తులు పెండింగ్ ఉండిపోతున్నాయి. నిర్మాణ అనుమతుల విషయంలోనూ..నొటేషన్ల విషయంలోనూ సాగదీత కంటిన్యూ అవుతోంది. దీంతో గ్రేటర్‌లో విలీనం, విభజన, కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుతో లాభం కంటే నష్టమే ఎక్కువ ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఫైనల్‌గా సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.


# గగన్ యాన్ మరింత ఆలస్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** స్రో ప్రతిష్టాత్మక ప్రయోగం మరింత ఆలస్యం కాబోతోందా..? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. అవుననిపిస్తుంది. వీలైనంత త్వరగా ప్రయోగాన్ని చేపట్టి సక్సెస్ కొట్టాలనుకున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు ఏదో ఒక అవరోధం ఎదురవుతూనే ఉంది. అవి కూడా ఊహించని అవరోధాలు.. కలలో కూడా.. శత్రు దేశాలు కూడా ఊహించని వైఫల్యాలు ఇటు ఇస్రోని కూడా షాక్ గురి చేసిన ఉదాహరణలు ఇటీవల వరుసగా జరిగాయి. అవే రాకెట్ ప్రయోగం ఫలితాలు.. అదే ఇప్పుడు ఇస్రో ప్రెస్టీజియస్ ప్రాజెక్టు అయిన గగన్‌యాన్ మరింత ఆలస్యం అవుతోంది..!!భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న ప్రయోగాల్లో గగన్ యాన్ ప్రాజెక్ట్ ఒకటి. ముందుగా 2027 లో గగన్ యాన్ ద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు ఇస్రో ఏర్పాట్లు మొదలు పెట్టింది. భారత్ చేపట్టనున్న తొలి మానవ సహిత ప్రయోగం కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇస్రో ఎక్కడా రిస్క్ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే ముందు అనేక దశల్లో ప్రయోగాత్మక ప్రయోగాలను చేపడుతోంది.. ఈ టెస్ట్ లాంచ్ ల ద్వారా వ్యోమగాములు క్షేమంగా తిరిగి రావడానికి ఎలాంటి సమస్యలు రాకుండా.. అలాగే అంతరిక్షంలో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా లేకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిసేలా ఈ ప్రయోగాలు దోహదం చేస్తాయి. అసలు ప్రయోగం కంటే ముందు ఇలాంటి టెస్ట్ లాంచ్ లు 50 కి పైగా చేపట్టాల్సి ఉంటాయని ఇస్రో ముందే తెలిపింది.అయితే ఇప్పటికే పలు కీలక టెస్ట్ లాంచ్ లను ఇస్రో ఇప్పటికే పూర్తి చేసింది. కానీ ఇంకా కీలక దశలకు స్పందించిన ప్రయోగాలు ఫిబ్రవరి నుంచి పదికి పైగా ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టాల్సి ఉందని ఇస్రో వర్గాలు అంటున్నాయి. కానీ అందుకు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. ప్లానింగ్ ప్రకారం ఇస్రో చేపట్టాల్సిన ప్రయోగాలు వైఫల్యం కావడమే.. ఇస్రో జర్నీలో కీలకమైన అత్యంత నమ్మకమైన రాకెట్ గా పేరొందిన రాకెట్స్ వరుస అపజయాలు.. అవును యోగం చేపడుతుంది అంటే మనకంటే ఎక్కువగా పొరుగు దేశాలే వాటి విజయాన్ని నమ్ముతుంటాయి. అంతగా ఇస్రోకి కలిసొచ్చిన రాకెట్ విఫలం కావడం ఆర్థికంగా జరిగిన నష్టం కంటే సమయం వృథా అవడమే ఇపుడు ఇబ్బందిగా మారింది.ఇటీవల ఇస్రో చేపట్టి విఫలమైన ద్వారా అంతరిక్షంలోకి పంపిన ఇతర దేశాలకు చెందిన 15 ఉపగ్రహాలు వృధా అయ్యాయి. అంటే కమర్షియల్ గా భారత్ పై పెట్టుకున్న నమ్మకాలపై ప్రభావం పడింది. ాూాం–జ62 ప్రయోగ వైఫల్యం కావడంతో ఫిబ్రవరి నెలలో జరగాల్సిన గగన్ యాన్ మరో టెస్ట్ లాంచ్ ఆలస్యం అవుతోంది. ఇక కమర్షియల్ గా భారత్ కుదుర్చుకున్న ఒప్పందాల్లో భాగంగా సమయానికి చేపట్టాల్సిన ప్రయోగాలకు ప్రాధాన్యతనివాల్సి ఉంది. దీంతో గగన్ యాన్ ప్రాజెక్టు అనుకున్న సమయానికి జరుగుతుందా లేదా అన్నది ఇప్పుడు పెద్ద అనుమానంగా మారింది.గగన్‌యాన్ ప్రయోగం భారతదేశపు మొట్టమొదటి మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమం. ఇందులో ముగ్గురు వ్యోమగాములను కూడా భూమి దిగువ కక్ష్యకు (శ్రీశీష ఎర్త్ ఆర్బిట్) తీసుకువెళుతుంది. వ్యోమగాముల సిబ్బందితో కూడిన ఈ మిషన్ అంతరిక్షంలో దాదాపు మూడు రోజులు ఉంటుంది. గగన్‌యాన్ అని పిలువబడే సిబ్బంది లేని ఫ్లైట్ ఇది మొదట అన్ని వ్యవస్థలను పరీక్షిస్తుంది.

ఇందులో ప్రయోగాత్మకంగా ప్రయాణీకుడిగా వ్యోమమిత్ర అనే హ్యూమనాయిడ్ రోబోట్ కూడా ఇందులో అమర్చి పెట్టనున్నారు. సమయానికి గగన్‌యాన్ పూర్తి కావాలంటే ముందుగా చేపట్టాల్సిన టెస్ట్ లాంచ్ లు పూర్తి కావాల్సి ఉంది. ఇవన్నీ దాటుకుని ఇస్రో అనుకున్న సమయానికి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గగన్‌యాన్ పూర్తి చేస్తుందా అన్నది చూడాల్సి ఉంది..!

# ఉదయం సీబీఎస్... రాత్రి లోకేష్.. ఎమ్మెల్యేలతో వరుస భేటీలు

**విజయవాడ, ఫిబ్రవరి 13, పెన్ పవర్:**
పవర్‌లోకి వచ్చి ఆల్రెడీ ఇరవై నెలలు అవుతుంది. ఇప్పటిదాకా అభివృద్ధి, సంక్షేమంపైనే ఫుల్ ఫోకస్ నడిచింది. త్వరలోనే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎలక్షన్స్ రాబోతున్నాయ్. ఇప్పుడు పార్టీపై కాన్సన్‌ట్రేషన్ షిఫ్ట్ చేశారు సీఎం చంద్రబాబు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలే అపాయింట్‌మెంట్ కోరి తమను కలవాలనుకునే బదులు.. చంద్రబాబే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలతో భేటీ అవుతున్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై ఎలాంటి ఒపీనియన్ ఉంది.? స్థానికంగా ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేశారా.? మీకేం కావాలి.? పార్టీ పరంగా ఏం చేయాలి.? ప్రభుత్వ పరంగా చేసి పెట్టాల్సిన పనులు ఏంటి.? మీ వ్యక్తిగత సమస్యలు ఏమైనా ఉన్నాయా.? అంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు..తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం ఇవ్వలేదనే విమర్శలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే పనిలో పడ్డారట. అసలే అసెంబ్లీ బడ్జెట్ సెషన్ నడుస్తుంది.ఎమ్మెల్యేలంతా 9 గంటల వరకు సభలో ఉండాలని ఇప్పటికే బాబు ఆదేశించారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా బడ్జెట్ సమావేశాలు అయిపోయే వరకు విజయవాడలోనే ఉండే అవకాశం ఉంది. దీంతో ఇదే సమయంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వరుసగా భేటీ అవుతూ..ఎక్కడికక్కడ సమస్యలకు చెక్ పెట్టి.. అంతా సెట్ చేసే ప్లాన్ చేస్తున్నారట.అటు మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో డిన్నర్ మీట్ అవుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకూ ఈ భేటీలు జరగనున్నాయి. రోజూ ఒక్కో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వారి కుటుంబసభ్యులతో నారా లోకేశ్ డిన్నర్ భేటీలు కంటిన్యూ కాబోతున్నాయి. నారా లోకేష్‌తో జరిగే ఈ డిన్నర్ మీట్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటుగా వారి కుటుంబసభ్యులు కూడా హాజరవుతున్నారుఈ విందు సమావేశాల్లో నియోజకవర్గాల్లోని సమస్యలపై చర్చించడంతో పాటు..ఎమ్మెల్యేలతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుందని నారా లోకేశ్ భావిస్తున్నారు. ఇలా అటు సీఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులకు డైరెక్షన్స్ ఇస్తూ..ఫ్యూచర్ పాలిటిక్స్‌పై దిశానిర్దేశం చేస్తున్నారట. లోకేశ్ అయితే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బాండింగ్ పెంచుకునేలా..కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా చేస్తుంటే..ఎక్కడా అసంతృప్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారట.ప్రభుత్వ హయాంలో సీఎం అపాయింట్మెంట్ దొరకడం లేదంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా గగ్గోలు పెట్టినట్లు కథనాలొచ్చాయి. పైగా తమ హయాంలో సీఎంవో నడపాల్సినంత గొప్పగా నడపలేకపోయామని వైసీపీ నేతలే చెప్తుంటారు. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందనే ఆవేదనతో కొంతమంది ఎమ్మెల్యేలు కక్కలేక, మింగలేక మిన్నకుండిపోయి ఎన్నికల తర్వాత బరస్ట్ అయిపోయారు.మరికొందరు అయితే ముందు నుంచే ఆఫ్ ది రికార్డ్‌లో తమ ఆగ్రహాన్ని, ఫ్రస్టేషన్‌ను వెళ్లగక్కిన సందర్భాలున్నాయి. అయితే తమ పార్టీలో, ప్రభుత్వంలో పరిస్థితికి తావు లేకుండా అటు సీఎం



చంద్రబాబు, ఇటు మంత్రి లోకేశ్ సరికొత్త ఆలోచన చేశారని తెలుస్తోంది. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అయినా పూర్తిగా కొన్ని గంటలు వ్యక్తిగతంగా, మరికొంత సమయం వారి కుటుంబ సభ్యులతోనూ కలిసినట్లు ఉండటంతో పాటు.. వారి నియోజకవర్గాల్లో సమస్యలు, పార్టీ పరిస్థితి, ప్రజల అభిప్రాయాలను లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట.ఈ అసెంబ్లీ సెషన్ పూర్తయ్యేలోపు డిన్నర్ విత్ లోకేశ్ కార్యక్రమం వైరల్‌గా మారే ఛాన్స్ ఉంది. అలా అని లోకేశ్ ప్రత్యేకత ఈ ఒక్క కార్యక్రమానికే పరిమితం కాదని..మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి “ఎక్స్” వేదికగా తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపైనా వెంటనే స్పందిస్తున్నారని గుర్తు చేస్తున్నారు.ఎక్స్‌లో తన దృష్టికి వచ్చిన సమస్యను..తన ఆఫీస్ టీమ్‌కు అసైన్ చేస్తున్నారు.. వారు ఫాలో అప్ చేసి, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని, సమస్యను సాల్వ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు డిన్నర్ మీట్‌తో నేరుగా సమావేశం అయి..గ్రూప్‌వార్..కమ్యూనికేషన్ గ్యాప్‌కు చెక్ పెట్టి..అక్కడక్కడ ఏమైనా అసంతృప్తులు, అలకలు ఉన్నా అంతా సెట్‌రైట్ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు.

**టార్గెట్ 2029**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూటమి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నారా లోకేశ్ ప్రజా దర్బార్ ను ఉండవల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి అనేక మంది ఈ ప్రజాదర్బార్ కు హాజరవుతూ వినతులను అందచేస్తున్నారు. వంద శాతం ఈ సమస్యలను పరిష్కరించకపోయినప్పటికీ దాదాపు ఎనభై శాతం సమస్యలు పరిష్కారమవుతున్నాయి. లోకేశ్ ప్రజాదర్బార్ కు వెళితే తమ సమస్యలను పరిష్కారం అవుతాయని భావించి అన్ని నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు.ఇక తాజాగా నారా లోకేశ్ మరొక కొత్త సంప్రదాయానికి మంత్రి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులతో సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. ఒక్కోరోజు ఒక్కో పార్లమెంటు నియోజకర్గ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలకు కుటుంబ సమేతంగా నారా లోకేశ్ డిన్నర్ సమావేశాన్ని నిర్వహించనున్నారు.ఎమ్మెల్యేలతో పాటు వారి కుటుంబ సభ్యులను కలుసుకుని వారి సమస్యలను గురించి నారా లోకేశ్ తెలుసుకోనున్నారు. పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఆయన చర్చించనున్నారు. ఈరోజు చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. వారి సమస్యలను వినడంతో పాటు వారితో ఫొటోలు దిగి వారితో కాసేపు గడపనున్నారు.ఇక కార్యకర్తల సమావేశాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉన్న టీడీపీ కార్యకర్తలను ప్రోత్సహిస్తూ వారికి గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించారు. దీనివల్ల టీడీపీ సోషల్ మీడియా మరింత యాక్టివ్ అవుతుందనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారంలో లేనప్పుడు యాక్టివ్ గా సోషల్ మీడియాలో ఉండే కార్యకర్తలు అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు దక్కలేదని, మరికొన్ని కారణాలతో వారు యాక్టివ్ గా లేకపోవడాన్ని గుర్తించిన నారా లోకేశ్ వారిని మరింత యాక్టివేట్ చేసేందుకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తం మీద బలగాన్ని మూడేళ్ల ముందు నుంచే ఎన్నికలకు నారా లోకేశ్ సిద్ధం చేస్తున్నారు. మరి యాక్టివ్ గా ఉండే కార్యకర్తలకు ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తారన్నది చూడాలి.

# దువ్వాడకు లైన్ క్లియర్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 13 పెన్ పవర్:**
ఏపీ అసెంబ్లీ ఆవరణలో మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కలవడం చర్చనీయాంశం అవుతోంది. గతేడాది ఏప్రిల్‌లో దువ్వాడను వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత వైసీపీ పార్టీకి, మాజీ సీఎం జగన్‌కు దూరంగా ఉన్నారు దువ్వాడ. అసెంబ్లీ సమావేశాల స్టార్టింగ్ రోజు సభకు అటెండ్ అయి వాకౌట్ చేసి వస్తున్న జగన్‌ను సడెన్‌గా వెళ్లి కలిశారు దువ్వాడ శ్రీనివాస్. జగన్ కాళ్లకు దండం పెట్టారాయాన.ఏం చేద్దామనుకుంటున్నావ్ శ్రీనివాస్ అంటూ జగన్ పకలరించగా..ధర్మాన సోదరులు మీకు రాంగ్ ఫీడ్ బ్యాక్ ఇచ్చారని..ధర్మానతో ఉన్న అంశాలపై మాట్లాడాలని దువ్వాడ జగన్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. దువ్వాడ శ్రీనివాస్‌కు జగన్ క్లాస్ పీకారని..కొంచెం పద్దతి మార్చుకో అని చెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే జగనే పిలిచి..ఓ సారి వచ్చి కలవమంటే కలిశానని చెప్పుకుంటున్నారట దువ్వాడ. తాడేపల్లికి వచ్చి తనను కలవాలని దువ్వాడకు జగన్ చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.తన వాణి వినిపిస్తానని..త్వరలోనే జగన్‌ను కలుస్తానంటున్నారు దువ్వాడ. పైగా తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుడి వైపు మాట్లాడతానని..మెడికల్ కాలేజీలని పీపీపీ విధానంలో చేపట్టాల్సిన అవసరం లేదని కూడా దువ్వాడ తన పాయింట్ వ్యూను వ్యక్తం చేస్తున్నారట. ధర్మాన, కింజరాపు సోదరులు సీట్ రాకుండా చేస్తే..వైసీపీ నుంచి జగన్ అవకాశం ఇవ్వకపోతే సొంతగా పోటీ చేసి తన బలం ఏంటో చూపించాలనే ఆలోచనలో దువ్వాడ ఉన్నట్లుగా ఇన్‌సైడ్ టాక్.వైసీపీ నుంచి సస్పెండ్ చేసినా, అధినేత జగన్ అంటే తనకు ఎంతో అభిమానమని ఎమ్మెల్సీ దువ్వాడ ఎప్పుడూ చెబుతుంటారు. అయితే పార్టీ నుంచి బయటకు పంపిన తర్వాత జగన్‌ను కలిసేందుకు ఆయనకు ఇంతవరకు అవకాశం దక్కలేదని చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దువ్వాడ ఆ జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్‌పై చేస్తున్న విమర్శలు వైసీపీని తీవ్ర ఇబ్బందికరంగా మారాయటపార్టీ సీనియర్లపై బహిరంగంగా విమర్శలు చేస్తున్న



దువ్వాడ వ్యవహారం వైసీపీలో తీవ్ర చర్చే నడుస్తోందట. వైసీపీ నేతలైన ధర్మాన సోదరులను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ మళ్లీ పార్టీలోకి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం ఉంది. ఈ క్రమంలో పార్టీ అధినేత జగన్ ఆశీస్సుల కోసం ఎప్పటికప్పుడు ఆయనపై భక్తి ఉన్నట్లు చెప్పుకుంటున్నారట. అయితే దువ్వాడ విషయంలో జగన్ సాఫ్ట్ కార్నర్‌తో ఉన్నట్లుగా ఓ చర్చ నడుస్తోంది.దువ్వాడ ఫ్యామిలీ ఇష్యూ ఆయన వ్యక్తిగతమని..శ్రీకాకుళం జిల్లా నేతలతో ఉన్న పేచీని సెట్ చేసుకుంటే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయొచ్చన్న అంచనాలున్నాయి. అయితే ధర్మానతో ఉన్న విభేదాలను జగన్ దృష్టికి తీసుకెళ్లి..తన నిర్ణయమేంటో ప్రకటించాలన్న ఆలోచనలో దువ్వాడ ఉన్నారట. అయితే 2029 ఎన్నికల్లో టెక్కలి నుంచి తాను పోటీ చేస్తానని, ఒకవేళ వైసీపీ టికెట్ ఇవ్వకున్నా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుస్తానని ఆయన చెప్పినట్లు వార్తలు రావడం వైసీపీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అయితే ధర్మాన బ్రదర్స్‌ను టార్గెట్ చేస్తూ..తన కళింగ సామాజికవర్గంలో పట్టు పెంచుకునేందుకు దువ్వాడ పెద్ద స్కెచ్చే వేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయన సిక్కోలు పాలిటిక్స్‌లో ఒంటరి అయిపోయారని అంటున్నారు. ఓవైపు ఫ్యామిలీలో చిచ్చు..ప్రేయసితో కలిసి వేరు కాపురం ఇవన్నీ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను పంపించా యని..వాటిని ఓవర్ కమ్ చేసేందుకే దువ్వాడ కళింగలకు అన్యాయమంటూ గళమెత్తడం స్టార్ట్ చేశారని అంటున్నారు.ఓవరాల్‌గా దువ్వాడ ఎపిసోడ్ శ్రీకాకుళంలో జిల్లాలో వైసీపీకి ఇబ్బందికరంగా మారిన పరిస్థితి. సేమ్‌టైమ్ టెక్కలి వైసీపీ ఇంచార్జ్ పేరాడ తిలక్ కూడా కళింగ సామాజికవర్గం నేత అయినా..ఆయనతో దువ్వాడకు గిట్టట్లేదట. ధర్మాన బ్రదర్స్ చెప్పుచేతల్లో పేరాడ తిలక్ పనిచేస్తూ..తన వ్యతిరేకతంగా పావులు కదుపుతున్నారని..గతంలో తనకు పార్టీ టికెట్ ఇస్తే ఆయన సహకరించలేదని అసంతృప్తితో ఉన్నారట దువ్వాడ. టెక్కలిలో ధర్మాన బ్రదర్స్ ఇన్వాల్‌మెంట్ లేకుండా..రాబోయే ఎన్నికల్లో తనకు టికెట్ ఇస్తానని హామీ ఇస్తే తిరిగి వైసీపీలో యాక్టీవ్ కావాలన్నది దువ్వాడ ఆలోచనగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దువ్వాడ విజ్ఞప్తిపై జగన్ నిర్ణయం ఎలా ఉండబోతుందనేది వేచి చూడాలి.

## విజయనగరానికి పూర్వ వైభవం

**విజయనగరం.ఫిబ్రవరి 13, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర ముఖచిత్రం వేగంగా మారుతోంది. విశాఖపట్నం ఐటీ , పారిశ్రామిక కేంద్రంగా విస్తరిస్తుండగా, దానికి ఆనుకుని ఉన్న విజయనగరం జిల్లా ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో రెండో హాట్‌స్పాట్ గా అవతరించింది. ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు 90 శాతానికి పైగా పూర్తి కావడమే కాకుండా, 2026 జూన్ నాటికి కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభం కానుండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి.వలం పెట్టుబడిదారులే కాకుండా, విశాఖలో ఇళ్లు కొనలేని మధ్యతరగతి ప్రజలు కూడా విజయనగరం వైపు మొగ్గు చూపుతున్నారు. విజయనగరం విశాఖపట్నం మధ్య ఉన్న అనుసంధానత ఈ బూమ్‌కు ప్రధాన కారణం. విశాఖలోని మధురవాడ ఐటీ సెజ్ నుంచి విజయనగరం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం, విశాఖ–రాయ్‌పూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతం కావడంతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గింది.గంకలాం, నెల్లిమర్ల, చొట్టవలస వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్లు వెలుస్తున్నాయి. విశాఖ నగర శివార్లలో గజం ధర రూ. 30,000 దాటగా, విజయనగరం పరిసరాల్లో ఇప్పటికీ రూ. 10,000 నుండి రూ. 15,000 మధ్య లభిస్తుండటం కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది. మౌలిక సదుపాయాల పరంగా కూడా జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అనుబంధంగా ఏవియేషన్ సిటీ, లాజిస్టిక్స్ హబ్‌లు ఏర్పాటు కానుండటం వల్ల రాబోయే రోజుల్లో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.బీచ్ కారిడార్ రోడ్డు నిర్మాణం పూర్తయితే విజయనగరం నుండి విశాఖకు తీరం వెంబడి ప్రయాణం మరింత సులభతరం కానుంది. భవిష్యత్తులో ఈ రెండు నగరాలు జంట నగరాలుగా మారే అవకాశం ఉందన్న అంచనాలు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మరింత ఊతాన్నిస్తున్నాయి.

## మారకపోతే... వేటే

**విజయవాడ, ఫిబ్రవరి 13, పెన్ పవర్:** టీడీపీ ఎమ్మెల్యేకు పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఏపీ అసెంబ్లీ లాబీల్లో ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారు.. ఇకపై పద్ధతి మార్చుకోవాలని పల్లా ఎమ్మెల్యేకు చెప్పారు. కొంతకాలంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఎన్నికల్లో టికెట్ కోసం డబ్బులు వసూలు చేశారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాగే వాట్సాప్ స్టేటస్‌లతో సొంత పార్టీ నేతల్ని టార్గెట్ చేశారు. ఈ క్రమంలో టీడీపీ అధిష్టానం ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహంగా ఉంది.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. అమరావతి ఉద్యమ నేతగా గుర్తింపు పొంది, చంద్రబాబు నాయుడు నమ్మకంతో టికెట్ ఇచ్చి గెలిపించిన కొలికపూడి.. ప్రస్తుతం అదే పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటిస్తున్నారా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. కొలికపూడి శ్రీనివాసరావు గత కొంతకాలంగా తన అసంతృప్తిని నేరుగా కాకుండా వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా వ్యక్తం చేస్తున్నారు. ఆయన పెట్టిన ఓ స్టేటస్ కూటమి ప్రభుత్వంలో కలకలం రేపింది. 3 వారాల పాటు 35 గ్రామాల్లో 480 కుటుంబాలతో ఆత్మీయ సంభాషణ జరిపాను.. రోడ్లు లేని పల్లెలు, ఉద్యోగాలు రాని పిల్లలు.. పల్లె కన్నీరు పెడుతోంది అనే అర్థం వచ్చేలా ఆయన పోస్ట్ చేయడం, పరోక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే అయి ఉండి, విపక్ష వైసీపీ విమర్శించే తీరులోనే ఆయన పోస్ట్‌లు ఉండటం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది.కేవలం ప్రభుత్వంపైనే కాకుండా, పార్టీలోని కీలక నేతలను కూడా ఆయన టార్గెట్ చేస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తన వద్ద టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత మొత్తం చెల్లించానని సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తన ప్రమేయం లేదని, పేకాట క్లబ్‌లు నడిపేవారికి పదవులు ఇస్తున్నారంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు టీడీపీ హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి.కొలికపూడి వైఖరి చూస్తుంటే ఆయన వైసీపీ వైపు అడుగులు వేస్తున్నారా అనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంపీ కేశినేని చిన్ని కూడా కొలికపూడిని వైసీపీ కోవర్టు గా అభివర్ణించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఆయన భేటీ అవ్వడం, వైసీపీ సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు రావడంతో.. ఆయన త్వరలోనే కండువా మార్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు ఇచ్చి వివరణ కోరింది. చంద్రబాబు నాయుడు కూడా గతంలో ఆయనను హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, కొలికపూడి మాత్రం తన తీరు మార్చుకోకపోగా, మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, అది తనకు రాజకీయంగా మైలేజ్ ఇస్తుందని, సానుభూతి పొందే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన తన నియోజకవర్గంలో సొంతంగా కార్యక్రమాలు చేసుకుంటూ, పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టేశారు. అలాగే టీడీపీ నుంచి కూడా ఆయనకు పిలుపులు రావడం లేదు. అమరావతి ఉద్యమంతో కొలికపూడి శ్రీనివాసరావు మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో టీడీపీ తిరువూరు టికెట్ ఇచ్చింది.. ఆయన విజయం సాధించారు. ఆ తర్వాత నుంచి ఆయన వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. సొంత పార్టీ నేతల్ని టార్గెట్ చేయడంతో అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో ఒకసారి అధిష్టానం పిలిచి మాట్లాడింది.. అయినా సరే ఆయన మాత్రం వెనక్కు తగ్గలేదు. ఆయన తీరు మార్చుకోకుండా సొంత పార్టీ నేతలపై వాట్సాప్ స్టేటస్‌లు పెట్టారు. అలాగే గతేడాది కొలికపూడి మాజీ మంత్రి పెద్దిరెడ్డిని ఎయిర్‌పోర్టులో కలవడంపై కూడా దుమారం రేగింది. అయితే ఈ ఎపిసోడ్‌పై అధిష్టానం ఆరా తీసింది. అయితే ఎయిర్‌పోర్ట్‌లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదురయ్యారని.. మర్యాదపూర్వకంగా పలకరించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. దీని వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని క్లారిటీ ఇచ్చారు. ఇలా ఎమ్మెల్యే శ్రీనివాసరావు వరుస వివాదాలతో అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది.. అందుకే పల్లా శ్రీనివాస్ కొలికపూడిని హెచ్చరించినట్లు తెలుస్తోంది. మరి ఇకపైనా ఆయన పద్ధతి మార్చుకుంటారో లేదో చూడాలి.

## బస్టాండ్ తరలింపుతో అవస్థలు

**ఒంగోలు, ఫిబ్రవరి 13, పెన్ పవర్:** ఒంగోలు బస్టాండ్ తరలింపు ప్రతిపాద తెరపైకి వచ్చింది. నగరంలో ట్రాఫిక్ సమ్యలు పెరగడంతో బస్టాండ్‌ను శివారు ప్రాంతానికి తరలించాలని ప్రతిపాదించారు. ఒంగోలు కార్పొరేషన్ సమావేశంలో ఎమ్మెల్యే ఈ అంశాన్ని ప్రస్తావించారు. నగర శివారు ప్రాంతంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేస్తే బావుంటుంది అన్నారు. అయితే ఒంగోలు శివారు ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ప్రజలు ఇబ్బందిపడతారని కొందరి వాదన. అయితే ప్రజల అభిప్రాయం తీసుకున్న తర్వాతే నిర్ణయం ఉంటుందంటున్నారు.ప్రకాశం జిల్లా ఒంగోలులో ట్రాఫిక్ రద్దీ పెరిగింది.. దీంతో రోడ్లను విస్తరించాలని నిర్ణయించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ కసరత్తు మొదలైంది. ట్రంక్ రోడ్డు విస్తరణ కోసం అధికారులు భవనాల యజమానులకు నోటీసులు కూడా జారీ చేశారు.. మరికొన్ని రోడ్లను కూడా త్వరలోనే విస్తరించేలా ప్లాన్ చేస్తున్నారు. అయితే ఒంగోలులో బస్టాండ్ సెంటర్‌తో పాటుగా మరికొన్ని చోట్ల ట్రాఫిక్ పెరిగింది. ఆర్టీసీ బస్టాండ్ నగరం నడిబొడ్డున ఉండటం, బస్సుల రాక పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌ను తరలించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. బస్టాండ్‌ను నగర శివారు ప్రాంతానికి తరలించాలని ప్రతిపాదించగా.. కొందరు మాత్రం ప్రస్తుతం అందరికి అందుబాటులో ఉన్న చోట నుంచి ఊరి చివరకు తరలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. నగర శివారు ప్రాంతం కాకుండా ప్రత్యామ్నాయాలను చూడాలని కోరుతున్నారు.ఒంగోలు నగరం మధ్యలో అప్పటి అవసరాలకు తగ్గట్లుగా 11 ఎకరాల్లో బస్టాండ్‌తో పాటుగా గ్యారేజీ కూడా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం బస్సుల రాకపోకలు పెరిగాయి.. రాజధాని ప్రాంతం నుంచి డైలీ సర్వీసుల సంఖ్య పెరిగింది. వీటికి తోడు ఏపీ, తెలంగాణ నుంచి తిరుపతి, బెంగళూరు, చెన్నై వైపు వెళ్లే బస్సుల కూడా వస్తున్నాయి. గతంతో పోలిస్తే ఒంగోలులో రద్దీ పెరిగింది.. బస్టాండ్‌లో మొత్తం 28 ఫ్లాట్‌ఫాంలు ఉంటే.. ప్రతి రోజూ 1500 వరకు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయని అంచనాలు ఉన్నాయి. కర్నూలు రోడ్డు, అద్దంకి బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదరవుతున్నాయి. అందుకే ఇటీవల ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆర్టీసీ బస్టాండ్‌ను తరలించాలని అధికారులకు లేఖ రాశారు.ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌ను నగర శివారులో ఉన్న మార్కెట్ యార్డు దగ్గర పది ఎకరాలు స్థలంలోకి తరలించాలని ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. రెండు రోజుల క్రితం జరిగిన ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే జనార్ధన్ రావు ప్రస్తావించారు. బస్టాండ్‌ను అక్కడికి తరలించి.. పీపీపీ విధానంలో అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని కూడా ప్రతిపాదించారు. అలా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందంటున్నారు. అయితే ప్రస్తుతం బస్టాండ్ ఒంగోలుకు మధ్యలో ఉంది.. ఒకవేళ నగర శివారు ప్రాంతానికి తరలిస్తే ప్రయాణికులు, ఒంగోలు పనులపై వచ్చేవారు ఇబ్బందిపడతారంటున్నారు. ప్రయాణికులు నగరంలో నుంచి ఊరి చివరికి వెళ్లడానికి ఇబ్బంది ఎదురవుతుందంటున్నారు. అయితే నగరంలో మినీ బస్టాండ్ నిర్మిస్తే సరిపోతుందని.. అప్పుడు నగరంలోని ప్రధాన బస్టాండ్‌పై ఒత్తిడి తగ్గుతుందంటున్నారు. అయితే ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజల అభిప్రాయం తీసుకున్న తర్వాతే అంటున్నారు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# బీఎన్ఎస్ విజయం వెనక యువ నాయకురాలు



బంగ్లాదేశ్ ఇపుడు అంతర్జాతీయంగా గట్టిగా వినిపిస్తున్న పేరు. బంగ్లాదేశ్ లో గత రెండేళుళ్గా శాంతి భద్రతలు పెద్దగా లేవు, నిత్యం అల్లర్లు, ఘర్షణ వాతావరణంతో దేశం ఎపుడు అంతర్జాతీయ మీడియాలో కనిపిస్తూనే ఉంది. ప్రత్యేకించి హిందువుల మీద దాడులు హత్యలు కూడా హాట్ టాపిక్ గా మారాయి. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన బంగ్లాదేశ్ ఎన్నికల్లో దేశ ప్రజలంతా ఏకమొత్తంగా తీర్మానించుకుని మరీ 299 స్థానాలకు గానూ 212 స్థానాలను బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి కట్టబెట్టారు. దాంతో బీఎన్ఎస్ అద్భుతమైన విజయం సాధించింది. అతి తక్కువ సమయంలో ఇంతటి అద్భుతమైన విజయం బీఎన్ఎస్ ని దక్కడం వెనక ఒక యువ నాయకురాలి ప్రభావం అత్యధికంగా ఉందని అంటున్నారు.

**మామ్మకు తగిన మనవరాలు :**

ఆమె ఎవరో కాదు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని అయిన ఖలీదా జియా మనవరాలు. అదే విధంగా బీఎన్ఎస్ అధినేత కాబోయే ప్రధాని అయిన తారిక్ రెహ్మాన్ కుమార్తె. ఇరవై ఎనిమిదేళ్ళ ఈ యువ నాయకురాలి పేరు జైమా జర్నాజ్. ఆమె తారిఖ్ రెహ్మాన్ దంపతులకు ఏకైక కుమార్తె. లండన్ లోని క్వీన్ మేరీ విశ్వవిద్యాలయం నుంచి న్యాయ పట్టా అందుకున్న జైమా జర్నాజ్ తండ్రితో పాటు బంగ్లాదేశ్ కి ఈ మధ్యనే వచ్చారు. 2009లో బీఎన్ఎస్ ఓటమి తరువాత లండన్ లోనే ఖలీదా జియా కుటుంబం అంతా ఉంటూ వచ్చింది. ఇక షేక్ హసీనా ప్రభుత్వం కుప్ప కూలి బంగ్లాదేశ్ లో అల్లర్లు అన్నీ మొదలై అల్లకల్లోలం అయిన ఏడాది తరువాత తారిఖ్ రహ్మాన్ ఫ్యామిలీ మొత్తం బంగ్లాదేశ్ లోకి అడుగుపెట్టింది.

**అతి తక్కువ టైంలోనే :**

ఈ మధ్యలోనే ఖలీదా జియా మరణించారు కూడా. అదే సమయంలో తాత్కాలిక ప్రభుత్వం ఎన్నికలను ప్రకటించింది. చాలా తక్కువ టైం ఎన్నికలకు ఉంది. నిజానికి బీఎన్ఎస్ గెలుస్తుంది అని అనుకున్నారు కానీ తక్కువ సమయం అవడం వల్ల పూర్తిగా జనాల మద్దతు దక్కుతుందా అన్న సందేహాలు చాలా మందిలో ఉన్నాయి. అయితే బంగ్లాదేశ్ రాజకీయాలను ఘర్షణలను చూసిన జనాలు తాత్కాలిక ప్రభుత్వం తీరు మీద తీవ్రంగా మండిపడ్డారు. కరెక్ట్ టైం లో తారిఖ్ రహ్మాన్ ఫ్యామిలీ బంగ్లాకు రావడంతో జనాలు వారి మీద ఆశలు పెద్ద ఎత్తున పెంచుకున్నారు. దాంతో తక్కువ టైం అన్నది చూడలేదు, బీఎన్ఎస్ ని గెలిపించాలి అని నిర్ణయానికి వచ్చారు.

**ఆమె దూకుడుతో :**

అచ్చం నానమ్మ ఖలీదా జియా మాదిరిగానే మనవరాలు జైమా జర్నాజ్ పరిణతి సాధించారు అన్నట్లుగా ఆమె రాజకీయాల్లో దూకుడు చూపించారు. తండ్రి తారిఖ్ రహ్మాన్ కి తోడుగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించిన తీరు కానీ ప్రజలతో మమేకం అయిన విధానం కానీ ప్రజలను ఎంతగానో ఆకాట్టుకుంది. అంతే కాదు వీధులలో కలియ తిరిగారు, జన సమాన్యాన్ని కలిశారు అంతే కాదు రిక్షాలు తొక్కారు, కరపత్రాలు తానే స్వయంగా పంపిణీ చేశారు. అలా ఆమె చేపట్టిన ప్రచారం ఒక సునామీ మాదిరిగా మారింది. ఈ క్రమంలో గట్టిగా పోటీ ఇస్తుంది అనుకున్న జమాత్ ఏ ఇస్లామీ పార్టీ పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది.

**ట్రెండింగ్ లో :**

ఇక జైమా జర్నాజ్ తన ప్రచారంతో పాటు నాన్నమ ఖలీదా జియాతో తమ అనుబంధం ప్రజలకు ఆమె చేసిన సేవలు ఇవన్నీ ప్రజల ముందు పెట్టారు. దాంతో ఆమె ఉపన్యాసాలు భావోద్వేగాలు ఆమె దూకుడుతో కూడిన వైఖరి ఇవన్నీ సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్టర్ గా నిలిచాయి. బంగ్లాకి ఒక యువ నాయకురాలు దొరికారు అని అంతా అంటున్న మాటగా ఉంది. తండ్రికి ఎంతో చేదోడు వాదోడుగా ఉన్న జైమా జర్నాజ్ రేపటి బంగ్లా దేశ్ కి సరికొత్త ఆశా కిరణంగా చెబుతున్నారు. మొత్తానికి ఆమె చేసిన అద్భుతం బంగ్లాకు నూతన దారి చూపించింది అని అంటున్నారు.

# మండలిలో అంబటి మంటలు.. లోకేశ్ సీరియస్ వార్నింగ్

మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు ఇంటిపై దాడి శాసనమండలిలో విస్తృత చర్చకు దారితీసింది. శాంతిభద్రతల అంశంపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి అంబటి ఇంటిపై దాడి ప్రస్తావనకు వచ్చింది. మండలి ప్రతిపక్ష నేత బొత్స స్పందిస్తూ అంబటి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నా దాడి చేయడమేంటి అంటూ నిలదీశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరిచ్చారంటూ సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా అంబటి విజ్ఞత ఉన్న వ్యక్తిగా వ్యాఖ్యానించారు. బొత్స ప్రసంగాన్ని అధికార పార్టీ సభ్యులు అడ్డుకున్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి, అందుకు దారి తీసిన పరిణామాలపై శాసన మండలిలో హాట్ డిబేట్ జరిగింది. వైసీపీ పక్ష నేత బొత్స మాట్లాడుతూ ఇలాంటి సంస్కృతిని ప్రోత్సహించకూడదని, కానీ దాడి చేసినందుకు అధికార పార్టీ తగిన మూల్యం చెల్లించుకోడానికి సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమయంలో మంత్రి లోకేశ్ కల్పించుకుని ఘాటుగా స్పందించారు. మహిళల జోలికి ఎవరు వెళ్లినా వదిలపెట్టమని తేల్చిచెప్పారు. తల్లి, చెల్లి జోలికి వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఎవరి తల్లి అయినా ఎవరి చెల్లి అయినా సరే తాము రక్షిస్తామని, మహిళలను అవమానించేవారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రెండు చిన్నమాటలు అన్నారని అంబటిని వెనకేసుకువచ్చారని మంత్రి లోకేశ్ ఆరోపించారు. ఈ సందర్భంగా తాము అలా అనలేదని బొత్స సమాధానం ఇవ్వగా, తాను మిమ్మల్ని అనలేదని మీ పార్టీకి అధ్యక్షుడు మీరు కాదని లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బెంగళూరులో ఉండే నాయకుడు గుంటూరు వచ్చి రెండు చిన్న మాటలు అన్నారని వెనకేసుకు వచ్చారని మరింత రెట్టించేలా లోకేశ్ ఎదురుదాడి చేశారు. దీంతో విపక్ష నేత బొత్స కల్పించుకుని అంబటి క్షమాపణ కోరినా దాడి చేశారన్న వాదనకు కట్టుబడి మరింత గట్టిగా అధికార పార్టీ సభ్యులతో వాదనకు దిగారు. ఇళ్లపై దాడి చేయడం ఏం సంస్కృతి అంటూ ప్రశ్నించారు. బొత్స ఆరోపణలపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ నెల్లూరులో తమ శాసనసభ్యురాలిపై వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేసినా ఏం చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ కార్యకర్త భారతీరెడ్డిని అవమానిస్తే తాము వెంటనే అరెస్టు చేసి రిమాండుకు తరలించామని చెప్పారు. మీరు ఐదేళ్లపాటు ఏం చేశారని నిలదీశారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలు కరెక్టా? కదా? అన్నది చెప్పాలని డిమాండ్ చేశారు. లోకేశ్ ప్రశ్నకు స్పందించిన విపక్ష నేత బొత్స మాట్లాడుతూ అంబటిని రెచ్చగొట్టేలా కొందరు వ్యవహరించారని, ఆయనను ఆయన తల్లిని తిట్టారని అన్నారు. ఏ తల్లిని అవమానించినా ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ క్రమంలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ బొత్స తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని స్పష్టం చేశారు. అంబటి తల్లిని ఎవరు అవమానించారని, అందుకు తగిన ఆధారాలు ఇస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే సమయంలో మంత్రి లోకేశ్ మళ్లీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు తల్లిని అవమానించేలా మాట్లాడితే వదిలేస్తామని ఎలా అనుకున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టమని స్పష్టం చేశారు.

ఇక సభలో లేని అంబటిపై దాదాపు అరగంట పాటు విస్తృత చర్చ జరిగింది. రాంబాబు వంటి వ్యక్తి కోసం ఎలా మాట్లాడుతున్నారని అధికార పక్ష సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తగా, ప్రభుత్వ తీరు సరిగా లేదని విపక్షం విరుచుకుపడింది. ఈ సందర్భంగా రాంబాబు గతంలో చేసిన ప్రకటనలు, గురువారం జైలు వద్ద తగ్గేదేలే అంటూ చేసిన సైగలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. పోలీసులు తన కుక్కను కూడా టచ్ చేయలేరన్న వ్యాఖ్యల వల్లే అరెస్టు చేయాల్సివచ్చిందని హోంమంత్రి అనిత తెలిపారు. మొత్తానికి అంబటి ఎపిసోడ్ శాసనమండలిని వేడెక్కించింది.

# ఏఐ దెబ్బకు ఐటీ కోటలు బద్ధలు: ఫ్రెషర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకమేనా?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు ఇంజినీరింగ్ పట్టా చేతికి రాగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం గ్యారెంటీ అనే ధీమా ఉండేది. కానీ ఇప్పుడు ఐటీ రంగం ముఖచిత్రం వేగంగా మారిపోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రవేశంతో సాంప్రదాయ ఉద్యోగ సమీకరణాలు తలకిందులవుతున్నాయి. ముఖ్యంగా కెరీర్ ప్రారంభించాలనుకునే ఫ్రెషర్లకు ఈ మార్పు ఒక అగ్నిపరీక్షగా మారింది.

**మారిపోతున్న కొలువుల లెక్కలు**

గతంలో ఫ్రెషర్లు చేసే డేటా ఎంట్రీ, బేసిక్ కోడింగ్, మాన్యువల్ టెస్టింగ్ , కస్టమర్ సపోర్ట్ వంటి పనులను ఇప్పుడు ఏఐ టూల్స్ రెప్పపాటులో పూర్తి చేస్తున్నాయి. కంపెనీలు తమ నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకోవడానికి ఆటోమేషన్ వైపు మొగ్గు చూపుతుండటంతో ఎంట్రీ-లెవల్ ఉద్యోగాల కోత మొదలైంది. 2023-2025 మధ్య ఎంట్రీ-లెవల్ ఉద్యోగ ప్రకటనలు 30-35% మేర తగ్గిపోయాయి. ఇంటర్న్‌షిప్ అవకాశాలు కూడా 15% క్షీణించాయి. మన దేశంలో ఐటీ హైరింగ్ దాదాపు 24% తగ్గింది. ఏటా 10 లక్షల మంది ఇంజినీర్లు బయటకు వస్తుండగా, వారికి సరిపడా 'స్టార్టర్' ఉద్యోగాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**మేనేజర్ల చూపు.. AI వైపు!**

ప్రస్తుత నివేదికల ప్రకారం.. సుమారు 60% మంది మేనేజర్లు జూనియర్ లెవల్ పనులను ఏఐ ద్వారానే చేయించాలని భావిస్తున్నారు. దీనివల్ల పని వేగవంతం అవ్వడమే కాకుండా మానవ తప్పిదాలు తగ్గుతాయని వారి నమ్మకం. అయితే ఏఐ ఇచ్చే ఫలితాల్లో 27-28% లోపాలు ఉంటున్నాయని.. అక్కడ మనుషుల పర్యవేక్షణ తప్పనిసరని కూడా గణాంకాలు చెబుతున్నాయి.

**నైపుణ్యాల కొరత.. భవిష్యత్తు ముప్పు**

కేవలం ఉద్యోగాల కోతే కాదు... దీనివల్ల భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన సీనియర్ లీడర్ల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఫ్రెషర్లుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే డొమైన్ నాలెడ్జ్ వస్తుంది. టీమ్ వర్క్ , సమస్య పరిష్కార నైపుణ్యాలు పనిలో అనుభవంతోనే లభిస్తాయి. గ్రౌండ్ లెవల్ పనులు చేయకుండా నేరుగా సీనియర్ బాధ్యతలు చేపట్టడం అసాధ్యం.

**ఫ్రెషర్లు ఏం చేయాలి? కొత్త యుగంలో రాణించే సూత్రాలు**

పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ నైపుణ్యం ఉన్నవారికి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. భయపడటం కంటే మారుతున్న కాలానికి అనుగుణంగా మారడమే ఏకైక మార్గం. కోడింగ్ మాత్రమే కాదు ఏఐ టూల్స్ వాడటం నేర్చుకోవాలి. ఏఐ ఇచ్చే ఔట్‌పుట్‌ను విశ్లేషించి, అందులోని తప్పులను సరిదిద్దే సామర్థ్యం పెంచుకోవాలి. కేవలం సర్టిఫికెట్లు కాకుండా రియల్ టైమ్ ప్రాజెక్టులు చేసి చూపించాలి. లింక్డ్ఇన్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నిపుణులతో సంబంధాలు పెంచుకోవాలి.

ఐటీ రంగంలో డిగ్రీ మాత్రమే సరిపోయే రోజులు పోయాయి. ఇప్పుడు "నిరంతర అభ్యాసం" మాత్రమే మిమ్మల్ని కాపాడుతుంది. ఏఐ అనేది మన ఉద్యోగాలను లాగేసుకునే శత్రువు కాదు... అది మన పనిని సులభతరం చేసే ఒక శక్తివంతమైన సాధనం. దాన్ని లొంగదీసుకున్న వాడే రేపటి విజేత.

# శివరాత్రి స్పెషల్: అక్కడ నో టోల్



**హైదరాబాద్ పెన్ పవర్:** శివరాత్రి దగ్గరకు వచ్చేసింది. శివభక్తులు ఎక్కువమంది వెళ్లాలనుకునే శైవక్షేత్రాల్లో శ్రీశైలం ఒకటి. దీంతో.. భక్తుల సంఖ్య భారీగా ఉండే వీలుంది. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖతో పాటు.. అటవీశాఖ సైతం భక్తులకు రెండు శుభవార్తల్ని చెప్పారు. అందులో ముఖ్యమైనది.. శ్రీశైలం వెళ్లే వారికి రాత్రి తొమ్మిది గంటల తర్వాత వాహనాల్ని అనుమతించని వైనం తెలిసిందే. అదే సమయలో ఉదయం 6 గంటల తర్వాతే అనుమతిస్తారు. నల్లమల అడవి మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది కాబట్టి.. ఈ నిబంధనల్ని అమలు చేస్తారు. శివరాత్రి పర్వదినం నేపథ్యంలో దీనిక సంబంధించిన కొన్ని మినహాయింపుల్ని అటవీ శాఖ ప్రకటించింది.

అందులో ముఖ్యమైనది ఈ నెల 13 నుంచి (ఈ రోజు నుంచి) పదహారు (సోమవారం) వరకు రాత్రి వేళల్లోనూ వాహనాల్ని అనుమతించనున్నారు. అంతేకాదు.. ఈ రోజుల్లో శ్రీశైలం వద్ద టోల్ రుసుముల్ని తీసుకోకుండా ఉచితంగా అనుమతిస్తారు. దీని కారణంగా పెద్ద ఎత్తున భక్తులకు మేలు కలుగుతుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా పెద్ద ఎతతున ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రస్తుతం శ్రీశైలంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే.

ఇప్పటివరకు 2.59 లక్షల మంది భక్తులు దర్శనాలు చేసుకున్నారు. మహా శివరాత్రి రోజున 1.50 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకునే వీలుంది. ఈ రద్దీకి అనుగుణంగా నంద్యాల - శ్రీశైలం మార్గంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు నడిచేలా ఏర్పాట్లు చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ తరపున 1800 బస్సులు ఏర్పాటు చేస్తే.. తలెంగా నుంచి వెయ్యి బస్సులు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులతో కలిపి మొత్తం మూడు వేల బస్సుల్ని అందుబాటులోకి రానున్నాయి. మొత్తంగా భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# బాలయ్యపై జోకులు.. అసెంబ్లీలో నవ్వులు!!




**హైదరాబాద్ పెన్ పవర్:** నట సింహం నందమూరి బాలయ్యపై జోకులు అసెంబ్లీలో నవ్వులు పూయించాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, బీజేపీఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మధ్య జరిగిన సంభాషణలో బాలయ్య పేరు తీసుకురావడం, ఆ సమయంలో పక్కనే ఉన్న బాలయ్య కూడా పగలపడి నవ్వడం ఆసక్తిరేపింది. ఏపీ అసెంబ్లీలో శుక్రవారం చోటుచేసుకున్న సరదా సంఘటన వైరల్ గా మారింది. ఎమ్మెల్యే హోదాలో అసెంబ్లీకి వెళ్లిన బాలయ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఏపీ అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు జోకులు వేసుకుంటూ హాయిగా నవ్వుకుంటున్నారు. అభిమానులను నవ్విస్తున్నారు. రెండు రోజుల నుంచి బడ్జెట్ సమావేశాలు జరుగుతుండగా, గవర్నర్ ప్రసంగానికి ధన్నవాదాలు తెలిపే తీర్మానంపై సభ్యులు మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మాట్లాడాల్సిన సమయం రాగా, సభాధ్యక్ష స్థానంలో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కూర్చొన్నారు. రఘురామ బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజును మాట్లాడాల్సిందిగా కోరగా, ఆయన తనకు అవకాశం ఇచ్చినందుకు గాను ధన్యవాదాలు తెలిపారు.

ఇక మాట్లాడేందుకు ఉపక్రమించిన సమయంలో తనకు ఎంత సమయం ఇస్తున్నారని ముందే అడిగి తెలుసుకున్నారు. కేవలం పది నిమిషాలలో ముగించాలని సభాధ్యక్షుడు రఘురామరాజు సూచించగా, విష్ణుకుమార్ రాజు చలోక్తి విసిరారు. "అధ్యక్ష.. నా పక్కన ఇంత పెద్ద హీరోను కూర్చో పెట్టుకున్నాను. అది చూసి కూడా మీరు పది నిమిషాలు అంటే ఎలా?" అంటూ నవ్వుతూ ప్రశ్నించారు. అంతేకాకుండా తన పక్కనే కూర్చున్న బాలయ్యను చూపించారు. దీనికి స్పందించిన రఘురామ కూడా నవ్వుతూ అందుకే పది నిమిషాలు ఇచ్చా లేదంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సభకు వచ్చేవరకు మాట్లాడమంటూ పర్మిషన్ ఇచ్చారు. ఈ సమయంలో బాలయ్య సైతం కల్పించుకుని చేతులు ఊపుతూ సరదాగా ఏవో వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో నవ్వులు విరిశాయి. సభాధ్యక్ష స్థానంలో ఉన్న రఘురామతోపాటు బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు సైతం పెద్దగా నవ్వారు. ఈ అరుదైన దృశ్యం చూపరులను ఆకర్షిస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ గా మారాయి. రఘురామ, విష్ణుకుమార్ రాజుకి మధ్య దశాబ్దాలుగా స్నేహం ఉంది.

ఈ ఇద్దరు చదువుకున్న సమయం నుంచే స్నేహితులు. ఈ విషయాన్ని విష్ణు గతంలోనే వెల్లడించారు. ఆ చనువుతో ఇద్దరు ఏ అవకాశం వచ్చిన ఒకరిపై ఒకరు చలోక్తులు విసురుకుంటుంటారు. ఈ సన్నివేశాలు, ఇద్దరి మధ్య సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి.

# ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీకి ఎంట్రీ!..3శాతం పడిపోయిన జొమాటో, స్విగ్గీ షేర్లు




న్యూఢిల్లీ: ఈకామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీలోకి వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది మేజూన్ మధ్య బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్ లాంచ్ చేసి, 2026 చివరికి లేదా 2027 ప్రారంభంలో పూర్తి స్థాయి సేవలను అందించాలని ఆలోచిస్తోందని ఎకనమిక్ టైమ్స్ రిపోర్ట్ చేసింది. సొంత ప్లాట్‌ఫారమ్ ద్వారా లేదా ఓఎన్‌డీసీ ద్వారా పనిచేయాలా అనే విషయంలో తుది నిర్ణయానికి రాలేదు. ఈ రిపోర్ట్‌తో జొమాటో, స్విగ్గీ షేర్లు గురువారం 3శాతం వరకు పడిపోయాయి. ప్రస్తుతం 9 బిలియన్ డాలర్ల విలువైన ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో ఈ రెండు కంపెనీల ఆధిపత్యం కొనసాగుతోంది. ఎటర్నల్ (జొమాటో) షేర్ 1.6శాతం తగ్గి రూ.295.9 వద్ద, స్విగ్గీ షేర్ 3శాతం తగ్గి రూ.331.75 వద్ద ట్రేడ్ అయ్యాయి. ఇటీవల బైక్ ట్యాక్సీ రాపిడో కూడా ఫుడ్ డెలివరీలోకి ఎంటర్ అయింది.

## ఉద్యోగులను తొలగించం.. నైపుణ్యాలను పెంచుతాం..ఎన్టీటీ బిజినెస్ సొల్యూషన్స్ గ్లోబల్ హెడ్




ఏఐ కారణంగా ఉద్యోగులను తొలగించబోమని ఎన్టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ గ్లోబల్ హెడ్ నోర్బర్ట్ రోటర్ అన్నారు. నైపుణ్యాలపై వారికి శిక్షణ ఇస్తామని ప్రకటించారు. తమ సంస్థ 'ఎస్‌ఏపీ' సేవల్లో ప్రపంచంలోనే అతిపెద్ద రీసెల్లర్ అని వెల్లడించారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన ట్రాన్స్‌ఫార్మేషన్ నౌ 2026 ఇండియా సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "ఇండియాలోని మా ఎనిమిది ఆఫీసుల్లో 4,300 మంది పనిచేస్తున్నారు.

విశాఖపట్నంలో 250 సీట్ల సామర్థ్యంతో కొత్త కేంద్రాన్ని వచ్చే నెలలో ప్రారంభిస్తాం. ఆదిలాబాద్‌లోని మోడల్ సెంటర్ 150 మంది ఉద్యోగులతో విజయవంతంగా నడుస్తోంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల డిజిటలైజేషన్ మా ప్రధాన లక్ష్యం. బీ2బీ పేమెంట్లను సులువుగా చేయడానికి ఎన్‌సీపీఐ భారత్‌తో ఒప్పందం చేసుకున్నాం" అని ఆయన వివరించారు.

## ఇష్టమొచ్చినట్టు ప్రవర్తిస్తే కుదరదు.. లోన్ ఏజెంట్లకు శిక్షణ తప్పనిసరి: ఆర్బీఐ




న్యూఢిల్లీ: లోన్ రికవరీ ఏజెంట్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు నియమించుకునే రికవరీ ఏజెంట్లకు శిక్షణ తప్పనిసరి చేస్తూ గురువారం కొత్త ముసాయిదా నిబంధనలు విడుదల చేసింది. లోన్ తీసుకున్న వారితో ఏజెంట్లు మాట్లాడే ప్రతి ఫోన్ కాల్ రికార్డ్ చేయాలని బ్యాంకులను ఆదేశించింది. ఏజెంట్లు వినియోగదారులతో గౌరవంగా ప్రవర్తించాలని స్పష్టం చేసింది. తిట్టడం లేదా అనుచిత సందేశాలు పంపడం వంటివి చేయకూడదు. ఇంట్లో ఎవరైనా చనిపోయినప్పుడు లేదా పెళ్లిళ్లు, పండుగలు వంటి సమయాల్లో లోన్ రికవరీ కోసం వెళ్లకూడదు. ఏజెంట్లు ఐఐబీఎఫ్ నిర్వహించే డెట్ రికవరీ శిక్షణను కచ్చితంగా పూర్తి చేయాలి. వినియోగదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా బ్యాంకులు జాగ్రత్తలు తీసుకోవాలి.

గతంలో జరిగిన కొన్ని వేధింపుల ఘటనల నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ కఠిన నిబంధనలను ప్రతిపాదించారు. రికవరీ ఏజెంట్ల వివరాలను బ్యాంకులు ముందుగానే తనిఖీ చేయాలని ఆర్‌బీఐ పేర్కొంది.

## మహీంద్రా నుంచి కొత్త ఈ-ఆటో.. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 200 కిలోమీటర్లు పరుగు



మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ సంస్థ ఉడో పేరుతో ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ను హైదరాబాద్‌లో గురువారం విడుదల చేసింది. విమానం డిజైన్ నుంచి స్ఫూర్తి పొంది దీనిని రూపొందించింది. ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.58 లక్షలు కాగా, కొంతకాలం తర్వాత రూ.3.84 లక్షలకు పెరుగుతుంది. ఉడోను ఒక్కసారి చార్జింగ్ చేస్తే 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఇందులో 11.7 కిలోవాట్ల ఐపీ67 రేటెడ్ బ్యాటరీ, 10 కిలోవాట్ల పీఎంఎస్ మోటార్ వాడారు. డ్రైవర్ సౌకర్యం కోసం పైలట్ సీటు ఉంటుంది. జహీరాబాద్ ప్లాంట్‌లో తయారయ్యే ఈ ఆటోపై ఆరేళ్లు లేదా 1.5 లక్షల కిలోమీటర్ల వారంటీ ఇస్తామని మహీంద్రా లాస్ట్ మైల్ ప్రకటించింది.

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్.. 1,048 పాయింట్లకు పైగా పడిపోన సెన్సెక్స్.. 4.62 లక్షల కోట్లు మాయం..



స్టాక్ మార్కెట్ ఈరోజు వరుసగా రెండవ రోజు కూడా తీవ్ర నష్టాలను చూసింది. ఐటీ స్టాక్‌లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా, బిఎస్ఇ సెన్సెక్స్ 1,048 పాయింట్లు (1.25 శాతం) పడిపోయి 82,626.76 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 50 ఇండెక్స్ కూడా 336 పాయింట్లు (1.3 శాతం) పడిపోయి 25,471.10 వద్ద ముగిసింది. ఈ ఫలితంగా బిఎస్ఇ-లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.4.62 లక్షల కోట్లు తగ్గి రూ.467 లక్షల కోట్లకు చేరుకుంది.

ఇక ఐటి స్టాక్‌లు వరుసగా రెండవ రోజు కూడా తీవ్ర క్షీణతను చూశాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో ఐటి ఇండెక్స్ 5 శాతం పడిపోగా.. సెన్సెక్స్‌లోని 30 స్టాక్‌లలో 26 క్షీణించాయి. ఇన్ఫోసిస్ 5 శాతానికి పైగా పడిపోగా, టిసిఎస్, హెచ్‌సిఎల్ టెక్ 4 శాతానికి పైగా పడిపోయాయి. భారతీ ఎయిర్‌టెల్, మారుతి సుజుకి, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బిఐ బ్యాంక్ స్వల్ప లాభాలను చూశాయి. గురువారం ప్రారంభంలో సెన్సెక్స్ 559 పాయింట్లు క్షీణించగా, నిఫ్టీ 146.65 పాయింట్లు పడిపోయింది.

**ఐటీ స్టాక్స్ భారీగా పతనం**

రెండు రోజుల్లో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 10 శాతం పడిపోయింది. టీసీఎస్, ఇన్ఫోసిస్ , విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ 4 నుంచి 6 శాతం వరకు పడిపోయాయి. దేశంలో రెండవ అతిపెద్ద ఐటీ కంపెనీ అయిన ఇన్ఫోసిస్ స్టాక్ బీఎస్ఈలో ట్రేడింగ్ సమయంలో దాదాపు 6 శాతం తగ్గి రూ.1,281.55కి చేరుకుంది, ఇది 52 వారాల కనిష్ట స్థాయి. టీసీఎస్ స్టాక్ కూడా 4 శాతానికి పైగా తగ్గి 52 వారాల కనిష్ట స్థాయి రూ.2,579కి చేరుకుంది.

# భారీగా తగ్గిన బంగారం, ఒక్కరోజే 15 వేలు పడిపోయిన వెండి.. కొత్త ధరలు ఇవే..




వరుసగా రెండో రోజు కూడా బంగారం ధరలు తగ్గడం సామాన్యులకు ఊరటనిస్తోంది. ప్రపంచ రాజకీయ ఉద్రిక్తలు, అంతర్జాతీయ మార్కెట్లో పరిణామాల మార్పుల వల్ల మన దేశంలో బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. ఈరోజు((ఫిబ్రవరి 13)న బంగారం ధరల చూస్తే 24 క్యారెట్ల బంగారం 1 గ్రాము ధర రూ.15,578 నిన్నటితో పోల్చితే రూ. 262 తగ్గింది. 10 గ్రాములు ధర 1,55,780, నిన్నటి కంటే రూ. 2,620 తగ్గింది.

22 క్యారెట్ల బంగారం 1 గ్రాము రూ. 14,280, నిన్నటి కంటే రూ. 240 తగ్గింది. 10 గ్రాములు ధర రూ. 1,42,800, నిన్నటి కంటే రూ. 2,400 తగ్గింది.

18 క్యారెట్ల బంగారం 1 గ్రాము ధర రూ. 11,684, నిన్నటితో పోల్చితే రూ. 196 తగ్గింది. 10 గ్రాములు ధర రూ.1,16,840, నిన్నటి కంటే రూ. 1,960 తగ్గింది.

ఇక వెండి ధరలు చూస్తే ఎన్నడూ లేనంతగా భారీ పతనమై ఈరోజు కుప్పకూలాయి. కిలో వెండి ఒకేసారి రూ. 15,000 తగ్గడం గమనార్హం. దింతో 1 గ్రాము వెండి ధర రూ. 280 ఉండగా, 10 గ్రాముల వెండి ధర రూ. 2,800, 1 కిలో వెండి ధర రూ. 2,80,000

ధరలు తగ్గడానికి కారణాలు చూస్తే అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఔన్సుకు 4,960 డాలర్ల వద్ద ఊగిసలాడుతున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం (వస్తువుల ధరల పెరుగుదల) గణాంకాలు వెలువడనుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉన్నారు. అమెరికా సెంట్రల్ బ్యాంక్ (ఫెడరల్ రిజర్వ్) వడ్డీ రేట్ల విషయంలో తీసుకునే నిర్ణయాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. వ్యాపార నిపుణుల అభిప్రాయం ప్రకారం, డాలర్ విలువ తగ్గడం లేదా అంతర్జాతీయంగా రాజకీయ అస్థిరతలు ఏర్పడితే తప్ప బంగారం ధరలు మళ్ళీ పెరిగే అవకాశం ప్రస్తుతానికి తక్కువగా ఉందన్నారు.

**ఈరోజు (13 ఫిబ్రవరి)న తెలుగు రాష్ట్రాల్లో బంగారం చూస్తే :**

1 గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.262 తగ్గి రూ.15,578, 22 క్యారెట్ల బంగారం ధర రూ.240 తగ్గి రూ.14,280, 18క్యారెట్ల బంగారం ధర రూ.196 తగ్గి రూ.11,684.

ఇక 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.2,620 తగ్గి రూ.1,55,780. 22 క్యారెట్ల బంగారం ధర రూ.2,400 తగ్గి రూ.1,42,800, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,960 తగ్గి రూ.1,16,840.

విజయవాడ, విశాఖపట్నం, అమరావతి, గుంటూరు, నెల్లూరు, కాకినాడ,

కడపలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,780, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,800, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,16,840.

హైదరాబాద్, వరంగల్,కరీంనగర్, ఖమ్మం లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,780, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,800, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,16,840.

ఈరోజు వెండి 1 గ్రాము ధర రూ.15 తగ్గి రూ.280, కేజీ ధర రూ.15,000 తగ్గి రూ.2,80,000.

# జారిపడే కొండంత ముప్పు!

పర్వతాలు, కనుమలు ఉన్న ప్రాంతాల్లో సంభవించే తీవ్రమైన ప్రకృతి విపత్తులే భూపాతాలు. అధిక వర్షాలు, భూకంపాలు, అగ్నిపర్వత పేలుళ్లు మొదలైన ప్రకృతి కారకాలతో పాటు అడవుల నరికివేత, ఏటవాలు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం, గనుల తవ్వకం తరహా మానవకారక చర్యలు ఇందుకు కారణమవుతున్నాయి. కొండచరియలు విరిగిపడటంతో నేల, రాళ్లు, మంచు మీదపడి, అందులో కూరుకుపోవడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగుతున్నాయి. దేశంలో హిమాలయాలు, ఈశాన్య రాష్ట్రాలతో పాటు పశ్చిమ కనుమల్లో తరచూ ఏర్పడుతున్న భూపాతాల స్వభావం, అందులో రకాలు, అవి కలిగించే నష్టాలు, ప్రభావం ఉండే ఇతర ప్రాంతాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వడగాలులు, శీతలగాలులు కూడా ప్రాణాంతకంగా మారుతున్న తీరు, ప్రపంచవ్యాప్తంగా అగ్నిపర్వత పేలుళ్ల ముప్పు తీవ్రత లాంటి అంశాలపైనా అవగాహన కలిగి ఉండాలి.

**భూపాతాలు**

శిలలు, మృత్తికలు, వాటితో నింపిన కృత్రిమ ప్రదేశాలు లేదా ఇవన్నీ కలిసిన పదార్థాలు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వేగంగా లేదా నెమ్మదిగా పడిపోవడం, జారిపోవడాన్ని 'భూపాతం' అంటారు.

భూపాత వైపరీత్యం: ఒక నిర్దిష్ట ప్రాంతంలో నష్టం కలిగించే భూపాతం సంభవించడాన్ని 'భూపాత వైపరీత్యం' అంటారు.

భూపాత దుర్బలత్వం: వైపరీత్యం వల్ల ప్రభావితమైన ప్రాంతంలో నిర్దిష్ట అంశాలకు లేదా అంశాల సమూహానికి జరిగే నష్టసామర్థ్యాన్ని తెలియజేస్తుంది. ఈ దుర్బలత్వాన్ని స్కేలుపై 0 (ఎలాంటి నష్టం లేకపోవడం) నుంచి 1 (పూర్తి నష్టం) మేరకు సూచిస్తారు.

భూకంపాలు, వరదలు సంభవించినప్పుడు; అగ్నిపర్వతాలు పేలినప్పుడు కూడా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉంటుంది.

భూపాతాలు ఎక్కువగా హిమాలయ పర్వత ప్రాంతాల్లో, ఈశాన్య రాష్ట్రాల్లో సంభవిస్తుంటాయి. వీటి తర్వాత పశ్చిమ కనుమలు, వింధ్య పర్వతాల్లో ఏర్పడుతున్నాయి.

దేశ భౌగోళిక విస్తీర్ణంలో 15% భూభాగంలో భూపాతాలకు ఆస్కారం ఉంది.

దేశంలో దాదాపు 20 రాష్ట్రాలు పలు తీవ్రతలున్న భూపాతాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి.

1980 నుంచి భారత దేశంలో భూపాత ముప్పు ప్రాంతాలను గుర్తించేందుకు 'ల్యాండ్ స్లైడ్స్ జోనేషన్ మ్యాపింగ్' పద్ధతిని ఉపయోగిస్తున్నారు.

కొండచరియలు విరిగిపడే విపత్తులకు సంబంధించి 'జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' 2004 నుంచి నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోంది.

1968, అక్టోబరు 2, 5 తేదీల మధ్య పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని డార్జిలింగ్ ప్రాంతం కుర్సియాంగ్ పట్టణం చుట్టూ ఉన్న తేయాకు తోటల్లో సంభవించిన అంబూటియా భూపాతాన్ని ఆసియాలో సంభవించిన అతిపెద్ద భూపాతంగా పరిగణిస్తారు.

**భూపాతాలు - రకాలు**

జారిపడటం, ఎగరడం, దొర్లడం ద్వారా లోతైన వాలులు లేదా శిఖరాల నుంచి వేరుపడిన పదార్థాల అనూహ్య చలనాలను 'ప్రపాతం' అంటారు.

మట్టి లేదా శిలలు నెమ్మదిగా, నిటారుగా కిందకు జారడాన్ని 'సర్పణం' లేదా 'పాకడం' అంటారు. ఇవి వంపు తిరిగిన చెట్ల కాండాలు, వంగిన కంచెలు లేదా రిటైనింగ్ గోడలు, పడిపోయిన స్తంభాలు లేదా కంచెలను తలపిస్తాయి.

మట్టి, రాళ్లు, సేంద్రియ పదార్థం లాంటివి గాలి, నీటితో కలిసి ముద్దగా ఏర్పడి, వేగంగా దిగువకు ప్రవహిస్తాయి. సాధారణంగా, లోతైన అవనాళికలతో కూడిన శిథిల ప్రవాహం ఏర్పడుతుంది.

అతివేగం నుంచి అసాధారణ వేగంతో కూడిన శిథిల ప్రవాహం.

అగ్నిపర్వత వాలు నుంచి ఏర్పడే బురద ప్రవాహం లేదా శిథిల ప్రవాహాన్ని 'లహర్' అంటారు.

ఆకస్మికంగా మంచు కరగడం లేదా హిమానీనదాల నుంచి నీరు పొంగిపొర్లడం, అగ్నిపర్వత విస్ఫోటాల వల్ల, జ్వాలాబిలం, సరస్సులు విచ్ఛిన్నమవడం వల్ల 'లహర్' ఏర్పడుతుంది.

కనీసం 50% ఇసుక, పోడు, బురద మట్టి ఉన్న తడి పదార్థం వేగంగా ప్రవహించడాన్ని 'పంకప్రవాహం' అంటారు.

పలు రకాల ద్రవ్యరాశి చలనాలన్నింటినీ 'భూపాతం' అంటారు. ఇది రెండు రకాలు. 1) భ్రమణ శీఘ్రపాతాలు 2) స్థలాంతర భూపాతాలు

ఒక రాతి ఖండం ముందుకు దొర్లడం లేదా తిరిగి వాలు నుంచి కిందకు జారడాన్ని 'కూలిపోవడం' అంటారు.

**భూపాతాలకు కారణాలు**

శిలలు లేదా మృత్తికా కూర్పు, నిర్మాణంలో బలహీనత కూడా భూపాతాలకు కారణమవుతోంది.

చెట్ల నరికివేత, రోడ్ల నిర్మాణం వల్ల పర్వత వాలుల అంచులు క్రమక్షయం చెంది, ఆ ప్రాంతాలు భూపాతాలకు గురయ్యే అవకాశం పెరుగుతుంది.

తీవ్రమైన వర్షపాతం వల్ల భూపాతాలు ఏర్పడతాయి. ఇవి ఎక్కువగా పశ్చిమ కనుమల్లో సంభవిస్తాయి.

భూకంపాల వల్ల భూపాతాలు ఏర్పడుతున్నాయి. ఇవి అధికంగా హిమాలయాలు, ఈశాన్య పర్వత ప్రాంతాలు, పశ్చిమ కనుమల్లో సంభవిస్తున్నాయి.

అగ్నిపర్వత విస్ఫోటం వల్ల భూపాతాలు ఏర్పడతాయి.

**హిమపాతం**

మంచు పర్వతం విరిగిపడటాన్ని 'హిమపాతం' (ఎవలాంచ్) అంటారు. ప్రపంచ భూపాతాల్లో 30% హిమాలయ పర్వత శ్రేణుల్లో సంభవిస్తున్నాయి.

భారతదేశ విస్తీర్ణంలో దాదాపు 85% భూభాగం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వైపరీత్యాల ముప్పును ఎదుర్కొంటోంది.

**వడగాలి**

వడదెబ్బ వల్ల మృతుల సంఖ్య పెరుగుతుండటంతో దీనిని కూడా ప్రధానమైన ప్రకృతి విపత్తుగా గుర్తించాలనే డిమాండ్ వస్తోంది. వడగళ్లు అస్సాం లోయలో అత్యధికంగా వస్తుంటాయి.

ఆ తర్వాత ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతాల్లో ఎక్కువగా వస్తాయి. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలో ఇసుక తుపాన్లు అత్యధికంగా సంభవిస్తాయి

శీతల పవనాల వల్ల ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి.


కంద్రం నిర్దేశించిన విపత్తుల జాబితాల్లో పిడుగుపాటుకు స్థానం లేనప్పటికీ, దానిని విపత్తుల జాబితాలో చేర్చడం ద్వారా మృతుల కుటుంబాలకు ఆర్థిక పరమైన భరోసా ఇవ్వాలని 2015, మే 30న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

**బారన్ అగ్నిపర్వతం**

ప్రపంచంలో ప్రస్తుతం 500 అగ్నిపర్వతాలు చురుగ్గా ఉన్నట్లు అంచనా. వీటిలో చాలాభాగం 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'లో ఉన్నాయి. వాటిలో 50 ఏటా బద్ధలవుతూనే ఉంటాయి. జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, మెక్సికో లాంటి దేశాలతో కూడిన వలయాన్ని 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'గా వ్యవహరిస్తారు. ఒక్క అమెరికాలోనే 50 క్రియాశీల అగ్నిపర్వతాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా శక్తిమంతమైన అగ్నిపర్వతాలు దాదాపు 1500 వరకు ఉండగా, వాటి పరిసరాల్లో 50 కోట్ల మంది నివసిస్తున్నారు.

అండమాన్ దీవుల్లోని బారన్ అగ్నిపర్వతం దేశంలోని ఏకైక క్రియాశీల అగ్నిపర్వతం. రికార్డుల ప్రకారం 1787లో దీని పేలుడును తొలిసారిగా గుర్తించారు. ఇటీవల కాలంలో 2010, సెప్టెంబరులో మరోసారి బద్దలై నాలుగు నెలల పాటు నిప్పులు కక్కుతూనే ఉంది.

# రోజూ వాడే ఉప్పు గురించి ఎవరికీ తెలియని నిజం..!



స్వచ్ఛమైన ఉప్పుకు గడువు తేదీ ఉండదు, కానీ ప్యాకెట్లపై కనిపించే తేదీ అయోడిన్, యాంటీ-కేకింగ్ ఏజెంట్ల ప్రభావం తగ్గడాన్ని సూచిస్తుంది. తేమ, గాలి తగలడం వల్ల అయోడిన్ పోషక విలువ క్షీణిస్తుంది, ఉప్పు ముద్దలుగా మారుతుంది. గడువు ముగిసినా, సరిగ్గా నిల్వ చేస్తే ఉప్పు సురక్షితమే; దాని పోషక విలువ మాత్రమే తగ్గుతుంది. గాలి చొరబడని కంటైనర్లలో నిల్వ చేయడం ఉత్తమం. వంటగదిలో అతి ముఖ్యమైన పదార్థం ఏది అంటే.. అందరూ ఠక్కున చెప్పే సమాధానం ఉప్పు అని. ఎందుకంటే? ఉప్పు లేకుండా ఏ వంటకం రుచికరంగా ఉండదు. కూర ఎంత మంచిదైనా చిటికెడు ఉప్పు లేకపోతే, ఆహారం తినకూడనిదిగా ఉంటుంది. అందుకే ఉప్పు లేని కూర వృధా అనే సామెత ఉంది. రుచిలో మాత్రమే కాకుండా ఆహారాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచడంలో కూడా ఉప్పు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అయితే, మనం ప్రతిరోజూ ఉపయోగించే ఈ ఉప్పుకు గడువు తేదీ ఉంటుందా..? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. మార్కెట్‌లో లభించే ఉప్పు ప్యాకెట్లపై గడువు తేదీని చూసి చాలా మంది అయోమయానికి గురవుతారు. నిజానికి స్వచ్ఛమైన ఉప్పు అంటే సోడియం క్లోరైడ్. ఇది ప్రకృతిలో త్వరగా చెడిపోదు. ఉప్పు తేమను ఆకర్షిస్తుంది. ఇది బ్యాక్టీరియా, సూక్ష్మజీవుల పెరుగుదలను తగ్గిస్తుంది. అయితే, మనం ఉపయోగించే టేబుల్ సాల్ట్ కేవలం ఉప్పు మాత్రమే కాదు. దానిలో అయోడిన్ కూడా కలుపుతారు. శరీరానికి అవసరమైన అయోడిన్‌ను అందించడానికి ఈ పద్ధతిని అవలంబిస్తారు. కాలక్రమేణా గాలి, వెలుతురు తగిలితే, అయోడిన్ కంటెంట్ తగ్గుతుంది. అందుకే తయారీదారులు ప్యాకెట్‌పై గడువు తేదీని సూచిస్తారు. దీని అర్థం ఉప్పు చెడిపోతుందని కాదు, కానీ, దాని పోషక విలువ తగ్గుముఖం పడుతుందని మాత్రమే సూచిస్తుంది. మరో కారణం కూడా ఉంది. ఉప్పు గాలి నుండి తేమను త్వరగా ఆకర్షిస్తుంది. దీనివల్ల అది గట్టిపడి రాతి ముక్కలుగా మారుతుంది. ఈ సమస్యను నివారించడానికి, యాంటీ-కేకింగ్ ఏజెంట్లు అనే పదార్థాలు కలిపి తయారు చేస్తారు. కొంతకాలం తర్వాత ఇవి వాటి ప్రభావాన్ని కోల్పోతాయి. అప్పుడు ఉప్పు ముద్దలుగా మారుతుంది. ఇది కేవలం నాణ్యత, వాడుకలో సౌలభ్యం విషయం మాత్రమే. కాబట్టి, గడువు ముగిసిన ఉప్పు దొరికితే, దానిని వెంటనే పారవేయాల్సిన అవసరం లేదు. అది పొడిగా, వాసన లేనిదిగా, కలుషితం కాకపోతే దానిని ఉపయోగించవచ్చు. అయితే, అయోడిన్ కంటెంట్ తక్కువగా ఉండవచ్చు. అందుకే గాలి చొరబడని కంటైనర్‌లో, తేమ లేని ప్రదేశంలో ఉప్పును నిల్వ చేయడం సరైన పద్ధతి. సరిగ్గా నిల్వ చేస్తే, ఉప్పును చాలా కాలం పాటు సురక్షితంగా ఉపయోగించవచ్చు.

# రోజుకు ఒకటి రెండు తింటే గుండెపోటుకు చెక్.!



ఇందులో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, అలాగే వివిధ రకాల యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అయితే చాలా గింజలు సంతృప్త కొవ్వులను కలిగి ఉంటాయి. అందుకే వాల్‌నట్స్‌ను ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. వాల్‌నట్స్ తినడం వల్ల చాలా అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయి.. వాల్‌నట్స్ అన్ని డ్రై ఫ్రూట్స్‌లో అత్యంత శక్తివంతమైనవిగా చెబుతుంటారు. వాల్‌నట్స్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండెపోటు, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించవచ్చని అనేక అధ్యయనాలు చూపిస్తున్నాయి. అందువల్ల శరీరాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి డ్రై ఫ్రూట్స్‌ను ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు వైద్య నిపుణులు. వాల్‌నట్స్ ఆరోగ్యంపై ప్రభావం చాలా శక్తివంతమైనది. ప్రతి డ్రై ఫ్రూట్ దాని ప్రయోజనాలను కలిగి ఉన్నప్పటికీ, వాల్‌నట్స్ వాటిలో అత్యంత శక్తివంతమైనవి. అలాగే ఆరోగ్యకరమైనవి. వాల్‌నట్స్‌లో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, అలాగే వివిధ రకాల యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అయితే చాలా గింజలు సంతృప్త కొవ్వులను కలిగి ఉంటాయి. అందుకే వాల్‌నట్స్‌ను ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. వాల్‌నట్స్ తినడం వల్ల చాలా అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయి. మెదడు: వాల్‌నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడు కణాల పెరుగుదలకు, న్యూరాన్‌ల మధ్య మెరుగైన జరిగే ప్రక్రియకు సహాయపడతాయి. వాల్‌నట్స్‌ను క్రమం తప్పకుండా తినడం వల్ల జ్ఞాపకశక్తితో పాటు ఆలోచన మెరుగుపడుతుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది: ఒత్తిడితో బాధపడేవారికి వాల్‌నట్స్ తినడం చాలా ప్రయోజనకరం. వాల్‌నట్స్‌లో ట్రిప్టోఫాన్ అనే రసాయనం ఉంటుంది. ఇది స్థిరమైన మానసిక స్థితిని కాపాడుకోవడానికి సహాయపడే సెరోటోనిన్ అనే హార్మోన్‌ను పెంచే అమైనో ఆమ్లం. దీని ప్రకారం.. ప్రతిరోజూ వాల్‌నట్స్ తినడం వల్ల ఒత్తిడి, ఆందోళన, నిద్ర సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. గుండెకు మంచిది: వాల్‌నట్స్ తినడం గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. వాల్‌నట్స్‌లో పాలీఫెనాల్స్, ఫైబర్ ఉంటాయి. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. వాల్‌నట్‌లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. బరువు తగ్గడం: బరువు తగ్గాలనుకునే వారికి వాల్‌నట్స్ తినడం కూడా ప్రయోజనకరం. వాల్‌నట్స్‌లో ఫైబర్, ప్రోటీన్ పుష్కలంగా ఉంటాయి. ఇది మీ కడుపు ఎక్కువసేపు నిండిన అనుభూతిని ఉంచడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో తినడం: వాల్‌నట్‌లను ముందు రోజు రాత్రి నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే ఖాళీ కడుపుతో వాటిని తినడం వల్ల వాల్‌నట్‌లోని పోషకాలు మీ శరీరంలోకి బాగా చేరుతాయి. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్‌లో వాల్‌నట్‌లను తినడం ఆరోగ్యానికి మంచిది. అయితే, ఎక్కువగా తినడం వల్ల శరీరంలో సమస్యలు వస్తాయి. మీరు ప్రతిరోజూ ఒకటి లేదా రెండు వాల్‌నట్‌లను తినవచ్చు.


# షుగర్ ఉన్నవారు సపోటా తింటే..?



డయాబెటిస్ అనేది రోగులు తమ ఆహారం పట్ల చాలా శ్రద్ధ వహించాల్సిన వ్యాధి. ఇంకా, వారు ఆరోగ్యకరమైన జీవనశైలిని కూడా నిర్వహించాలి. డయాబెటిస్‌కు చికిత్స లేదు, కానీ దానిని జీవితాంతం నియంత్రణలో ఉంచుకోవాలి. మీరు కూడా డయాబెటిస్‌తో బాధపడుతున్నారా..? అయితే, మీరు మీ ఆహారంలో పండ్లను చేర్చుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే కొన్ని రకాల పండ్లు మీ ఆరోగ్యాన్ని మరింత ప్రమాదంలోకి పడేలా చేస్తాయి. సపోటా.. మృదువైన గోధుమ రంగు పూతతో గుండ్రని పండు. ఇది తీపి రుచిని కలిగి ఉంటుంది. ఔషధ గుణాలకు నిలయమైన సపోటా రుచికి ఆహ్లాదకరంగా ఉండటమే కాకుండా లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. ఆయుర్వేద నిపుణులు, పోషకాహార నిపుణులు సపోటాను పోషకాలతో సమృద్ధిగా అభివర్ణిస్తారు. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సైన్స్ అండ్ రీసెర్చ్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం, విటమిన్లు ం, ః, అ, ఇ, కాల్షియం, ఫైబర్, మెగ్నీషియం, మాంగనీస్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో సహా దాని పోషకాలు ఎముక, ఊపిరితిత్తుల సమస్యలను తగ్గించడంలో, జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. అంతేకాకుండా, ఇది కంటి చూపును నిర్వహించడంలో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. చక్కెర వ్యాధితో బాధపడుతున్న వారు సపోటాను మితంగా తీసుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను నెమ్మదిగా గ్రహించడంలో సహాయపడుతుంది. అయితే ఇందులో సహజ చక్కెరలు కూడా ఉంటాయి కాబట్టి, ఎంత తినాలనే దానిపై శ్రద్ధ వహించడం ముఖ్యం. సపోటాలో ఉండే ఫైబర్ జీర్ణక్రియ సాఫీగా సాగడానికి సహాయపడుతుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. సపోటాలో ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సహజ చక్కెరలు ఉంటాయి. ఇవి త్వరగా శక్తిని అందిస్తాయి.

# ఉదయాన్నే ఏది తింటే ఆరోగ్యానికి మంచిది..?

మన జీవితంలో శారీరక దృఢత్వానికి పండ్లు ఎంతో కీలకం. ముఖ్యంగా రాత్రంతా ఖాళీగా ఉన్న కడుపులోకి ఉదయం పూట పండ్లు తీసుకుంటే, అవి ఇచ్చే శక్తి అద్భుతంగా ఉంటుంది. అయితే అల్పాహారంలో జామపండు తింటే మంచిదా లేక అరటిపండు తింటే మేలా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. జామపండును పోషకాల పవర్‌హౌస్ అని అంటారు. ఇందులో ఉండే విటమిన్ సి పరిమాణం నారింజ పండు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుంది. కేవలం 100 గ్రాముల జామలో 228 మి.గ్రా విటమిన్ సి లభిస్తుంది. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. తక్కువ కేలరీలు, అధిక పీచు పదార్థం ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారికి, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక. దీనిలోని తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అరటిపండు తక్షణ శక్తిని ఇచ్చే ఎనర్జీ బాంబ్ లాంటిది. ఉదయాన్నే వ్యాయామం లేదా జిమ్ చేసేవారికి ఇది దివ్యౌషధం. అరటిపండులో ఉండే సహజ చక్కెరలు, కార్బోహైడ్రేట్లు శరీరానికి వేగంగా శక్తిని అందిస్తాయి. ఇందులో పుష్కలంగా ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.



అంతేకాదు ఇందులోని విటమిన్ బి6 మెదడు పనితీరును మెరుగుపరుస్తూ.. రోజంతా మన మూడ్‌ని ఉత్సాహంగా ఉంచడానికి దోహదపడుతుంది. ఏది బెస్ట్..?: మరి ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలి అంటే అది పూర్తిగా మీ ఆరోగ్య లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మీరు షుగర్ లేదా బరువు తగ్గడం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లయితే జామపండు ఉత్తమమైనది. అలా కాకుండా రోజంతా శారీరక శ్రమ చేసేవారు లేదా తక్షణమే అలసట నుండి ఉపశమనం పొందాలనుకునే వారు అరటిపండును ఎంచుకోవడం మంచిది. వాస్తవానికి శరీరానికి అన్ని రకాల పోషకాలు అందాలంటే ఒకరోజు జామ, మరొకరోజు అరటిపండు మార్చి మార్చి తీసుకోవడం సరైన పద్ధతి. జాగ్రత్తలు: ఉదయం ఖాళీ కడుపుతో పండ్లు తీసుకునేటప్పుడు అవి మరీ పుల్లగా లేకుండా చూసుకోవాలి. అలాగే డయాబెటిస్ ఉన్నవారు అరటిపండు తీసుకునేటప్పుడు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. మీ జీవనశైలికి తగ్గట్టుగా సరైన పండును ఎంచుకుని మీ రోజును ఆరోగ్యంగా ప్రారంభించండి.

## ఉప్పు, జామకాయ కలిపి తింటున్నారా?



జామ మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి జీర్ణక్రియను మెరుగుపరచడం, మీ చర్మాన్ని మెరిసేలా చేయడం వరకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. జామకాయలో ఆపిల్ కంటే 10 రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. చాలా మంది ఆరోగ్యకరమైన జామకాయలను ఉప్పుతో తింటారు. విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉన్న జామకాయ ప్రయోజనాలు దాని రుచిని మించి ఉంటాయి. దాని తీపి, ఉప్పగా ఉండే రుచితో జామ మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి జీర్ణక్రియను మెరుగుపరచడం, మీ చర్మాన్ని మెరిసేలా చేయడం వరకు అనేక విధాలుగా మేలు చేస్తుంది. జామకాయలో ఆపిల్ కంటే 10 రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. చాలా మంది ఆరోగ్యకరమైన జామకాయలను ఉప్పుతో తింటారు. ఇలా తినటం సరైనదేనా..? జామకాయను ఉప్పుతో ముఖ్యంగా నల్ల ఉప్పు, లేదా రాతి ఉప్పుతో కలిపి తినడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అదనపు విటమిన్ సిని అందిస్తుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. ఉప్పు జామ రుచిని పెంచడమే కాకుండా ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేస్తుంది. అయితే, మీకు అధిక రక్తపోటు ఉంటే, తక్కువ ఉప్పును వాడండి. జామకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది నల్ల ఉప్పుతో కలిపితే మలబద్ధకం, ఆమ్లత్వం, ఉబ్బరం నుండి ఉపశమనం కలిగిస్తుంది. కాబట్టి, కడుపు సమస్యలను తగ్గించడానికి, మీరు ఖచ్చితంగా జామకాయను నల్ల ఉప్పుతో తినాలి. జామపండ్లలో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉప్పు ద్రవ సమతుల్యతకు కూడా సహాయపడుతుంది. ఇది రోగనిరోధక శక్తికి గొప్ప కలయికగా మారుతుంది. జామపండ్లలోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ), రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ఉప్పు ఎలక్ట్రోలైట్ సమతుల్యతకు సహాయపడుతుంది. జామపండ్లలోని ఫైబర్, తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి. జామపండ్లకు ఉప్పు వేసుకోవడం వల్ల అదనపు రుచితో పాటు అనే ప్రయోజనాలను పొందవచ్చు. ఉప్పు జామ రుచిని పెంచుతుంది. జామలోని ఫైబర్ మీకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది బరువు నియంత్రణకు సహాయపడుతుంది.

## ఖర్జూరం, పాలు 15రోజులు తాగండి చాలు..

## ఈ సమస్యలకి దూరంగా ఉండండి..!



మీరు ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవాలనుకుంటే, సాదా పాలకు బదులుగా ఖర్జూరంతో మరిగించిన పాలు తాగడం అలవాటుగా చేసుకోండి.. ఖర్జూరం పాలు రుచికరమైనవి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా అద్భుతమైనవి. ఎందుకంటే రెండూ పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. కలిపి తీసుకుంటే వాటి ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. ఖర్జూరంలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. మరోవైపు, పాలలో ప్రోటీన్, కాల్షియం, విటమిన్ డి, బి12 ఉంటాయి. ఇవి శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మీరు ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవాలనుకుంటే, సాదా పాలకు బదులుగా ఖర్జూరంతో మరిగించిన పాలు తాగడం అలవాటుగా చేసుకోండి.. ఖర్జూరం పాలు రుచికరమైనవి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా అద్భుతమైనవి. ఎందుకంటే రెండూ పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. కలిపి తీసుకుంటే వాటి ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. ఖర్జూరం పాలు ఎలా తయారు చేయాలి?..ఉపయోగాలేంటో పూర్తి వివరాల్లోకి వెళితే? పాలల్లో ఖర్జూరం కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయంటున్నారు పోషకాహార నిపుణులు. ఇవి మీకు తక్షణ శక్తిని అందిస్తుంది. వీటిలోని సహజమైన షుగర్ ఇన్?స్టాంట్ ఎనర్జీని ఇస్తాయి. ఎముకల బలానికి మంచిది. వీటిలో మినరల్స్, పొటాషియం, కాపర్, మెగ్నీషియం ఎముకల బలానికి మేలు చేస్తాయి. జీర్ణ సమస్యలు దూరమవుతాయి. మలబద్ధకం తగ్గుతుంది. గట్ హెల్త్? మెరుగవుతుంది. బీపీని కంట్రోల్?లో ఉంచడంలో హెల్ప్ చేస్తుంది. కాబట్టి రక్తపోటుతో ఇబ్బంది పడేవారు హాయిగా తీసుకోవచ్చు. బీపీని కంట్రోల్?లో ఉంచడంలో హెల్ప్ చేస్తుంది. కాబట్టి రక్తపోటుతో ఇబ్బంది పడేవారు హాయిగా తీసుకోవచ్చు. బరువు పెరగడంలో హెల్ప్ చేస్తుంది. రెండిటీలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. ఆరోగ్యకరంగా బరువు పెరుగుతారు. దీనికోసం ముందుగా 1 గ్లాసు పాలు తీసుకోండి. 3 నుంచి 5వరకు ఖర్జూరాలను సగానికి కోసి విత్తనాలను తొలగించండి. పాలలో ఖర్జూరాలు వేసి కొన్ని నిమిషాలు మరిగించాలి. గోరువెచ్చగా ఉండగానే తాగేయాలి. మీరు దానిని రాత్రంతా అలాగే ఉంచి ఉదయం ఖాళీ కడుపుతో కూడా తీసుకోవచ్చు. ఖర్జూరం పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాల: బలహీనతను అధిగమించడానికి, శక్తిని తిరిగి పొందడానికి మీరు ఖర్జూర పాలను తీసుకోవచ్చు. ఖర్జూరంలోని సహజ చక్కెర అలసటను తగ్గిస్తుంది. అయితే పాలు దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి.ఖర్జూరాలు ఇనుముకు మంచి మూలం. రక్తహీనతతో బాధపడేవారు పాలలో మరిగించిన ఖర్జూరాన్ని త్రాగాలి. ఇది హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది.

## పండిన అరటి పండ్లతో దోసెలు..

## వీటిని ఒక్కసారి తింటే అస్సలు వదిలిపెట్టరు?

ఇప్పటి వరకు ఎన్నో రకాల దోసెలను తినే ఉంటారు. మరి అరటి దోసెను తిన్నారా? వినడానికి కొత్తగా ఇది చేసుకుని తింటే రుచి అద్భుతంగా ఉంటుంది. పండిన అరటి పండ్లతో దోసె వేసుకుని తింటే ఆహా ఓహో అంటూ లాగిస్తూనే ఉంటారు. దీనికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం గురించి ఇక్కడ తెలుసుకుందాం. మన దేశంలోనే కాదు.. అన్ని చోట్లా దోసె చాలా ఫేమస్. దీనిని ఎంతో మంది ఇష్టంగా తింటారు. కొందరు ఉదయం, ఇంకొందరు సాయంత్రం ఇలా ఎప్పుడు పడితే అప్పుడు తింటూనే ఉంటారు. సమయం, సందర్భం అంటూ ఏమీ ఉండదు.

కావలసిన పదార్థాలు: 3 అరటిపండ్లు, గోధుమ పిండి లేదా బియ్యం పిండి తీసుకున్నా కూడా సరిపోతుంది, బెల్లం తురుము, యాలకుల పొడి, నూనె, ఒక గ్లాస్ నీరు. ఒక బౌల్ ను తీసుకొని దానిలో పండిన అరటిపండ్లను పేస్ట్ లా చేసుకోవాలి. ఇప్పుడు దానిలో మీరు ఏ పిండి తీసుకుంటే దానిని వేసి, కట్ చేసి పెట్టుకున్న బెల్లం ముక్కలు, కొద్దిగా యాలకుల పొడి వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి. ఇక ఇప్పుడు, దానిలో కొంచం నీళ్ళు పోసి బాగా కలుపుకోవాలి. మరి, పేస్ట్ లా కాకుండా నార్మల్ దోసె పిండి లాగా ఉంటే చాలు. అప్పుడు దోసెను రెండు వైపులా పెనం మీద సులభంగా కాల్చవచ్చు. ఇక ఇప్పుడు పాన్ పెట్టి దానిలో కొంచం నూనె వేసి అది వేడయ్యాక, ఒక గరిటెడు పిండిని పోసి దోస లాగా వేయండి. మరి పలుచగా కాకుండా, కొంచం మృదువుగా ఉండేలా వేయండి. ఒక రెండు నిముషాలు అలాగే ఉంచి , రెండు వైపులా కాలిన తర్వాత ఆ దోసెను ప్లేట్ లోకి తీసుకోండి. అంతే వేడి వేడి అరటి దోసె రెడీ. అయితే, దీనినిమీరు నెయ్యితో తింటే రుచి అద్భుతంగా ఉంటుంది.

# జడేజా కాదు.. రాజస్థాన్ రాయల్స్ కొత్త కెప్టెన్‌శ్రీగా అతడే..?




**హైదరాబాద్ పెన్ పవర్:** రాజస్థాన్ రాయల్స్ జట్టు ఐపీఎల్‌లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. తమ కొత్త కెప్టెన్‌గా రియాన్ పరాగ్ ను ప్రకటించింది. సంజూ శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్‌కి మారిన తర్వాత జట్టు నాయకత్వంలో ఈ మేరకు మార్పులు చేసింది జట్టు యాజమాన్యం. 2019లో ఐపీఎల్ లో అరంగేట్రం చేసిన పరాగ్, గత ఏడు సీజన్లుగా రాజస్థాన్ రాయల్స్‌కే ఆడుతూ ఫ్రాంచైజీకి నమ్మకస్తుడిగా ఉన్నాడు. యువతకు ప్రాధాన్యం ఇస్తూ, తమ నిబద్ధతను టీం మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. గత ఐపీఎల్ సీజన్‌లో సంజు శాంసన్ గాయపడిన సమయంలో రియాన్ పరాగ్ 8 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2 విజయాలు, 6 పరాజయాలు అతడి సారథ్యంలో ఉన్నాయి. పరాగ్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. ఆ మ్యాచ్‌ల్లో సగటు 38.57తో రాణించిన పరాగ్, కేకేఆర్ పై 95 పరుగులు సాధించాడు. ఇప్పటివరకు 84 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన రియాన్ 1,566 పరుగులు సాధించాడు. స్ట్రైక్‌రేట్ 141.84గా ఉంది. 2024 సీజన్ అతనికి బ్రేక్‌త్రూ అయ్యింది. ఆ ఏడాది 573 పరుగులు (స్ట్రైక్‌రేట్ 149.21) చేసి మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా తన స్థానాన్ని మరింత బలపర్చుకున్నాడు. గత సీజన్‌లో స్ట్రైక్‌రేట్ పెరిగినా, మొత్తం పరుగులు 393కే పరిమితమయ్యాయి. తనను కెప్టెన్ గా నియామించడంపై రియాన్ పరాగ్ మాట్లాడుతూ.. రాజస్థాన్ రాయల్స్ నా ఐపీఎల్ కుటుంబం.. మొదటి రోజు నుంచే ఈ ఫ్రాంచైజీ నన్ను ప్రోత్సహించింది.. ఇప్పుడు ఈ జట్టుకు నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నాను అన్నారు. కోచింగ్ స్టాఫ్‌తో కలిసి జట్టును నడిపిస్తాను, అభిమానులను గర్వపడేలా చేస్తామని పేర్కొన్నారు. మరోవైపు, రియాన్ పరాగ్‌ను జట్టు ప్రధాన కోచ్ కుమార సంగక్కర ప్రశంసించారు. ఈ మేరకు పరాగ్ హై-ఇంపాక్ట్ ప్లేయర్, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడగలడు.. ఆటపై అతనికి మంచి అవగాహన ఉంది.. డ్రెస్సింగ్ రూమ్‌లో అతనికి గౌరవం ఉంటుంది... కెప్టెన్‌గా అతను మరింత రాణిస్తాడని నమ్మకం ఉందని చెప్పారు. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ తో ప్లేయర్ ట్రేడ్‌లో భాగంగా రవీంద్ర జడేజా, సామ్ కరన్ లను రాజస్థాన్ రాయల్స్ తీసుకుంది. అదే సమయంలో శాంసన్ చెన్నైకి వెళ్లాడు.

# ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ వర్షార్పణం..? ఫిబ్రవరి 15న బంగాళాఖాతంలో అల్పపీడనం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిబ్రవరి 15న జరగాల్సిన ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్‌శ్రీకు వాన ముప్పు పొంచి ఉంది. ఈ విషయాన్ని స్వయంగా శ్రీలంక వాతావారణ శాఖ బులిటెన్ విడుదల చేసి మరీ వెల్లడించింది. శ్రీలంక వాతావరణ శాఖ విడుదల చేసిన ప్రత్యేక వాతావరణ బులెటిన్ ప్రకారం.. ఫిబ్రవరి 15 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ అల్ప పీడనం ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. శ్రీలంకలోని కొలంబో ప్రేమదాస స్టేడియంలో ఆదివారం (ఫిబ్రవరి 15) జరగాల్సిన ఇండియా, పాక్ మ్యా కోసం కోట్ల మంది అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. కానీ.. ఈ మ్యాచ్‌శ్రీకు వరుణ గండం తప్పేలా లేదు. మ్యాచ్ రోజు కొలంబోలో నల్లగా కారు మేఘాలు కమ్ముకునే అవకాశం ఉందని.. వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో స్పష్టమైంది.

# వరల్డ్ కప్‌లో జింబాబ్వే సంచలన విజయంపై సచిన్ స్పందన

- టీ20 ప్రపంచకప్‌లో సంచలనం సృష్టించిన జింబాబ్వే
- ఆస్ట్రేలియాపై 23 పరుగుల తేడాతో ఘన విజయం
- జింబాబ్వే గెలుపును 'స్టేట్‌మెంట్ విన్' అంటూ కొనియాడిన సచిన్
- నాలుగు వికెట్లతో ఆసీస్‌ను కుప్పకూల్చిన బ్లెస్సింగ్ ముజరబానీ
- హాఫ్ సెంచరీతో పోరాడినా ఆస్ట్రేలియాను గెలిపించలేకపోయిన రెన్‌షా




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో ఆస్ట్రేలియాపై జింబాబ్వే సంచలన విజయం సాధించడాన్ని భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసలతో ముంచెత్తారు. ఇది జింబాబ్వే నుంచి వచ్చిన ఒక 'స్టేట్‌మెంట్ విన్' అని అభివర్ణించారు. "ఆస్ట్రేలియాను 23 పరుగుల తేడాతో ఓడించాలంటే నిజమైన పట్టుదల కావాలి. జింబాబ్వే బౌలర్ బ్లెస్సింగ్ తన పేరుకు తగ్గట్టే నాలుగు వికెట్లతో జట్టుకు వరంలా మారాడు. ఈ టోర్నమెంట్ ఎంతో ఉత్కంఠగా సాగుతోంది" అని సచిన్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఆర్ ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పేసర్లు బ్లెస్సింగ్ ముజరబానీ (4 వికెట్లు), బ్రాడ్ ఎవాన్స్ (3 వికెట్లు) అద్భుతంగా రాణించడంతో ఆస్ట్రేలియాను జింబాబ్వే 19.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ చేసింది. ఫలితంగా 23 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. అంతకుముందు, బ్రియాన్ బెన్నెట్ (64 నాటౌట్) అద్భుత హాఫ్ సెంచరీతో రాణించడంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 169 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఓపెనర్ మరుమాని (35), ర్యాన్ బర్ల్ (35) కూడా కీలక పరుగులు చేశారు. 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. మాట్ రెన్‌షా (65) ఒంటరి పోరాటం చేశాడు. గ్లెన్ మ్యాక్స్‌వెల్‌తో కలిసి 77 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో ఆస్ట్రేలియాకు ఓటమి తప్పలేదు. జింబాబ్వే ఫీల్డింగ్‌పై భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా ప్రశంసలు కురిపించారు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఆస్ట్రేలియాపై జింబాబ్వేకి ఇది రెండో విజయం కావడం విశేషం. గతంలో 2007లో జరిగిన తొలి వరల్డ్‌కప్‌లోనూ ఆసీస్‌పై జింబాబ్వే గెలిచింది.

రాశి ఖన్నా యొక్క అద్భుతమైన ను సిటీ స్వరూపం



# ప్రభాస్ ఇకపై వారికి దూరంగా ఉంటాడా?



ప్రభాస్ చేసిన బాహుబలి తరువాత పాన్ ఇండియా సినిమాల ప్రభావం పెరిగిపోయింది. ఇప్పుడు ఎవరిని రదిలించినా పాన్ ఇండియా అంటున్నారు. ఇందులో కొంత మంది సక్సెస్‌లు కూడా సాధిస్తున్నారు. బడ్జెట్ మూవీస్ చేస్తూ ఐదు భాషల్లోనూ భారీగా రిలీజ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే మన టాలీవుడ్ సీనియర్ స్టార్స్ ఇప్పుడు ట్రాక్ మార్చారు. యంగ్ డైరెక్టర్లతో సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. కొత్త తరహా కథలతో వస్తుండటం, జెన్‌జీ ఆడియన్స్‌ని ఆకట్టుకుంటుండటంతో యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్లకు అవకాశాలు ఇస్తున్నారు. ఈ విషయంలో ముందు వరుసలో నిలిచిన హీరో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్. యంగ్ అండ్ నాన్ ఫేమ్ డైరెక్టర్స్‌కి అవకాశాలిచ్చాడు. 2013 నుంచి నిన్నటి 2025 వరకు దాదాపు ఐదుగురు డైరెక్టర్లకు డైరెక్టర్స్‌గా ప్రూవ్ చేసుకునే ఛాన్స్ ఇచ్చాడు. అందులో ఒక్కరంటే ఒక్కరు మాత్రమే ప్రభాస్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చారు. కానీ మిగతా నలుగురు డైరెక్టర్స్ మాత్రం తీవ్రంగా నిరాశపరిచారు. రీసెంట్‌గా ప్రభాస్ యంగ్ డైరెక్టర్‌కి అవకాశం ఇవ్వాలని చేసిన హారర్ కామెడీ ప్రభాస్ కెరీర్‌లోనే భారీ డిజాస్టర్‌గా నిలిచి అభిమానుల్ని షాక్‌కు గురి చేసిన విషయం తెలిసిందే. నార్మల్ డైరెక్టర్స్‌కి ప్రూవ్ చేసుకునే అవకాశం ఇస్తున్నా కానీ వారు దాన్ని సద్వినియోగం చేసుకోకపోవడంతో ప్రభాస్ మైండ్ సెట్‌లో మార్పులు వచ్చినట్టుగా తెలుస్తోంది. తాజా పరిణామాలు, ఫలితం నేపథ్యంలో ప్రభాస్ ఈ విషయంలో మారినట్టుగా చెబుతున్నారు. సినిమా మేకింగ్ విషయంలో కావాల్సిన విధంగా సహకరించినా, అనుకున్నన్ని డేట్స్ కేటాయించినా వాటిని సక్రమంగా ఉపయోగించుకోవడంలో ఫెయిల్ అవుతుండటంతో ప్రభాస్ ఇప్పుడు విమర్శల్ని ఎదుర్కొంటున్నాడు. రీసెంట్‌గా విడుదలైన ప్రభాస్ హారర్ కామెడీ ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోగా కథ, కథనాలు అస్తవ్యస్తంగా ఉండటం, తన స్టార్‌డమ్ స్థాయికి తగ్గట్టుగా ఏమాత్రం లేకపోవడంతో ఇలాంటి డైరెక్టర్లకు అవకాశాలు ఎందుకు ఇస్తున్నాడని, తన గ్రాఫ్‌ని తానే తగ్గించుకుంటున్నాడనే విమర్శలు ఎదుర్కొంటున్నాడు. మూడు నాలుగేళ్ల క్రితం ఇద్దరు డైరెక్టర్లకు ఛాన్స్ ఇచ్చి ప్రభాస్ తీవ్ర విమర్శలు ఎదుర్కోవడం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు కూడా అదే పరిస్థితిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సంచలన నిర్ణయం తీసుకున్నాడని ఇన్ సైడ్ టాక్. ఇకపై వీఎఫ్ ఎక్స్ వర్క్ మీద అనుభవం లేని డైరెక్టర్లతో పీరియాడిక్, ఫాంటసీ సినిమాలు చేయకూడదని ప్రభాస్ నిర్ణయించుకున్నాడట. అలా ఎక్స్‌పీరియన్స్, వాటిపై పట్టులేని వారితో కలసి పని చేస్తే ఔట్‌పుట్ చాలా పూర్‌గా ఉంటుందని ఇటీవల రెండు సినిమాలు నిరూపించడంతో ప్రభాస్ ఇకపై ఆ విషయాల్లో పూర్తి స్థాయిలో అనుభవం ఉన్న వారితోనే అలాంటి మూవీస్ చేయాలని నిర్ణయించుకున్నాడని ప్రచారం జరుగుతోంది.

కయదు లోహర్ రీగల్ చీర లుక్



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965